www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



కాళేశ్వరం వద్ద గోదావరి నదిలో భక్తుల స్నానాలు

ముగిసిన సరస్వతి పుష్కరాలు

చివరి రోజు 2.25 లక్షల మంది రాక

మొత్తంగా 15.9 లక్షల మంది హాజరు

పొరపాట్లు జరిగి ఉంటే క్షమించాలి

గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తాం.. వేడుకల ముగింపులో మంత్రి శ్రీధర్‌బాబు

14

మంగళవారం | 27-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 58 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య ఉ.8.31 తదుపరి జ్యేష్ఠ శు. పాడ్యమి తె.5.02, నక్షత్రం: రోహిణి రా.2.50 తదుపరి మృగశిర, వర్జ్యం: రా.7.44-9.09, దుర్ముహూర్తం: ఉ.8.19-9.11, రా.10.17-11.00, అమృతఘడియలు: రా.11.59-1.24, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 5.44, సూర్యాస్తమయం: 6.40 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పీసీసీ పదవులు కొలిక్కి!

రాహుల్ స్ఫూర్తితోనే కుల గణన

తెలంగాణలో పారదర్శకంగా చేశాం

ఢిల్లీలో కాంగ్రెస్ ఓబీసీ రౌండ్ టేబుల్ సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్

14

ఏ క్షణమైనా ప్రకటన వెలువడే అవకాశం

రాహుల్ గాంధీతో కేసీ వేణుగోపాల్, మహేశ్ గౌడ్ భేటీ

మంత్రివర్గ విస్తరణపై జూన్ మొదటివారంలో స్పష్టత

ఖర్గే లేకపోవడంతో మళ్లీ రావాలని అధిష్ఠానం సూచన

30న మరోసారి ఢిల్లీకి ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు

మంత్రివర్గ విస్తరణను త్వరగా ఆమోదించండి

బీసీలకు ప్రాధాన్యమివ్వండి.. రాహుల్‌కు మహేశ్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ, హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) పదవులపై కసరత్తు కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. ఏ క్షణమైనా ప్రకటన వెలువడే అవకాశమున్నట్టు కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలిసింది. ఆదివారం సాయంత్రం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ నివాసంలో సీఎం, పీసీసీ అధ్యక్షుడు సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీలోనే కమిటీలపై కసరత్తు

మిగతా 13వ పేజీలో...

ఎన్‌డీఎస్‌ఏ నివేదికను తిరస్కరిస్తున్నాం

పరీక్షలు చేయకుండానే మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యంపై అభిప్రాయానికి ఎలా వస్తారు?

నీటిపారుదల శాఖకు ఎల్‌అండ్‌టీ లేఖ

కాళేశ్వరంపై బాధ్యత అంతా కేసీఆర్‌దే!

నాటి ఆర్థిక మంత్రిగా నా అభిప్రాయాలతో పని లేకుండానే బడ్జెట్ కేటాయింపులు

కమిషన్‌కు ఈ విషయాలే చెప్పనున్న ఈటల?

6న కాళేశ్వరం కమిషన్ ముందు హాజరు

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యంపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) నివేదికను తిరస్కరిస్తున్నట్టు ఆ బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ-పీఈఎస్ జాయింట్ వెంచర్ ప్రకటించింది. మేడిగడ్డ బ్యారేజీపై ఎన్‌డీఎస్‌ఏ చేసిన పరిశీలనలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని పేర్కొంది. ఈ మేరకు నీటిపారుదల శాఖకు ఈ నెల 24న సంచలన లేఖ రాసింది. ఎన్‌డీఎస్‌ఏ నివేదికలోని ఎగ్జిక్యూటివ్ సమ్మరీలో

మిగతా 14వ పేజీలో...



మేడిగడ్డ బ్యారేజీలో పగుళ్లు (ఫైల్)

కేటీఆర్‌కు మళ్లీ శ్రీముఖం

ఫార్ములా-ఈ రేసు కేసులో ఏసీబీ నోటీసు.. రేపు విచారణకు రావాలని ఆదేశం

ముందే నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం విదేశాలకు వెళ్తున్నా

తిరిగి వచ్చిన తర్వాత హాజరవుతా: ఏసీబీకి కేటీఆర్ సమాధానం

'నేషనల్ హెరాల్డ్'లో రేవంత్ పాత్రపై బీజేపీ నేతలు మాట్లాడడం లేదేమని నిలదీత



హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో మరో కీలక పరిణామం. ఈ కేసులో అవినీతి, అవకతవకలకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, అప్పటి మునిసిపల్, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈనెల 28న (బుధవారం) తమ ఎదుట విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ రేసు నిర్వహణలో అక్రమాలు జరిగాయని, ప్రభుత్వ ఖజానాకు రూ.54.88 కోట్ల నష్టం జరిగిందని, దీనిపై దర్యాప్తు జరపాలంటూ గత ఏడాది అక్టోబరు 18వ తేదీన మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేశారు. అప్పట్లో క్యాబినెట్, ఆర్థిక శాఖ ఆమోదం తీసుకోకుండానే ఫార్ములా-ఈ ఆపరేషన్స్ లిమిటెడ్ (ఎఫ్ఈవో)కు హెచ్ఎండీఏ ఈ చెల్లింపులు చేసిందని పేర్కొన్నారు. ఈ రేసు నిర్వహణకు, హెచ్ఎండీఏకు ఎటువంటి

మిగతా 14వ పేజీలో...

వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే..

కేటీఆర్‌కు నోటీసులు: కవిత

రేవంత్‌రెడ్డివి ప్రతీకార రాజకీయాలు: హరీశ్‌రావు

14

సిరిసిల్లలో కాంగ్రెస్ X బీఆర్ఎస్

కేటీఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం ఫొటో పెట్టాలని కాంగ్రెస్ డిమాండ్

రేవంత్‌రెడ్డి ఫొటోతో కార్యాలయం వద్దకు రాక

అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకులు

ఉద్రిక్తత.. పోలీసుల లాఠీచార్జి

14



మానవ బాంబులుగా స్లీపర్ సెల్స్!

దేశంలో భారీ పేలుళ్లకు సిరాజ్ పథకం

డబ్బు ఆశ చూపి 12 మందికి ఎర

పేలుళ్లకు విజయనగరమే తొలి టార్గెట్?

విచారణలో కీలక విషయాల గుర్తింపు

విజయనగరం/క్రైం, మే 26(ఆంధ్రజ్యోతి): దేశంలో భారీ పేలుళ్లకు సిరాజ్ కుట్రలు పన్నాడని, ఇందుకోసం పలు రాష్ట్రాల్లో అమాయక, నిరుద్యోగ ముస్లిం యువకులకు డబ్బులు ఎరవేసి ఉగ్రవాద ఉచ్చులోకి దించాడని ఎన్ఐఏ, కౌంటర్ ఇంటెలిజెన్స్, పోలీసు అధికారులు విచారణలో గుర్తించినట్లు తెలిసింది. ఇందుకోసం సిరాజ్, సమీర్‌లు సిగ్నల్ యాప్‌ను ఎంచుకున్నారు. ఇతర యాప్‌లను వినియోగిస్తే నిఘా సంస్థలు పసిగట్టే అవకాశం ఉందని.. అందుకే సిగ్నల్ యాప్‌ను ఎంచుకున్నట్లు విచారణలో వారు వెల్లడించినట్లు విశ్వసనీయ సమాచారం. సిరాజ్ ఈ స్లీపర్ సెల్స్‌ను మానవ బాంబులుగా మార్చాలనుకున్నాడని, ఇందుకోసం దేశంలో 12 మంది యువకులతో కమ్యూనికేషన్ ఏర్పాటు చేసుకున్నట్లు తేలింది. ఈ కోవలోనే 4వ రోజు సోమవారం విచారణ కొనసాగినట్లు సమాచారం. 12 మంది యువకులను స్లీపర్ సెల్స్‌గా ఏర్పాటు చేసి, వారిని మానవ బాంబులుగా పేల్చాలని సిరాజ్

మిగతా 13వ పేజీలో...

రాయబారం.. విఫలం!

కవితతో ఫలించని కేసీఆర్ దూతల చర్చలు



కేసీఆర్ ఆదేశాలతో కవిత నివాసానికి దామోదరరావు, గంద్ర మోహనరావు

3 గంటలపాటు కొనసాగిన చర్చలు

పార్టీకి, కుటుంబానికి నష్టమంటూ వివరణ

ఫోన్లో మాట్లాడిన కేసీఆర్

తొందరపడొద్దని కుమార్తెకు సూచన

పార్టీలో తన పరిస్థితి ఏమిటో ఇప్పుడే స్పష్టం చేయాలని పట్టుబట్టిన కవిత

లేకపోతే తన దారి చూసుకుంటానని వెల్లడి

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవితతో బీఆర్ఎస్ పార్టీ అధినాయకత్వం జరిపిన రాయబారం విఫలమైందా!? వరుసగా రెండు సార్లు రాయబార ప్రయత్నాలు చేసినా.. ఆమె ఏమాత్రం మెత్తబడలేదా!? పార్టీలో తన ప్రాధాన్యం.. పార్టీ అధికారంలోకి వస్తే తన పరిస్థితిపై ఇప్పుడే స్పష్టత ఇవ్వాలని పట్టుబట్టారా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ వర్గాలు. పార్టీలో తన పరిస్థితిపై ముందే స్పష్టత ఇవ్వాలని, లేకపోతే తన దారి తాను చూసుకుంటానని కాస్త ఘాటుగానే స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో కేసీఆర్‌కు కవిత లేఖ రాయడం, ఆమె అమెరికాలో ఉన్నప్పుడు అది బహిర్గతం కావడం.. దానిని తానే రాశానని స్పష్టం చేసిన కవిత.. కేసీఆర్ చుట్టూ ఉన్న దయ్యాలే దానిని లీకు చేశాయని తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై ఆదివారం కేటీఆర్‌ను పిలిపించుకుని కేసీఆర్ సంప్రదింపులు జరిపారు. కవిత వ్యవహారాన్ని ఓ కొలిక్కి తీసుకురాకుంటే మరింత నష్టం తప్పదన్న భావనకు వచ్చి.. సోమవారం ఆమె వద్దకు రాయబారం పంపారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో పార్టీ దూతలు కవిత నివాసానికి వచ్చారు. తొలుత, కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు, బీఆర్ఎస్ ఎంపీ దివికొండ దామోదర రావు సోమవారం మధ్యాహ్నం కవిత నివాసానికి చేరుకున్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు సంప్రదింపులకు వచ్చానని ఆయన కవితకు స్పష్టం చేసినట్లు జాగృతి వర్గాలు తెలిపాయి. కొంతసేపు చర్చించిన తర్వాత ఆయన

మిగతా 12వ పేజీలో...



కొవిడ్‌పై నిరంతర నిఘా

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు

అవసరమైతే కేంద్ర వైద్య సంస్థల సహకారం తీసుకోవాలని నిర్ణయం

12

కొవిడ్ జీనోమ్ సీక్వెన్సీకి నమూనాలు

ప్రతి జిల్లాకూ ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు

సీసీఎంబీ, ఐసీఎంఆర్, సీడీఎఫ్‌డీ, ఎయిమ్స్ డైరెక్టర్లతో మంత్రి దామోదర భేటీ

కొవిడ్‌తో ప్రస్తుతానికి ప్రమాదమేమీ లేదు

ప్రజల్లో ఇప్పటికే ఇమ్యూనిటీ: నిపుణులు



నేటి నుంచే పసుపు పండుగ

కడపలో మూడ్రోజుల టీడీపీ మహానాడు

కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు

3

తొలిరోజు 23 వేల మంది ప్రతినిధులతో సభ

సంస్థాగత నిర్మాణం, భావి కార్యాచరణపై చర్చ

ఎల్లుండి 5 లక్షల మందితో బహిరంగసభ

ముంబైపై కుంభవృష్టి

295 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు.. 107 ఏళ్లలో ఇదే తొలిసారి

నీటమునిగిన పలుప్రాంతాలు.. రైలు, మెట్రో, బస్సు సర్వీసుల రద్దు

మహారాష్ట్రలోని పలు జిల్లాల్లో వర్షాలు.. కేరళ, కర్ణాటకలోనూ వానలు



ముంబైలో నీట మునిగిన ఓ రహదారి

ముంబై, మే 26: ముంబై నగరాన్ని సోమవారం భారీవానలు ముంచెత్తాయి. రుతుపవనాలు ప్రవేశించిన తొలిరోజే ఏకంగా 295 మిల్లీమీటర్ల వాన కురిసిందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ)కి చెందిన కొలాబా అబ్జర్వేటరీ వెల్లడించింది. ఇది గత 107 ఏళ్లలోనే రికార్డు. ఇంతకుముందు 1918లో ముంబైలో 279.4 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. దానికంటే ఎక్కువ వర్షపాతం నమోదవటం

మిగతా 2వ పేజీలో...

రుతుపవనారొచ్చాయ్

రోళ్లు పగిలే రోహిణి కార్తెలోనే రాష్ట్రానికి నైరుతి

12

15 రోజులు ముందుగానే రాక

ఒకట్రెండు రోజుల్లో విస్తరణ

నేడు, రేపు భారీ వర్షాలు



రోగులకు అరకొర భోజనం

ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యత లేని ఆహారం వడ్డింపు

రోజూ ఒకే తరహా భోజనం.. ఉదయం ఉప్మానే

వంటశాలల్లో ఎలుకలు, బొద్దింకలు, అపరిశుభ్రత

మానసిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు నో డైట్

డైట్ కాంట్రాక్టర్లపై సర్కారుకు విజిలెన్స్ నివేదిక

వైద్య మంత్రి సీరియస్.. డైట్ కాంట్రాక్టుల రద్దు

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకిచ్చే ఆహారంలో నాణ్యత ఉండటం లేదు. నిబంధనల మేరకు తగినంతగా భోజనం ఇవ్వడం లేదు. మానసిక రోగులు, దివ్యాంగులకు అసలు తిండి పెట్టడం లేదు. రోజూ కోడి గుడ్లు ఇవ్వాలన్న విషయాన్ని మరచిపోయారు. రోగులకిచ్చే పండ్లు కుళ్లిపోయి ఉంటున్నాయి. వంటశాలలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. కొన్నిచోట్ల బొద్దింకలు, ఎలుకలు దర్శనమిస్తున్నాయి. రోజూ ఉదయం ఉప్మా తప్ప వేరే అందించడం

మిగతా 14వ పేజీలో...

అంత్యక్రియలకు అవకాశమివ్వలేదు

పోలీసుల ఆధ్వర్యంలో నంబాల మృతదేహం దహనం

మరో ఐదుగురు నక్సల్స్ మృతదేహాలకూ నిప్పు

ఎండుకట్టెల మధ్య వేసి కిరోసిన్‌తో దహనం చేసిన బలగాలు!

మృతదేహాలను అప్పగించమంటే.. ఇచ్చేది లేదని బెదిరించారు: బంధువులు



నక్సల్స్ మృతదేహాల దహనం

చర్ల/హసన్‌పర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలను అప్పగించాలని బంధుమిత్రులు విజ్ఞప్తి చేసినా.. ప్రజా సంఘాలు డిమాండ్లు చేసినా.. ఛత్తీస్‌గఢ్ పోలీసులు వీటిని పట్టించుకోలేదు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతోపాటు.. మరో ఐదుగురు నక్సల్స్ మృతదేహాలను ఛత్తీస్‌గఢ్ పోలీసులు దహనం చేశారు. సోమవారం ఈ మేరకు నారాయణపూర్ పోలీసులు ఓ ప్రకటన చేశారు. నారాయణపూర్

మిగతా 10వ పేజీలో...

నంబాలను సజీవంగా పట్టుకుని చంపారు

10

విప్లవ ద్రోహుల సమాచారంతోనే..

కాపాడుకునేందుకు 27 మంది త్యాగం

ఐనా ఆయన్ని కాపాడుకోలేకపోయాం

తప్పించుకొని వెళ్లిపోవాలన్నా వినలేదు

25 వేల బలగాలతో 35 మందిమి తలపడ్డాం: మావోయిస్టు పార్టీ దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ



జస్టిస్ వర్మపై దర్యాప్తు నివేదికల వెల్లడికి

సుప్రీం నిరాకరణ

అవి రహస్య పత్రాలని స్పష్టీకరణ

సమాచార హక్కు కింద దాఖలైన దరఖాస్తుకు వివరాలు ఇవ్వలేమని సమాధానం

2

ఏసీబీకి చిక్కిన ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్

గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌కు రూ.50 వేలు డిమాండ్ చేసిన అధికారి.. 30 వేలకు ఒప్పందం

డాక్యుమెంట్ రైటర్ ద్వారా లంచం డబ్బులు తీసుకుంటుండగా పట్టివేత

14



పవన్ కల్యాణ్ మాకు పెద్దన్న

ఆయన తిట్టినా పడతాం: దిల్‌రాజు

సినిమా థియేటర్ల మూసివేతపై విచారణ జరుగుతుంది

ఏపీ మంత్రి కందుల దుర్గేశ్

10

గోదావరి 'లంక'లో ఘోరం

స్నానానికి దిగిన 8 మంది యువకుల గల్లంతు

ఇద్దరిని రక్షించే ప్రయత్నంలో ముగ్గురు..

ఆపై మరో ముగ్గురు

ఏపీలోని కోనసీమ జిల్లా కమినిలంక వద్ద ఘటన

12

పుతిన్ పిచ్చోడు: ట్రంప్



వాషింగ్టన్, మే 26: ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడుల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ పిచ్చిపట్టినట్లుగా ప్రవర్తిస్తున్నారని, అవసరం లేకపోయినా చాలామందిని చంపేస్తున్నారని విమర్శించారు. పుతిన్‌తో తనకు సత్సంబంధాలే ఉన్నాయన్నారు. అయితే పుతిన్‌కు అప్పుడప్పుడు ఏమవుతుందో అర్థం కావడం లేదని, ఉక్రెయిన్ నగరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తున్నారంటూ ఆయన సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్ట్ చేశారు. ఉక్రెయిన్‌ను పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకోవాలని పుతిన్ యత్నిస్తున్నారని, అలా జరిగితే రష్యా పతనం తప్పదని ట్రంప్ హెచ్చరించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై కూడా ట్రంప్ విమర్శలు ఎక్కుపెట్టారు. జెలెన్‌స్కీ మాట్లాడే తీరువల్లే ఉక్రెయిన్‌కు చేటు జరుగుతోందన్నారు. జెలెన్‌స్కీ నోరు విప్పితే చాలు సమస్యలు తలెత్తుతున్నాయని, ఆయన మౌనంగా ఉంటే మంచిదని ట్రంప్ సలహా ఇచ్చారు. తాను అధ్యక్షుడిగా ఉంటే ఈ యుద్ధం జరిగేది కాదని ట్రంప్ చెప్పారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా అనేక నగరాలపై రష్యా 367 డ్రోన్లు, క్షిపణులతో భీకర దాడి జరపడంతో 14 మంది చనిపోయారు.

మెక్రాన్ చెంప చెళ్లుమనిపించిన భార్య!

న్యూఢిల్లీ, మే 26: ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌ను ఆయన భార్య చెంపమీద కొట్టారా? వియత్నాంలోని హనోయ్‌లో ఆదివారం మెక్రాన్ దంపతులు విమానంలోంచి దిగుతుండగా చిత్రీకరించిన వీడియోలోని దృశ్యాలను చూస్తే ఔను అనే అనిపిస్తోంది. విమానం ల్యాండైన కొద్దిసేపటికి.. తలుపులు తెరుచుకున్నాక మెక్రాన్, ఆయన భార్య బ్రిగెట్టే కలిసి దిగేందుకు సిద్ధమయ్యారు. అంతలో బ్రిగెట్టే చేయి.. మెక్రాన్ చెంపకు విసురుగా తగిలింది. దీనికి ఆయన ఎంతో ఇబ్బందికరంగా రియాక్షన్ ఇవ్వడంతో అది చెంపదెబ్బే అని రూఢీ అయింది. అయితే.. వెంటనే తేరుకున్న మెక్రాన్, ముఖంలో నవ్వు పులుముకొని కింద తన కోసం వేచి ఉన్నవారివైపు చేతిని ఊపారు. తర్వాత ఆయన కిందకు దిగుతున్న క్రమంలో భార్య చేతిలో చేయి వేసేందుకు ప్రయత్నించగా ఆమె తిరస్కరించింది. ఈ వీడియోపై స్పందించేందుకు మెక్రాన్ కార్యాలయం తొలుత నిరాకరించినా, తర్వాత దీన్ని ఆ దంపతుల మధ్య 'ఆటవిడుపు చర్య'గా పేర్కొంటూ తీవ్రతను తక్కువ చేసి చూపే ప్రయత్నం చేసింది. ఈ ఘటనపై మెక్రాన్ కూడా స్పందించారు. "మేం కేవలం పరాచకాలాడుకున్నాం అంతే" అని చెప్పారు.



లోకం తీరు



దాడి తర్వాతే పాకిస్థాన్‌కు సమాచారం

పాక్ అభ్యర్థన మేరకే ఆపరేషన్ సిందూర్ ఆపేశాం: విదేశాంగ మంత్రి జైశంకర్

న్యూఢిల్లీ, మే 26: ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఉగ్రస్థావరాలపై భారత్ జరిపిన దాడి గురించి పాకిస్థాన్‌కు ముందుగా తెలియజేయలేదని, దాడులు పూర్తయ్యాకే ఆ దేశానికి సమాచారం అందించామని విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ స్పష్టం చేశారు. దాడుల అనంతరం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ద్వారా అధికారిక ప్రకటన విడుదల చేశాకే పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో)కు ఈ విషయం తెలియజేశామని ఆయన పార్లమెంటరీ సలహా కమిటీకి వెల్లడించారు. మంత్రి జైశంకర్ అధ్యక్షతన సోమవారం విదేశాంగ శాఖకు చెందిన పార్లమెంటరీ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ.. ఉగ్రస్థావరాలపై దాడులకు ముందే పాకిస్థాన్‌కు సమాచారం అందించారంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని అన్నట్టు తెలిసింది. దాడుల విషయాన్ని ముందుగానే ఇస్లామాబాద్‌కు తెలియజేయాల్సిన అవసరం ఏముందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ గతంలో విమర్శించిన సంగతి తెలిసిందే. కాగా, ఆపరేషన్ సిందూర్ నిలిపివేత, అమెరికా జోక్యం గురంచి సమావేశంలో ఎంపీలు అడిగిన అనేక ప్రశ్నలకు జైశంకర్ సమాధానమిచ్చారు. పాకిస్థాన్ వైపు నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేయాలని ద్వైపాక్షికంగా నిర్ణయం తీసుకున్నామని జైశంకర్ ఎంపీలకు స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేసేలా చూడాలని పాకిస్థాన్ అమెరికా సాయం కోరిందని, అయితే.. నేరుగా భారత్‌తో మాట్లాడుకోవాలని అమెరికా వారికి స్పష్టం చేసిందని తెలిపారు. మరోవైపు పాక్‌తో మాట్లాడాలని అమెరికా కూడా తమను కోరిందని తెలిపారు.

పాకిస్థాన్.. బాధిత దేశం కాదు
ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న దేశం



న్యూఢిల్లీ, మే 26: పాకిస్థాన్ ఉగ్రవాద బాధిత దేశం కాదని, ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న దేశమని మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. బీజేపీ ఎంపీ బిజయంత్ పాండా నేతృత్వంలోని అఖిలపక్ష బృందం ప్రస్తుతం బహ్రెయిన్‌లో పర్యటిస్తోంది. ఈ బృందంలో ఒవైసీ, గులాం నబీ ఆజాద్, నిశికాంత్ దూబే తదితరలు సభ్యులుగా ఉన్నారు. ఆదివారం ఒవైసీ బహ్రెయిన్‌లో ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడారు. ఉగ్రవాదంపై పాక్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిపై బహ్రెయిన్‌కు పూర్తి సమాచారం ఇచ్చామన్నారు. ముంబై, పుల్వామా, పఠాన్‌కోట్ దాడుల గురించి చెప్పామని, వీటన్నింటిలో పాకిస్థాన్ ప్రమేయం ఉందని తెలిపారు. పాకిస్థాన్‌ను తిరిగి ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో చేర్చేలా మద్దతు ఇవ్వాలని బహ్రెయిన్, ఇతర మిడిల్ ఈస్ట్ దేశాలను కోరినట్లు ఒవైసీ చెప్పారు. మరోవైపు, పాకిస్థాన్‌లో ఉన్నంత మంది ఉగ్రవాదులు ప్రపంచం మొత్తమ్మీద కూఆ లేరని జమ్మూకశ్మీర్ మాజీ సీఎం గులాం నబీ ఆజాద్ అన్నారు. "వివిధ పార్టీలకు చెందిన నేతలమంతా ఉగ్రవాదంపై పోరులో ఇప్పుడు ఒకటిగా, భారతీయులుగా బహ్రెయిన్ వచ్చాం" అని ఆయన తెలిపారు. బహ్రెయిన్‌లో అన్ని మతాల వాళ్లు ఉన్నారని, బహ్రెయిన్ తనకు మినీ ఇండియాలా అనిపిస్తోందన్నారు.



జ్యోతి మల్హోత్రా చుట్టూ ఆరుగురు గన్‌మెన్

» పాకిస్థాన్ పర్యటనలో అసాధారణ భద్రత

న్యూఢిల్లీ, మే 26: గూఢచర్యం కేసులో అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా(33) పాకిస్థాన్ పర్యటనలో ఉన్నప్పటి మరో వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లాహోర్‌లోని అనార్కలీ బజార్‌లో ఆమె పర్యటించినపుడు చుట్టూ ఆరుగురు సాయుధులు భద్రతగా ఉన్నారు. స్కాట్లాండ్ యూట్యూబర్ కాలమ్ మిల్ తీసిన ఈ వీడియో ప్రస్తుతం చక్కర్లు కొడుతోంది. జ్యోతి మల్హోత్రా లాహోర్‌కు వెళ్లిన సమయంలో మిల్ కూడా అక్కడే ఉన్నాడు. అనార్కలీ బజార్‌లో జ్యోతి వీడియో తీస్తుండగా.. మిల్ తీసిన వీడియోలో ఆమె కనిపించారు. ఈ సందర్భంగా జ్యోతిని మిల్ పలకరించాడు. తాను భారతీయురాలినని జ్యోతి పరిచయం చేసుకుంది. పాకిస్థాన్‌కు రావడం ఇదే తొలిసారా? అని జ్యోతి ప్రశ్నించగా.. ఐదు సార్లు వచ్చానని మిల్ చెప్పాడు. పాక్‌లో ఆతిథ్యం బాగుందా? అని మిల్ అడగగా.. చాలా బాగుందని జ్యోతి చెప్పింది. ఆమె చుట్టూ అందరూ యువకులే తుపాకులు పట్టుకుని భద్రతగా ఉండటంతో ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. 'చూడండి.. ఆమె చుట్టూ ఆరుగురు గన్‌మెన్ ఉన్నారు. ఇంత భారీ భద్రత ఉండటం చూస్తే.. ఈ ప్రాంతం సురక్షితం కాదు' అని వ్యాఖ్యానించాడు. మిల్ ఈ వీడియోను తన చానల్‌లో పోస్టు చేశాడు. పాక్ పర్యటనలో జ్యోతికి అసాధారణ భద్రత కల్పించడంపై ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మైన్‌స్వీపర్ల నిర్మాణానికి రూ.44 వేల కోట్లు!

» చైనా దూకుడుతో భారత నేవీ అప్రమత్తం

న్యూఢిల్లీ, మే 26: శత్రు దేశాలు నీటి లోపల పెట్టే మందుపాతరలను గుర్తించి నిర్వీర్యం చేయగలిగే అడ్వాన్స్‌డ్ మైన్ స్వీపర్లను భారత్ తయారు చేయనుంది. నేవీ కోసం దేశీయంగా వీటిని నిర్మించే యోచన చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. మొత్తం 44 వేల కోట్ల రూపాయలతో 12 అడ్వాన్స్‌డ్ మైన్ స్వీపర్లను నిర్మించేందుకు రక్షణ ఉత్పత్తుల సేకరణ మండలి అనుమతిచ్చే అవకాశాలున్నాయి. అనుమతి లభించాక ఇవి నేవీకి అందుబాటులోకి రావడానికి 7 నుంచి 8 ఏళ్లు పట్టే అవకాశం ఉంది. భారత్‌లో 7,516 కిలోమీటర్ల తీర ప్రాంతంతో పాటు 200 చిన్న, 13 పెద్ద నౌకాశ్రయాలు ఉన్నా ఇప్పటివరకూ ఈ తరహా మైన్ స్వీపర్లు అందుబాటులో లేవు. పైగా సముద్ర జలాల్లో చైనా దూకుడుగా ఉంది. ఈ తరుణంలో మైన్ స్వీపర్లను సమకూర్చుకోవడం భారత నేవీకి కీలకంగా మారింది.

పాక్ గూఢచారిగా మారిన సీఆర్‌పీఎఫ్ జవాన్

న్యూఢిల్లీ, మే 26: దేశానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్నాడన్న ఆరోపణలతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఓ సీఆర్‌పీఎఫ్ జవాన్‌ను అరెస్టు చేసింది. మోతీ రామ్ జాట్ అనే సీఆర్‌పీఎఫ్ జవాన్ 2023 నుంచి పాకిస్థాన్ నిఘా అధికారులకు జాతీయ భద్రతకు సంబంధించిన కీలకమైన సమాచారాన్ని అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం అతడు వివిధ మార్గాల ద్వారా వారి నుంచి డబ్బులు కూడా తీసుకున్నాడని వెల్లడించారు. మోతీ రామ్‌ను ఢిల్లీలో అరెస్టు చేసిన ఎన్ఐఏ అధికారులు అక్కడి ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడికి జూన్ 6 వరకు ఎన్ఐఏ కస్టడీ విధించింది. సీఆర్‌పీఎఫ్ కూడా అతడిని విధుల నుంచి తొలగించింది. కేంద్ర సంస్థల సమన్వయంతో, మోతీ రామ్ సోషల్ మీడియా కార్యకలాపాలను పరిశీలిస్తుండగా ఈ వ్యవహారం బయటపడిందని సీఆర్‌పీఎఫ్ తెలిపింది.

దేశవ్యాప్తంగా వెయ్యి దాటిన కరోనా కేసులు

న్యూఢిల్లీ, మే 26: దేశవ్యాప్తంగా కొవిడ్-19 కేసులు పెరుగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో గతవారం 99 కేసులతోపాటు మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య వంద దాటింది. దేశవ్యాప్తంగా గత వారం 752 కొత్త కేసులతోపాటు మొత్తం కొవిడ్ పాజిటివ్ కేసులు 1,009 దాటాయని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. మహమ్మారి బారిన పడ్డ పడిన మరణించిన వారి సంఖ్య ఏడుగురికి చేరుకున్నది. ఇక కొవిడ్-19 చికిత్స కోసం ఆస్పత్రుల్లో చేరిన వారిలో 354 మంది డిశ్చార్జయ్యారు. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో కొత్త కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. కొత్తగా నమోదవుతున్న కేసుల్లో అత్యధికం ఎన్‌బీ.1.8.1, ఎల్‌ఎఫ్.7 వేరియంట్‌వే అని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇండియన్ సార్స్-కోవ్-2 జెనోమిక్స్ కన్సార్టియం (ఐఎన్ఎస్ఏసీవోజీ) తెలిపింది. ఎన్‌బీ.1.8.1, ఎల్‌ఎఫ్.7 వేరియంట్లు అంత ప్రమాదకరం కాదని డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది.

పీఎం అప్రెంటిస్ శిక్షణార్థులకు స్టైపెండ్ పెంపు


న్యూఢిల్లీ, మే 26: కేంద్ర ప్రభుత్వం రెండు పథకాల కింద శిక్షణార్థులకు నెలవారీ ఇచ్చే కనీస స్టైపెండ్‌ను పెంచాలని నిర్ణయించింది. కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి నేతృత్వంలోని 'కేంద్ర అప్రెంటిస్‌షిప్ మండలి (సీఏసీ)' ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. పీఎం- జాతీయ అప్రెంటిస్‌షిప్ ప్రోత్సాహక పథకం (పీఎం-ఎన్ఏపీఎస్), జాతీయ అప్రెంటిస్‌షిప్ శిక్షణ పథకం (ఎన్ఏటీఎస్) కింద ప్రస్తుతం పలు పరిశ్రమల్లో శిక్షణలో ఉండే అభ్యర్థులకు రూ.5000 నుంచి రూ.9000 స్టైపెండ్ ఇస్తున్నారు. దీన్ని రూ.6800 నుంచి రూ.12300కు పెంచాలని సోమవారం జరిగిన సీఏసీ సమావేశంలో నిర్ణయించారు.

ఉగ్రవాదం అంతానికి
పాక్ ప్రజలు ముందుకు రావాలి

లేదంటే మా సైన్యం ఆగ్రహానికి గురికాక తప్పదు.. ఉగ్ర దాడి జరిగితే మోదీ మౌనంగా ఉంటాడా?

» మా చెల్లెళ్ల బొట్టు చెరిపేవారిని అంతమొందించి తీరతాం: మోదీ

దాహోద్/భుజ్, మే 26: ఉగ్రవాదం అంతానికి పాక్ ప్రజలు ముందుకు రావాలని ప్రధాని మోదీ పిలుపిచ్చారు. వారి ప్రభుత్వం, ఆర్మీ తమ స్వార్థం కోసమే టెర్రరిజానికి మద్దతిస్తున్నాయని తెలిపారు. శాంతిమార్గం ఎంచుకోకపోతే వారు భారత సైన్యం ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధిలో భారత్ ముందంజలో ఉంటే.. దానిపై విద్వేషం పెంచడం.. కీడు చేయడమే పాకిస్థాన్ ఏకైక లక్ష్యంగా పెట్టుకుందని ధ్వజమెత్తారు. పహల్గాంలో అమాయక టెర్రరిస్టులపై ఉగ్రవాదులు దాడిచేస్తే ఇండియా, మోదీ మౌనంగా ఎలా కూర్చుంటారని ప్రశ్నించారు. మన అక్కచెల్లెళ్ల నుదుట బొట్టు చెరిపే సాహసం ఎవరు చేసినా వారిని అంతం చేసి తీరతామని సభికుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. రెండ్రోజుల పర్యటన నిమిత్తం గుజరాత్ వచ్చిన ఆయన తొలి రోజు సోమవారం వడోదరాలో భారీ రోడ్‌షో నిర్వహించారు. కల్నల్ సోఫియా ఖురేషీ కుటుంబ సభ్యులు కూడా దీనికి హాజరయ్యారు. అనంతరం దాహోద్, భుజ్‌లో జరిగిన బహిరంగ సభల్లో ప్రధాని మాట్లాడారు. టెర్రరిజాన్ని పాక్ టూరిజంగా భావిస్తోందన్నారు. ఇది ప్రపంచానికే ప్రమాదమని చెప్పారు. 'పాక్ ప్రజలను ఒకటి అడుగదలచుకున్నాను. ఇన్నేళ్లలో మీరు ఏం సాధించారు? ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినవారు మీ జీవితాలను నాశనం చేశారు. ఉగ్రవాదం మీ ప్రభుత్వానికి, సైన్యానికి సంపాదన మార్గం. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి మీరే ముందుకు రావాలి' అన్నారు. ఇదిలా ఉండగా, భారతీయ పండుగల సందర్భంగా విదేశాల్లో తయారైన టపాసులు, గణేశ ప్రతిమలు కొనడంపై ప్రధాని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి దిగుమతి వస్తువులను కొనడం ఆపాలని మీరు యోచించరా అని ప్రజలను ప్రశ్నించారు. దేశ ప్రగతి కోసం దేశీయంగా తయారయ్యేవాటినే కొంటామని అందరూ సంకల్పం తీసుకోవాలని పిలుపిచ్చారు. దాహోద్‌లో రూ.24 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.



సీమెన్స్ విద్యుత్ రైలు ఇంజన్‌ను ప్రారంభిస్తున్న మోదీ

మహిళా సాధికారతకు మోదీ ఎంతో చేశారు: సోఫియా సోదరి

ఎయిర్‌పోర్టు నుంచి వైమానిక దళ కేంద్రం వరకు కిలోమీటరు వరకు మోదీ రోడ్‌షో సాగింది. కల్నల్ సోఫియా ఖురేషీ స్వస్థలం వడోదరా అన్న సంగతి తెలిసిందే. రోడ్‌షోకు ఆమె తల్లిదండ్రులు, కవల సోదరి షైనా ఖురేషీ, సోదరుడు మొహమ్మద్ సంజయ్ ఖురేషీ కూడా హాజరయ్యారు. షైనా ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానిని కలవడం సంతోషంగా ఉందన్నారు. మహిళల సాధికారతకు ఆయన ఎంతో చేశారని కొనియాడారు.

దేశంలో తొలి 'బాహుబలి' విద్యుత్ ఇంజన్‌కు పచ్చజెండా

సీమెన్స్ కంపెనీ నిర్మించిన దేశంలోనే అత్యంత శక్తివంతమైన 9000 హార్స్‌పవర్ విద్యుత్ రైలు ఇంజన్‌ను మోదీ సోమవారం ప్రారంభించారు. దేశంలో రైల్వే ద్వారా వస్తు రవాణాను ప్రస్తుతం ఉన్న 27% నుంచి 45 శాతానికి పెంచాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాన్ని సాకారం చేయడంలో ఇది కీలకంగా నిలుస్తుంది. దేశంలో ఇంత భారీ సామర్థ్యం గల విద్యుత్ లోకోమోటివ్‌ను తయారుచేయడం ఇదే ప్రథమం. రైల్వే శాఖ నుంచి ఇలాంటి 1200 లోకోమోటివ్‌ల డిజైన్, తయారీ, నిర్వహణకు సంబంధించి లభించిన ఆర్డర్‌కు అనుగుణంగా దహోద్‌లోని ఫ్యాక్టరీలో సీమెన్స్ దీన్ని నిర్మించింది. గంటకి 120 కిలోమీటర్ల వేగంతో 5800 టన్నుల బరువును సునాయాసంగా తరలించగల సామర్థ్యం ఈ ఇంజన్‌కు ఉంది.

జస్టిస్ వర్మపై దర్యాప్తు నివేదికల వెల్లడికి సుప్రీంకోర్టు నిరాకరణ

» రహస్య పత్రాలని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, మే 26: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో లభించిన నగదుకు సంబంధించిన దర్యాప్తు నివేదికలను బయటపెట్టేందుకు సుప్రీంకోర్టు పరిపాలన విభాగం తిరస్కరించింది. సుప్రీంకోర్టు నియమించిన అంతర్గత దర్యాప్తు కమిటీ జస్టిస్ యశ్వంత్ వర్మను తప్పుపడుతూ ఇచ్చిన నివేదిక, ఆయనను అభిశంసించి పదవి నుంచి తొలగించాలని కోరుతూ అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా..రాష్ట్రపతి, ప్రధానికి రాసిన లేఖలను సమాచార హక్కు చట్టం కింద ఇచ్చేందుకు నిరాకరించింది. ఇవన్నీ రహస్య పత్రాలని, బయటవారికి వెల్లడిస్తే పార్లమెంటు హక్కులకు భంగం కలుగుతుందని పేర్కొంది. జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న సమయంలో మార్చి 14వ తేదీ రాత్రి ఆయన నివాసంలో జరిగిన అగ్నిప్రమాదంలో లక్షల రూపాయల నగదు లభించినట్టు వార్తలు వచ్చాయి. దీనిపై ఆ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.కె.ఉపాధ్యాయ్ ప్రాథమికంగా విచారణ జరిపారు. అనంతరం సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యులుగల అంతర్గత కమిటీ విచారణ జరిపింది. ఈ నెల మూడో తేదీన నివేదిక సమర్పించింది. జస్టిస్ వర్మ తీరును తప్పుపట్టింది. నగదు తీసుకున్నట్టు నిర్ధారించింది. ఈ నివేదిక వివరాలన్నింటినీ ఇవ్వాలని సమాచార హక్కు కార్యకర్త కోరగా సుప్రీంకోర్టు నిరాకరించింది.

సుప్రీంకోర్టు జడ్జిలుగా ముగ్గురి పేర్లు సిఫార్సు

జస్టిస్ అంజారియా, జస్టిస్ విజయ్, జస్టిస్ చందూర్కర్‌లకు పదోన్నతి



జస్టిస్ అంజారియా, జస్టిస్ విజయ్ బిష్ణోయ్, జస్టిస్ చందూర్కర్

» సుప్రీంకోర్టు కొలీజియం ప్రతిపాదన

న్యూఢిల్లీ, మే 26: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, మరో హైకోర్టు జడ్జికి పదోన్నతులు కల్పించాలని కొలీయం సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ అధ్వర్యంలోని అయిదుగురు సభ్యుల కొలీజియం సోమవారం ఇక్కడ భేటీ అయి ఈ మేరకు నిర్ణయం తీసుకొంది. కర్ణాటక హైకోర్టు సీజే జస్టిస్ అంజారియా, గువాహటి హైకోర్టు సీజే జస్టిస్ విజయ్‌బిష్ణోయ్, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చందూర్కర్‌లను సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించాలని ప్రతిపాదించింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎ.ఎస్.ఓకా, జస్టిస్ హృషీకేశ్ రాయ్‌ల పదవీ విరమణ కారణంగా ఏర్పడిన ఖాళీల్లో వీరిని భర్తీ చేయనున్నారు.

జస్టిస్ అంజారియా స్వస్థలం అహ్మదాబాద్

కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అంజారియా 1965లో అహ్మదాబాద్‌లో జన్మించారు. 1989లో అక్కడి యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా నుంచి మాస్టర్ డిగ్రీ పొందిన ఆయన తొలుత గుజరాత్ హైకోర్టులో తాత్కాలిక న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2011లో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2024 ఫిబ్రవరి 25 నుంచి కర్ణాటక హైకోర్టు సీజేగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

జస్టిస్ విజయ్‌ది రాజస్థాన్

గువాహటి హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌ది రాజస్థాన్. 1964లో జన్మించిన ఆయన 1989లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. 2013లో రాజస్థాన్ హైకోర్టులో తాత్కాలిక జడ్జిగా, 2015లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2024 ఫిబ్రవరి 5 నుంచి గువాహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు.

చందూర్కర్ నాగ్‌పూర్ నుంచి ఢిల్లీకి...

1965లో జన్మించిన జస్టిస్ చందూర్కర్ 1988లో న్యాయవాదిగా చేరారు. 1992 నుంచి నాగ్‌పూర్‌లో స్థిరపడి అక్కడ పలు కోర్టుల్లో వాదనలు వినిపించారు. 2013లో బాంబే హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా, అనంతరం శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

ఐదు హైకోర్టులకు కొత్త సీజేలు

మరో అయిదు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను నియమించాలని కూడా కొలీజియం సిఫార్సు చేసింది. మధ్యప్రదేశ్, కర్ణాటక, గువాహటి, పట్నా, ఝార్ఖండ్ హైకోర్టులకు కొత్త చీఫ్ జస్టిస్‌లు రానున్నారు. మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ సంజీవ్ సచ్‌దేవాను అదే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సిఫార్సు చేసింది. ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ విభు బఖ్రును కర్ణాటక హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమించాలని ప్రతిపాదించింది. పట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అశుతోష్ కుమార్‌ను గువాహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సూచించింది. పట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ విపుల్ మనుబాయ్ పంచోలీని అదే హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పదోన్నతి కల్పించాలని సిఫార్సు చేసింది. హిమాచల్ హైకోర్టు జడ్జి జస్టిస్ తార్లోక్ సింగ్ చౌహాన్‌ను ఝార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని ప్రతిపాదించింది.

భారతీయ నర్సుల విదేశీ బాట!

» అధిక వేతనాల కోసం ఇతర దేశాలకు వెళ్తున్న హెల్త్‌కేర్ నిపుణులు



న్యూఢిల్లీ, మే 26: ప్రపంచవ్యాప్తంగా హెల్త్‌కేర్ నిపుణుల కొరత తీవ్రంగా ఉంది. భారత్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సిఫారసుల ప్రకారం ప్రతి వెయ్యి మంది ప్రజలకు ముగ్గురు నర్సులు ఉండాలని చెబుతుంటే.. భారత్‌లో మాత్రం కేవలం 1.96 మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న హెల్త్‌కేర్ నిపుణుల కొరతను ఉపయోగించుకుంటూ.. భారత్‌లోని నర్సులు అధిక జీతం, మెరుగైన పని పరిస్థితులను కోరుకుంటూ విదేశాల బాట పడుతున్నారు. ఈ సంఖ్య ఇటీవలి కాలంలో ఎక్కువగా ఉంది. జర్మనీ, ఐర్లాండ్, మాల్టా, యూఏఈ, బెల్జియం వంటి దేశాలకు వెళ్తున్నారు. ఆయా దేశాలు పోటీపడి మరీ అధిక వేతనాలు, ఇతర అదనపు ప్రయోజనాలను ఆఫర్ చేస్తూ వారిని నియమించుకుంటున్నాయి. 'బోర్డర్‌ప్లస్' అనే వర్క్‌ఫోర్స్ మొబిలిటీ సంస్థ డాటా ప్రకారం.. జర్మనీలో కొత్తగా నియామకమైన ఒక నర్సు నెలకు 2,700 యూరోల (సుమారు రూ.2.6 లక్షలు) జీతాన్ని ఆశించవచ్చు. లైసెన్స్ పొందిన తర్వాత రూ.3.2 లక్షల వరకు పోయే అవకాశం ఉంది. అదే భారత్‌లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో అయితే నర్సులకు వేతనం రూ.20 వేల నుంచి రూ.40 వేల మధ్య ఉంటుంది. ఐర్లాండ్ రూ.1.7 లక్షలు-రూ.2.5 లక్షల వేతనాన్ని ఆఫర్ చేస్తోంది. యూఏఈలో ప్రారంభ వేతనం రూ.75 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ఉంది. దీంతో పాటు ఆదాయం పన్ను రాయితీ, ఇతర ప్రయోజనాలను కల్పిస్తోంది.

విదేశాల్లో భారతీయ నర్సులకు డిమాండ్

మెరుగైన వైద్య నైపుణ్యాలు, ఇంగ్లిష్ భాషా ప్రావీణ్యం, ఎక్కడికైనా వెళ్లేందుకు సమ్మతి వంటి అంశాలతో భారతీయ నర్సులకు ఎక్కువ డిమాండ్ కనిపిస్తోంది. క్రిటికల్ కేర్, జెరియాట్రిక్స్ (వృద్ధుల ఆరోగ్య సంరక్షణ), ప్రినేటల్ (ప్రసవానికి ముందు) సేవల్లో మనవాళ్లకు అధిక డిమాండ్ ఉంది. అయితే, నర్సులు విదేశాలకు వెళ్లడం దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికే భారత్‌లో డబ్ల్యూహెచ్‌వో సిఫారసు చేసిన నర్సుల సంఖ్య కంటే చాలా తక్కువగా ఉన్నారు. నర్సుల వలసలు ఈ కొరతను మరింత పెంచుతాయి. ఈ నేపథ్యంలో నర్సింగ్ నైపుణ్యాన్ని దేశంలోనే నిలుపుకోవడానికి దేశీయంగా పని పరిస్థితులను మెరుగుపరచడం, పోటీ వేతనాలు ఆఫర్ చేయడం, శిక్షణా సదుపాయాలను విస్తరించడం వంటి చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ముంబైపై కుంభవృష్టి

(మొదటి పేజీ తరువాయి)



ఇదే తొలిసారి. సాధారణ వానలు కురిస్తేనే తడిసిముద్దయ్యే నగరం.. ఈ కుంభవృష్టితో నీట మునిగింది. పలు రైల్వేస్టేషన్లలో ప్లాట్‌ఫాంలు నీటిలో మునిగిపోయి ఉండటం, ఎస్కలేటర్ల పైనుంచి వరద కిందికి పడటం వంటి దృశ్యాలతో కూడిన వీడియోలు పరిస్థితికి అద్దం పట్టాయి. పలుచోట్ల సబర్బన్ రైలు సర్వీసులను, మెట్రో రైళ్లను, బస్సులను అధికారులు నిలిపివేశారు. కొన్ని చోట్ల సర్వీసులను దారి మళ్లించి నడిపారు. రోడ్ల మీద చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ముంబైతోపాటు మహారాష్ట్రలోని ఇతర ప్రాంతాల్లోనూ భారీగా వానలు కురిశాయి. బారామతి, ఇందాపూర్, పుణెల్లో పలు గ్రామాల్లో ఇళ్లలోకి వర్షపునీరు వచ్చి చేరింది. ఇందాపూర్ సమీపంలో పుణె-సోలాపూర్ జాతీయ రహదారి నీట మునిగి ట్రాఫిక్ నిలిచిపోయింది. వర్షబీభత్స ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయకచర్యలు చేపట్టాయి. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. రాయ్‌గఢ్ జిల్లాలో పిడుగు పడిన ఘటనలో ఒక వ్యక్తి మరణించారు. ముంబైకి సాధారణంగా రుతుపవనాలు జూన్ 11వ తేదీన చేరుకుంటాయి. కానీ, ఈసారి 16 రోజుల ముందుగానే వచ్చేశాయి. ఇలా జరగటం గత 75 ఏళ్లలో ఇదే తొలిసారని భారత వాతావరణ విభాగం శాస్త్రవేత్త సుష్మానాయర్ తెలిపారు. భారీవర్షాల నేపథ్యంలో ముంబైతోపాటు థానె, రాయ్‌గఢ్ జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రుతుపవనాల ప్రభావంతో కేరళ, కర్ణాటకల్లోనూ భారీ వర్షాలు పడ్డాయి. కేరళలోని త్రిసూర్, వయనాడ్, పాలక్కాడ్, కొజికోడ్ జిల్లాలపై వర్షాల ప్రభావం తీవ్రంగా ఉంది. నదులు ఉప్పొంగుతుండటంతో సమీపప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కర్ణాటక తీరప్రాంతంలో వరుసగా మూడోరోజైన సోమవారం కూడా వానలు భారీగా కురిశాయి. సులియా జిల్లాలోని బెల్లారెలో 200.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్ణాటక తీరప్రాంతానికి ఇప్పటికే జారీ అయిన రెడ్ అలర్ట్ మరో ఐదురోజులపాటు అమలులో ఉంటుందని ఐఎండీ తెలిపింది.



ఘాట్‌రోడ్డు పిట్టగోడపై పరుగులు తీస్తున్న చిరుత

తిరుమల మొదటి ఘాట్‌లో చిరుత కలకలం

» భయభ్రాంతులకు గురైన వాహనదారులు

తిరుమల, మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో సోమవారం రాత్రి చిరుత సంచారం కలకలం సృష్టించింది. తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌రోడ్డులోని వినాయక స్వామి ఆలయానికి సమీపంలో ఓ చిరుత రోడ్డుపక్కనే ఉన్న పిట్టగోడపై బైఠాయించింది. కార్లు శబ్దం చేస్తూ వస్తున్న క్రమంలో చిరుత పిట్టగోడపై పరుగులు తీసింది. కొంతదూరం పరుగులు తీశాక లోయలోకి దూకింది. దీంతో చిరుతను చూసిన వాహనదారులు హడలిపోయారు. అలిపిరి చెక్‌పాయింట్‌లోని భద్రతా సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు ఫారెస్ట్ సిబ్బందితో కలిసి ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. గుంపులుగానే వెళ్లాలంటూ ద్విచక్రవాహనదారులకు మైకుల ద్వారా సూచనలు చేశారు. ఆదివారం రాత్రి అలిపిరి కాలినడకమార్గంలోని 350వ మెట్టు వద్ద కూడా ఓ చిరుత సంచరించిన విషయం తెలిసిందే. వరసగా చిరుతల సంచారం నేపథ్యంలో భక్తులతో పాటు వాహనదారులను అప్రమత్తం చేసి భద్రతా సిబ్బందిని కూడా పలు ప్రాంతాల్లో అదనంగా ఏర్పాటు చేశారు.

టీటీడీ సొంత చాట్‌బాట్

» చాట్ జీపీటీ తరహాలో రూపకల్పనకు ఐటీ విభాగం కసరత్తు

తిరుమల, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత చాట్ జీపీటీ తరహాలో 'చాట్‌బాట్'ను రూపొందించే పనికి టీటీడీ శ్రీకారం చుట్టింది. భక్తులు ఏ భాషలో అడిగినా, కోరిన సమాచారం క్షణాల్లో అందేలా దీన్ని రూపొందిస్తారు. టైపింగ్‌తోనే కాకుండా వాయిస్ కమాండ్‌తో కూడా సమాచారాన్ని పొందవచ్చు. అలాగే దర్శనం, ఆర్జితసేవలు, గదులు, కల్యాణ వేదిక, ప్రసాదాల బుకింగ్, విరాళాలు చెల్లింపులు, వివిధ రకాల పేమెంట్లు వంటి సౌకర్యాలూ ఈ చాట్‌బాట్ ద్వారా లింక్స్ రూపంలో పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. టీటీడీ చాట్‌బాట్ రూపకల్పన కోసం ఐటీ విభాగం జీఎం, డీజీఎంలతో పాటు జీయో, టీసీఎస్ ప్రతినిధులతో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. 10 సంస్థలు ఇచ్చిన డెమోలను ఈ బృందం పరిశీలించింది. మరికొన్ని సంస్థల డెమోలను కూడా పరిశీలించిన తర్వాత తుదిరూపంతో కూడిన నివేదికను బృందం సమర్పిస్తుంది. అనంతరం ఈసేవలను అందించే సంస్థలనుంచి టెండర్లకు ఆహ్వానిస్తారు.

ఇద్దరి ప్రాణాలు తీసిన హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్

కాన్పూర్, మే 26: ప్రతి ఒక్కరూ తమ తల వెంట్రుకలు నిండుగా ఉండాలని కోరుకుంటారు. రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. మార్కెట్‌లో పలు రకాల ఆప్షన్లు ఉన్నాయి. కానీ, ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన ఇద్దరు ఇంజనీర్లకు హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఓ దంతవైద్యురాలు చేసిన శస్త్రచికిత్స వికటించి.. వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. గత మార్చి 13న వినిత్ కుమార్ దూబె, ప్రమోద్ కతియార్‌లకు హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం అనుష్క తివారీ అనే దంత వైద్యురాలు శస్త్ర చికిత్స చేసిన రెండ్రోజులకు వారిద్దరూ మరణించారు.

వేలానికి వేళాయె!

రాజీవ్ స్వగృహ పరిధిలోని ప్లాట్లు, ఫ్లాట్లు అమ్మకానికి సిద్ధం

» రూ.3,538కోట్లు వస్తాయని అంచనా

» సర్కారు ఆమోదం తర్వాత వేలం

» తొలి దశలో 11 ప్రాంతాల్లో విక్రయాలు

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ స్వగృహకు చెందిన పలు ఆస్తుల వేలానికి రంగం సిద్ధమైంది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లు, అసంపూర్తిగా ఉన్న టవర్లకు సంబంధించిన వివరాలతోపాటు ఎంత ఆదాయం వస్తుందన్న అంశంపై అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. వేలం ధర ఎంత నిర్ణయించాలన్న అంశంపై గతంలోనే జిల్లాలు, మునిసిపాలిటీలు, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏల వారీగా కమిటీలను నియమించారు. ఆయా కమిటీలు ఇచ్చిన ధరల వివరాలను తాజా నివేదికలో పొందుపర్చారు. ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్న నివేదికకు ఆమోదం లభించగానే వేలం ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక ప్రకారం రాజీవ్ స్వగృహ కింద ఉన్న ఆస్తులను వేలం వేస్తే రూ.3,538కోట్లు ఆదాయం వస్తుందని అధికారులు వెల్లడించారు. ఆయా ఆస్తులను దశల వారీగా వేలం వేయాలని ప్రతిపాదించారు. మొదటి విడతలో మేడ్చల్, ఖమ్మంతోపాటు ఇతర జిల్లాల్లోని 11 ఆస్తులను వేలం వేయడం ద్వారా రూ.850-950కోట్ల వరకు ఆదాయం రావొచ్చని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో పోచారం, బండ్లగూడ టవర్లలోని కొన్ని ఫ్లాట్లు, రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న భూములను అమ్మగా.. రూ.2వేల కోట్ల వరకు ఆదాయం వచ్చింది. మిగిలిన వాటిని ఇప్పుడు వేలం వేసేందుకు రంగం సిద్ధం చేసిన అధికారులు.. అనుమతి కోరుతూ ఇటీవల ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. మేడ్చల్ జిల్లా పరిధిలోని బండ్లగూడ (సహభావన టౌన్‌షిప్)లో 159 ఫ్లాట్లు, పోచారం (సద్భావన)లో 601 ఫ్లాట్లు ఉన్నాయని, వీటిని వేలం వేయడం ద్వారా రూ.128.43కోట్లు వస్తాయని పేర్కొన్నారు. ఇదే జిల్లా పరిధిలోని గాజులరామారంలో 5 టవర్లు, పోచారంలో 6, జవహర్‌నగర్‌లో 17, ఖమ్మం జిల్లాలో 8 టవర్లు అసంపూర్తిగా ఉన్నాయని, వీటిని వేలం వేస్తే రూ.725.23కోట్లు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని కుర్మలగూడలో 20, చందానగర్‌లో 03, తొర్రూరులో 514, కవాడిపల్లిలో 40, మేడ్చల్ జిల్లా పరిధిలోని బహదూర్‌పల్లిలో 69, మహబూబ్‌నగర్ జిల్లాలోని పోతులమడుగులో 111, అమిస్తాపూర్‌లో 45, ఆసిఫాబాద్ జిల్లాలోని బోరేగావ్‌లో 73, కామారెడ్డిలో 79, నల్గొండ జిల్లా ఎల్లారెడ్డి గూడలో 52, వికారాబాద్ జిల్లా కోకట్‌లో 10, ఆదిలాబాద్ జిల్లా బట్టిసావర్‌గావ్‌లో 9, గద్వాలలో 8, కరీంనగర్ జిల్లా నుస్తులాపూర్‌లో 3, మేడ్చల్ జిల్లా గాజులరామారంలో 12చొప్పున ఓపెన్ ప్లాట్లు ఉండగా.. రూ.613.34 కోట్లు వస్తాయని వెల్లడించా. కామారెడ్డిలో 107, నల్లగొండ జిల్లా ఎల్లారెడ్డి గూడలో 200, వికారాబాద్ జిల్లా కోకట్‌లో 54 చొప్పున నిర్మించతలపెట్టిన ఇళ్లు అసంపూర్తిగా మిగిలిపోయాయని, వీటి ద్వారా రూ.38.81కోట్లు వస్తాయని పేర్కొన్నారు. ఇవి కాకుండా మేడ్చల్ జిల్లా పరిధిలోని జవహర్‌నగర్‌లో 19 ఎకరాలు, గాజులరామారంలో 5, పేట్‌బషీరాబాద్‌లో 18, మల్లంపేటలో 10.50 ఎకరాలు, కామారెడ్డి జిల్లా అడ్లూర్‌లో 15.20, ఖమ్మం జిల్లా పోలేపల్లిలో 3.38, రంగారెడ్డి జిల్లా పరిధిలోని కవాడిపల్లిలో 30, తట్టిఅన్నారంలో 35ఎకరాల చొప్పున భూములు ఉండగా.. రూ.492.45కోట్లు వచ్చే అవకాశం ఉందని నివేదికలో పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో 83ఎకరాలు(రూ.350కోట్లు), మేడ్చల్ జిల్లా నిజాంపేటలో 16 ఎకరాలు (రూ.225కోట్లు), బోడుప్పల్‌లో 20ఎకరాలు(రూ.140 కోట్లు) కోర్టు కేసుల్లో ఉన్నాయని, పరిష్కారమయ్యాకే వాటిని విక్రయించే అవకాశం ఉందని తెలిపారు.



పోచారంలోని సద్భావన టౌన్‌షిప్

సింధూ నాగరికతకు ముందే మరోటి!

» గుజరాత్ 'ఖంబాట్ గల్ఫ్'లో ఆనవాళ్లు

» సముద్రంలో 120 అడుగుల లోతున ఒకప్పుడు నగరం

» అక్కడ కుండలు, పూసలు, శిల్పాలు, మానవ అవశేషాలు

న్యూఢిల్లీ, మే 26: సింధూ నాగరికతను అత్యంత ప్రాచీనమైన ఈజిప్ట్, మెసపటోమియా నాగరికతలతో పోల్చుతారు! క్రీస్తుపూర్వం 2,500 ఏళ్ల క్రితం భారత్‌లోని వాయవ్య ప్రాంతంలో సింధూనదీ తీరంలో ఈ నాగరికత విలసిల్లిందని చెబుతారు! మరి.. సింధూ నాగరికతకు ముందే మరో నాగరికత ఉండిందా? సముద్ర నీటిమట్టం పెరగడంతో ఆ నగరం మునిగిపోయిందా? నర్మద, తపతి, సబర్మతి నదులు.. గుజరాత్ వద్ద అరేబియా సముద్రంలో కలిసే ప్రాంతం 'ఖంబాట్ గల్ఫ్' ఉంది కదా! అక్కడ హరప్పా నాగరికతకు ముందుగానే నాగరికత విలసిల్లిందని 25 ఏళ్ల క్రితం భారత సముద్ర నిపుణుల పరిశోధనలు చెబుతున్నాయి. ఈ పరిశోధనలను ఎవ్వరూ ఆమోదించలేదు.. అలా అని తిరస్కరించనూ లేదు! అయితే 2000 సంవత్సరంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐవోటీ) ఖంబాట్ గల్ఫ్ వద్ద నాగరికత అనవాళ్లను కనుగొంది. అక్కడ సముద్రంలో 120 అడుగుల లోతులో ఐదు మైళ్ల పొడవు, రెండు మైళ్ల వెడల్పుతో విస్తరించి ఉన్న నగరం ఆనవాళ్లు లభ్యమయ్యాయి. కుండలు, పూసలు, శిల్పాలు, మానవ అవశేషాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిపై పరిశోధనలు చేసిన నిపుణులు, ఇవన్నీ దాదాపు 9,500 ఏళ్ల నాటివని, హరప్పా నాగరికతకు ముందునుంచే ఉన్నాయని చెప్పారు. సముద్ర మట్టాలు పెరగడం వల్ల ఈ నాగరికత తాలూకు నగరం మునిగిపోయిందని ఎన్ఐవోటీ బృందంలోని భూవిజ్ఞాన శాస్త్రవేత్త బద్రీనార్యన్ పేర్కొన్నారు. అయితే ఖంబాట్ గల్ఫ్ వద్ద విలసిల్లిందని చెబుతున్న నాగరికతపై అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. అక్కడ కొన్ని మానవ నిర్మాణాల తాలుకు అనవాళ్లు ఉన్నాయని నిపుణులు అంగీకరిస్తున్నా, కొన్ని ఆనవాళ్లు నదుల ప్రవాహాల్లో కొట్టుకొచ్చి ఉండొచ్చుననీ చెబుతున్నారు.

హెల్మెట్ లేదని బైక్‌ను ఆపే ప్రయత్నం

» కిందపడి వెనుక వచ్చిన టెంపో ఢీకొని బాలిక మృతి

» స్థానికుల ఆగ్రహం.. మండ్య హైవేపై భారీ నిరసన



ప్రతీక్ష (ఫైల్)

బెంగళూరు, మే 26(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్నవారిని ట్రాఫిక్ పోలీసులు అనూహ్యంగా ఆపే ప్రయత్నం చేశారు. దీంతో బైక్‌పై తల్లిదండ్రులతో కలిసి కూర్చున్న మూడేళ్ల బాలిక అదుపుతప్పి కింద పడిపోయింది. వెనుక వస్తున్న టెంపో వేగంగా చిన్నారిని ఢీకొట్టింది. దీంతో పసిపాప అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ విషాద ఘటన కర్ణాటక రాష్ట్రం మండ్య జిల్లా కేంద్రంలోని నంద సర్కిల్‌లో సోమవారం జరిగింది. మద్దూరు తాలూకా గొరవనహళ్లికి చెందిన అశోక్, వాణి దంపతుల కుమార్తె ప్రతీక్షను కుక్క కరిచింది. వైద్యం కోసం పాపను తీసుకుని మండ్యలోని మెడికల్ కళాశాల ఆసుపత్రికి తల్లిదండ్రులు బయలుదేరారు. ఆ హడావుడిలో హెల్మెట్‌ను ధరించలేదు. నంద సర్కిల్‌లో ట్రాఫిక్ పోలీసులు వారి బైక్‌ను ఆపే ప్రయత్నం చేశారు. దీంతో బైకు అదుపు తప్పి చిన్నారి ప్రతీక్ష రోడ్డుపై పడటం, టెంపో వేగంగా వచ్చి ఢీకొట్టడం జరిగిపోయింది. తేరుకుని చూసేలోగా చిన్నారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. పోలీసుల తీరుకు నిరసనగా తల్లిదండ్రులు హైవేపై బైఠాయించారు. వారికితోడుగా మండ్యవాసులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు నిరసనకు దిగారు. దీంతో మండ్య ఎస్పీ మల్లికార్జున ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ట్రాఫిక్ ఏఎస్ఐలు జయరాం, నాగరాజ్, గురుదేవ్‌ను సస్పెండ్ చేశారు.

బ్యాంకు ఉద్యోగిని బెదిరించి పైసలు వసూల్

» లోను కావాలని ఇంటికి పిలిచి నిర్బంధం

» దుస్తులు తీయించి దాడి.. వీడియోలు, ఫొటోలు చిత్రీకరణ

» వాటిని తొలగిస్తామని రూ.6.50 లక్షలు వసూలు

చీరాల, మే 26 (ఆంధ్రజ్యోతి): లోన్ కావాలంటూ పిలిచి ఓ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్‌పై అమానుషంగా దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దాడిని రికార్డు చేసి బెదిరింపులకు పాల్పడి.. తిరిగి ఆయన వద్దే నగదు వసూలు చేసిన ఘరానా వ్యవహారమిది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు తారకరామానగర్‌కు చెందిన మద్దారపు విజయసారధి బాపట్ల జిల్లా చీరాల ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. బ్యాంకులో చీరాలకు చెందిన గరిక హేమలత రుణం తీసుకొని తిరిగి చెల్లించింది. తనకు మరోసారి ఇంటి రుణం కావాలని కోరింది. దీంతో ఆమె ఇంటి చిరునామాను బ్యాంకులో సీనియర్ మెసెంజర్‌గా పనిచేస్తున్న తెనాలి నెహ్రూను సారధి అడిగారు. ఆ తర్వాత నెహ్రూ ఆమెతో ఫోన్‌లో మాట్లాడారు. పక్కా పథకం ప్రకారం పట్టణ పరిధిలోని గంజిపాలెంలో ఓ ఇంటికి ఈ నెల 7న సారధిని పిలిపించారు. ఆయన అక్కడికి వెళ్లగా బయట ఉన్న ఓ మహిళ ఆయన్ను లోపల కూర్చోబెట్టి ఎక్కడికో వెళ్లింది. వెంటనే నలుగురు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేశారు. అధికారి దుస్తులు తీయించి అర్ధనగ్నంగా కూర్చోబెట్టి దాడి చేశారు. ఫొటోలు, వీడియోలు చిత్రీకరించారు. అధికారి ఫోన్ నుంచి రూ.72వేలను వారి ఖాతాకు మళ్లించుకున్నారు. మరో రూ.10లక్షలు ఇవ్వకుంటే మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు కేసుపెడతామని బెదిరించారు. సారధి అక్కడి నుంచి వెళ్లి ఆ ఇంటికి తనను పంపిన నెహ్రూకు జరిగిన ఉదంతాన్ని వివరించారు. అయితే తాను వారితో మాట్లాడి ఫొటోలు, వీడియో డిలీట్ చేయిస్తానని నమ్మబలికి అందరికీ కలిపి రూ.6.50లక్షలు ఇవ్వాలని ఒత్తిడి పెంచాడు. దీంతో సారధి ఈనెల 8న అడిగిన మొత్తాన్ని నెహ్రూకు ఇచ్చాడు. ఇదికాకుండా సమస్యను పరిష్కరించినందుకంటూ నెహ్రూ మరో రూ.75వేలు తీసుకున్నాడు. ఈ క్రమంలో నిందితులు మరో రూ.5లక్షలు డిమాండ్ చేశారు. దీంతో ఫీల్డ్ ఆఫీసర్ ఈ నెల 21న వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేసి రూ.5.70లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మరో మహిళ పరారీలో ఉన్నట్లు తెలిసింది.

నేటి నుంచే పసుపు పండుగ

కడపలో మహా సంబరానికి సర్వం సిద్ధం.. మూడ్రోజుల మహానాడు కోసం కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు

» మొదటి రోజు 23 వేల మంది ప్రతినిధులతో సభ

» సంస్థాగత నిర్మాణం, భావి కార్యాచరణపై చర్చ

» ఎల్లుండి 5 లక్షల మందితో భారీ బహిరంగసభ



కడపలో భారీ బహిరంగ సభకు సిద్ధమైన వేదిక, ప్రాంగణం

అమరావతి/కడప, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప గడపలో తెలుగుదేశం పార్టీ నిర్వహించే పసుపు పండుగకు సర్వం సిద్ధమైంది. కర్నూలు-కడప-చిత్తూరు జాతీయ రహదారిలోని రింగురోడ్డు వద్ద సువిశాలమైన 125 ఎకరాల్లో మంగళవారం నుంచి మూడ్రోజుల పాటు తెలుగుదేశం పార్టీ మహానాడు జరుగనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. కడప నగరం ఫ్లెక్సీలు, బ్యానర్లతో పసుపుమయంగా మారింది. సోమవారం రాత్రి సీఎం చంద్రబాబు ప్రత్యేక విమానంలో చేరుకోగా.. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ కుప్పం నుంచి రోడ్డు మార్గాన వచ్చారు. నాలుగు రోజులుగా మంత్రుల బృందం కడపలోనే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. ఏడాది పాలనలో కూటమి సాధించిన విజయాలను చర్చించడంతోపాటు ప్రజాపాలనపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను మహానాడు వేదికగా చర్చించనున్నారు. కడపలో తొలిసారి నిర్వహిస్తున్న ఈ వేడుక ద్వారా రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రకటించే అవకాశముంది. లోకేశ్ యువగళం పాదయాత్ర సమయంలో ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్‌ను చర్చించనున్నారు. మంగళవారం ఉద యం 8.30 గంటలకు ప్రతినిధుల నమోదు కార్యక్రమంతో మహానాడు ప్రారంభమవుతుంది. చంద్రబాబుతో ఇది మొదలవుతుంది. ఉదయం 10.30కు ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారు. 10.30-10.45 వరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తారు. 10.45 నుంచి 11 గంటల వరకు పార్టీ అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు ఇతర ముఖ్య నాయకులను వేదికపైకి ఆహ్వానించి పార్టీ జెండా ఆవిష్కరిస్తారు. జ్యోతిప్రజ్వలన, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి, తెలుగు తల్లి గీతాలాపన జరుగుతాయి. 11.20 నుంచి 11.30 వరకు జాతీయ ప్రధాన కార్యదర్శి నివేదిక, 11.30 నుంచి 11.45 వరకు రాష్ట్ర అధ్యక్షుడి ప్రసంగం ఉంటాయి. 23 వేల మంది పార్టీ ప్రతినిధుల సభలో సంస్థాగత నిర్మాణం, విధివిధానాలు, సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై కేడర్‌కు నేతలు దిశానిర్దేశం చేయనున్నారు. రెండో రోజు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన తీర్మానాలపై చర్చిస్తారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కన్వీనర్‌గా ఉన్న మహానాడు తీర్మానాల కమిటీ కసరత్తు పూర్తి చేసింది. ఏపీకి సంబంధించి 14 తీర్మానాలు ప్రతిపాదిస్తారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి ఐదు తీర్మానాలపైన, ఉమ్మడిగా నాలుగు తీర్మానాలపైన చర్చించి ఆమోదిస్తారు. చివరి రోజు గురువారం 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. 450 మంది కూర్చునే విధంగా మహానాడు ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. సమీపంలోనే 300 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. మహానాడుకు వచ్చిన టీడీపీ శ్రేణులతో ఉమ్మడి కడప జిల్లాలో ఉన్న హోటళ్లు, ప్రైవేటు ఫంక్షన్ హాళ్లు, ప్రైవేటు విద్యా సంస్థలన్నీ కిటకిటలాడుతున్నాయి. మహానాడు సందర్భంగా దాదాపు 15 ప్రత్యేక విమానాలు కడప ఎయిర్‌పోర్టుకు రానున్నట్లు టీడీపీ శ్రేణులు వెల్లడించాయి.

గతానికి భిన్నంగా కడపలో..

కడపలో నిర్వహించే మహానాడును టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మాజీ సీఎం జగన్ జిల్లా కావ డం, సీమలో గతంలో ఎన్నడూ లేని విధంగా 45 అసెంబ్లీ స్థానాలను కూటమి గెలుచుకోవడం, ఉమ్మడి కడప జిల్లాలో ఏడు స్థానాల్లో టీడీపీ కూటమి విజయంతో.. గతానికి భిన్నంగా ఈసారి కడపలో మహానాడు జరపాలని నిర్ణయించారు. ఏర్పాట్లకు వర్షం అడ్డంకిగా మారినా 19 కమిటీలు వేసుకుని పనులను యుద్ధ ప్రాతిపదికన చకచకా చేసేశారు. అతిథులకు సీమ వంటకాలతో విందు ఇస్తారు. ఉమ్మడి కడప జిల్లావ్యాప్తంగా అతిథులకు బస వసతి కల్పించారు.

లోకేశ్‌కు అశోక్ గజపతిరాజు మద్దతు

అమరావతి, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో లోకేశ్‌కు కీలక బాధ్యతలు అప్పగించేందుకు కడప మహానాడు వేదికగా నిలువనుంది. ఈ క్రమంలో పలువురు సీనియర్ నాయకులు ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ అంశంపై టీడీపీ సీనియర్ నేత, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 2019కి ముందు తనపై దుష్ప్రచారాన్ని ఎదుర్కొని, ప్రతిపక్షంలో ఉంటూ తన పోరాటాల ద్వారా తానేమిటో నిరూపించుకున్నారని.. పార్టీని ముందుకు నడిపించే లక్షణాలు ఆయనలో ఉన్నాయని చెప్పారు.

కదలరా.. కదలరా కడపవైపు కదలరా..

» మహానాడు కోసం కొత్త పాట రాసిన రచయిత కల్యాణ్‌చక్రవర్తి



హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): "పౌరుషాల నేలలోన పసుపు దమ్ము చూపించగా.. కదలరా కదలరా కడప వైపు. యువగళాల వేదికగా.. నవతరాల పూనికగా... నాడు నాడు మహానాడు" అంటూ తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు సభ కోసం గేయ రచయిత త్రిపురనేని కల్యాణ్ చక్రవర్తి కొత్త పాట రాశారు. ఆ పాటను తెలుగుదేశం పార్టీ యూట్యూబ్ చానల్‌లో అప్‌లోడ్ చేశారు. గతంలో ఎన్నికల సమయంలోనూ ఆయన టీడీపీ కోసం పలు పాటలను అందించారు. "జయహో ఆంధ్రమాత" అంటూ మొదలయ్యే ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పాట కూడా కల్యాణ్ రాసిందే.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వర్షాగమనం...!

నైరుతి రుతుపవనాలు ముందే వచ్చేశాయి. ఇంకాచెప్పాలంటే, వాతావరణశాఖ అంచనాలను కూడా త్రోసిరాజని జల్లులు కురుస్తున్నాయి. ఉగ్రవేసవి అధికారికంగా ముగియడానికి ఇంకా అనేకరోజులు ఉండగానే, ఏకంగా ఎనిమిది రోజుల ముందే రుతుపవనాలు కేరళను తాకాయి, తెలుగురాష్ట్రాలు కూడా వర్షాలకు తడిసి తరిస్తున్నాయి. రుతుపవనాలు ఇలా హడావుడిపడటం పాతికేళ్ళలో ఇది మూడోసారి, పదహారేళ్ళలో తొలిసారి. 2023లో వారంరోజులు ఆలస్యంగా కేరళను తాకి దేశాన్ని అల్లాడిపోయేట్టు చేసినందుకు కాబోలు, మరుసటి ఏడాది మే 30నే నైరుతి వచ్చి మనకు ఉపశమనాన్ని ఇచ్చింది. ఈ పలకరింపులో ఏ మాత్రం జాప్యం జరిగినా ఎంతటి క్షోభ కలుగుతుందో తెలుసు కనుకనే రైతే కాదు, సామాన్యుడు సైతం పవనాల రాకను స్వాగతిస్తున్నాడు, ముందేవచ్చినందుకు ముచ్చటపడుతున్నాడు.

రానున్నరోజుల్లో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణశాఖ శుభవార్త వినిపించింది. వ్యవసాయాధారిత దేశం కనుక అది నిజం కావాలనీ, అన్నదాత ఆనందించాలనీ నాయకులంతా కోరుకుంటున్నారు. జపాన్‌ను దాటి ప్రపంచ నాలుగవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారతదేశం ఆవిర్భవించిందని శనివారం నీతి అయోగ్ ప్రకటించింది. ఆర్థికవ్యవస్థ పురోగమనానికి రుతుపవనాలు ఊతాన్నిస్తాయి. ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు పడతాయన్నది ఖరీఫ్ పొంగిపొర్లేందుకు అవశ్యకమైన శుభవార్త. 2027లో జర్మనీని సైతం అధిగమించి అతిపెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ప్రభవిస్తుందన్న అంచనాలకు అనుగుణంగా, ఆ అద్భుత పురోగతి సుసాధ్యం కావడానికి రాబోయే సంవత్సరాల్లో సైతం వర్షాలు ఇదేరీతిలో ఉండాలని కోరుకోవాలి.

ఆహారధాన్యాల నిల్వలకు లోటేమీలేదు కనుక, మూడునెలల రేషన్ ముందుగానే ప్రజలకు పంచేసి, ఇబ్బడిముబ్బడిగా రాబోతున్న ఉత్పత్తికి గిడ్డంగులను సిద్ధం చేయమంటూ రాష్ట్రాలను కేంద్రం ఇప్పటికే ఆదేశించింది. గత ఏడాది దేశవ్యాప్తంగా మిగులు వర్షపాతం ఉన్నా పంజాబ్, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ ఇత్యాది రాష్ట్రాల్లో లోటు నమోదుకావడం, మరోపక్క రాజస్థాన్, గుజరాత్ వంటివి మునిగిపోవడం చూశాం. పంటదిగుబడి ఇంకా అధికంగా వర్షాలమీదే ఆధారపడుతున్న ఈ దేశంలో చినుకుపడితే ఆనందం, ఆగితే విషాదం పక్కపక్కనే ఉంటాయి. ఒకచోట కుంభవృష్టి, మరొకచోట అనావృష్టి సహజమైపోయాయి. వాతావరణ మార్పు కారణంగా వర్షపురోజుల సంఖ్య క్రమంగా తగ్గుతూ, కుంభవృష్టితో ప్రళయాలు వచ్చిపడే పాడుకాలం దాపురించింది. ఇరిగేషన్ సౌకర్యాల విస్తరణ జరగకుండా దేశంలో ఎక్కువమంది రైతన్నలు ఇంకా మేఘాలనే నమ్ముకొని వ్యవసాయం చేయడం వారిని ఆర్థిక కష్టాల్లోకి నెట్టేసి, ఆత్మహత్యల వరకూ తీసుకుపోతున్నది. నీటి సౌకర్యాలను మెరుగుపరచి, విత్తనాలనుంచి గిడ్డంగుల వరకూ అన్నింటా అండగా నిలిచి, ప్రకృతిప్రకోపాలకు ప్రత్యక్షంగా బలైపోయే పరిస్థితులనుంచి వారిని బయటకు తీసుకురావాలి. రుతుపవనాలు ముందుగా వచ్చిన ఉత్సాహాన్ని డిల్లీ, ముంబై, బెంగుళూరు వంటి మహానగరాలు మునిగిపోతున్న దృశ్యాలు నీరుగారుస్తున్నాయి. మూడోవంతుకంటే ఎక్కువ జనాభా నివసిస్తున్న నగరాలు నాలుగు చినుకులకే అల్లాడిపోతున్నాయి. కాస్తంత తక్కువ వర్షం పడితే, భూగర్భజలాలు అడుగంటిపోవడం, నీటికి అల్లాడిపోవడం, మరోపక్క మేఘాలు కాస్తంత దయతలిస్తే చిగురుటాకుల్లా వొణికిపోవడం సర్వసాధారణమైపోయింది. ఇక, ఈ రుతువులతో సంబంధం లేకుండా నగరాలను ముంచేస్తున్న కుంభవృష్టులకు మన వ్యవస్థలను సంసిద్ధం చేయాల్సిన బృహత్తర కర్తవ్యం మిగిలే ఉంది. వాతావరణమార్పును నివారించడంతో పాటు, సాగు, తాగునీరు, మురుగునీటి వ్యవస్థలను మెరుగుపరుచుకోవాలి.

రుతుపవనాల వల్ల వర్షాన్ని పొందుతున్న దేశాల్లో మనదే ప్రధానమైనది, పెద్దదీ అంటారు. దేశం అన్ని రంగాల్లో ఎంత ఎదుగుతున్నా డెబ్బయ్‌శాతం సాగు, తాగునీటిని అవసరాలను తీరుస్తూ, జనాభాలో తొలిస్థానంలో ఉన్న ఈ దేశానికి ప్రాణాన్నిస్తున్న రుతుపవనాల ప్రాధాన్యం లెక్కకు అందనిది. 2009లో పవనాలు ఇప్పటికంటే ముందే వచ్చినా, 23శాతం వర్షలోటుతో దేశాన్ని పొడిబార్చిన సంగతి తెలిసిందే. రాకపోకలే కాదు, విస్తరణలోనూ అనిశ్చితిని కనబరచే రుతుపవనాలకు ఈ ఏడాది ఏ అడ్డంకులు ఏర్పడకూడదని, గత పదిహేనేళ్ళకాలంలో వీటి మంచిచెడులను మరికాస్తంత కచ్చితత్వంతో చెప్పగలుగుతున్న వాతావరణశాఖ అంచనాలకు అనుగుణంగా వాటి పురోగతి, ప్రభావం ఉండాలని కోరుకుందాం.

యుద్ధలాభం ఆయుధ వ్యాపారులకే!



పహల్గామ్ ఉగ్ర దాడి తరువాత సంభవించిన పరిణామాలు విస్తృత చర్చకు దారితీశాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కూడా స్వాధీనం చేసుకోడమే తమ ధ్యేయమన్న బీజేపీ నాయకుల సారథ్యంలో భారత్ వెనక్కి తగ్గిందనే ప్రచారం సాగింది. దీనిని తుడిచిపెట్టడానికి ఆపరేషన్ సిందూర్ విజయాన్ని చాటుతూ దేశమంతా ఊరేగింపులు జరిగాయి. వాస్తవంలో పూర్తిస్థాయి యుద్ధం దరిదాపులకు వెళ్లిన భారత, పాకిస్థాన్‌లు ఉన్నపళంగా ఘర్షణలను విరమించుకున్నాయి. ఇది సిమ్లా ఒప్పందం మేరకు రెండు దేశాల మధ్య చర్చల ద్వారానే జరిగిందని తాజాగా ప్రకటించుకున్నప్పటికీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చొరవతోనే యుద్ధం ఆగిందన్న సమాచారం మెరుపు వేగంతో వ్యాపించింది. అప్పుడు దానిని రెండు దేశాల పాలకులూ తక్షణమే ఖండించలేదు.

యుద్ధమే జరిగితే సంభవించబోయే ఘోర పరిణామాల గురించి వివరించనక్కరలేదు. అటువంటి భయానక స్థితిని తొలగించినందుకు, భారత పాకిస్థాన్ పాలకులను ఇందుకు ఒప్పించినందుకు అమెరికా అధ్యక్షుడిని అభినందించడంలో తప్పు లేదు. అయితే ఇంతటితో యుద్ధ భాష ఆగకపోడమే ఆందోళనకరం. పరస్పరం పిప్పి, పిండి చేసుకోవాలన్న 'మీసాల' మెలివేత కొనసాగుతూనే ఉంది. ఇది రెండు దేశాల పాలకులు తమ ప్రజల్లో పొరుగు దేశం పట్ల ద్వేషాన్ని మరింతగా పెంచి రాజకీయంగా లాభపడడానికి పాటిస్తున్న వ్యూహమే. దీనివల్లనే శాశ్వత చర్చలకు ఆటంకం కలుగుతున్నది.

ఇక్కడే మరొక బాధాకర పరిణామం—1971లో బంగ్లాదేశ్ అవతరణకు దారితీసిన యుద్ధంలో అమెరికాను సైతం ధిక్కరించిన ఇందిరాగాంధీతో మోదీని పోల్చుతున్నారు. తూర్పు, పశ్చిమ పాకిస్థాన్ల మధ్య తలెత్తిన ఆ యుద్ధం వల్ల లక్షలాదిమంది తూర్పు పాకిస్థానీయులు మన దేశంలోకి పారిపోయి రాడంతో ఇందిరాగాంధీ భారత దళాలతో ముక్తిబాహినిని సృష్టించి బంగ్లాదేశ్ అవతరణకు తోడ్పడ్డారు. అయితే ఆ యుద్ధం వల్ల సంభవించిన మానవ శోకం చెప్పనలవి కానిది. మోదీ పాకిస్థాన్‌ను ఆ విధంగా ఓడించలేకపోయారని అనడం యుద్ధ పిపాసనే సూచిస్తున్నది. ఇది తమ ఓటు బలాన్ని తగ్గిస్తుందని, చేరువలో ఉన్న బిహార్ ఎన్నికల్లో దెబ్బ తింటామని బీజేపీ భయపడుతున్నది. అంతేగాని పూర్తి స్థాయి యుద్ధానికి వెళ్లకుండా నిగ్రహం పాటించినందుకు సంతోషించడం లేదు. ఆపరేషన్ సిందూర్ ద్వారా మోదీ పాకిస్థాన్ పీచమణిచారన్న అభిప్రాయాన్నీ బలంగా నాటుతున్నారు. పాకిస్థాన్‌ను మోకాళ్ళ మీదకు తెచ్చామని ఆయన కూడా ప్రకటించారు. ఈ అవకాశం, ఈ స్వేచ్ఛ తమకు ఇచ్చినందుకు భారత దళాలు ప్రధాని మోదీకి మొక్కుతున్నాయి అనేవారూ బయలుదేరారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఇంతవరకూ జరిగిన నాలుగు యుద్ధాల్లో అసంఖ్యాకంగా సైనికులు మరణించారు. ఆయుధాలకోసం రెండు దేశాలు విశేషంగా డబ్బు తగలబెట్టాయి.

భారత ఉపఖండంలో రాజకీయం ఇప్పటికీ మతోన్మాదం ప్రాతిపదికనే కొనసాగుతున్న మాట కాదనలేని సత్యం. కశ్మీర్ పరిణామాలకూ అదే ఇంధనమవుతున్నది. హిందూత్వ రాజకీయాల మత కోణం దేశ ప్రజల మధ్య సృష్టిస్తున్న విభజన గురించి వివరించనక్కరలేదు. మతపరంగానో, సరిహద్దు వివాదం పరంగానో యుద్ధం తలెత్తితే అవతలి దేశాన్ని చీల్చి చెండాడాలని, దాన్ని నామరూపాలు లేకుండా చేసేయాలని పళ్ళు పటపటా కొరకడాన్ని అటూ ఇటూ గల ప్రజలకు అలవాటు చేశారు. భారత సైనిక దళాల మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకుంద్ నరవానే యుద్ధాన్ని గురించి కొద్ది రోజుల క్రితమే మంచి మాటలు చెప్పారు. యుద్ధాలు బాలీవుడ్ సినిమాలు కావన్నారు, యుద్ధాల్లో ఎంతమంది చనిపోతారో, మరెంతమంది వికలాంగులై జీవితాంతం ఎడతెగని వ్యథను అనుభవిస్తారో గుర్తు చేశారు. కురుక్షేత్రం లాంటి యుద్ధ గాథలు సినిమాల్లో, నాటకాల్లో చూడ్డానికే బాగుంటాయి. ఒకరినొకరు నరుక్కోడం, శత్రువు రొమ్ము చీల్చి రుధిరమ్ము తాగడం వాస్తవంలో ఎంతమాత్రం కోరదగినవి కావు. ఇప్పుడు సరిహద్దుల రక్షణలో కన్నార్పకుండా కాపలా కాస్తున్నవారిలో, యుద్ధాల్లో ప్రాణాలు విడుస్తున్నవారిలో అత్యధికులు పేద బహుజనులే. ఉపాధి కరువై పొట్ట కూటి కోసం సైన్యంలో చేరుతున్నవారే ఎక్కువమంది.

పహల్గాం ఉగ్ర దాడి బహు హేయమైనది. ఈ ఉన్మాదులు భారత, పాకిస్థాన్‌లు చేరువ కాకుండా అన్ని తంత్రాలను ప్రయోగిస్తున్నారు. రెండు దేశాల మధ్య మతపరమైన దూరాన్ని పెంచి దాన్ని అధిగమించడానికి వీలు లేని స్థాయికి తీసుకువెడుతున్నారు. భారత వ్యతిరేక ఉగ్రశక్తులకు పాకిస్థాన్ సైన్యం అండదండలు లభిస్తున్నాయి. అది పాక్ ప్రేరిత ఉగ్రవాదమే. అయితే ఈ విషయాన్ని మనం నమ్ముతున్నంతగా మిగతా ప్రపంచం నమ్మడం లేదు. మిగతా దేశాలు భారత్, పాకిస్థాన్లను ఒకేలా చూస్తున్నాయి. ఈ విషయాన్ని భారత పాలకులు తెలుసుకోవాలి. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌ను భారత్ గట్టి దెబ్బే తీసింది. అంతటితో ఆగకుండా పాకిస్థాన్ నిజస్వరూపాన్ని తెలియజేయడానికి దేశ దేశాలకు పార్లమెంటు సభ్యుల బృందాలను పంపించడం బాగుంది. అయితే అది కూడా రాజకీయ విభేదాలకు దారి తీయడం బాధాకరం. పాకిస్థాన్‌పై బలంగా విరుచుకుపడ్డాం గాని పహల్గాం దాడి ముష్కరులను కనుక్కోడంలో జాప్యం జరుగుతున్నది. వారెవరో స్పష్టంగా తెలిస్తే బాగుంటుంది. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలని భావిస్తున్న దేశాల ప్రజలు యుద్ధోన్మాదంతో వూగిపోడం సరైనది కానే కాదు. ఇది రక్షణ ఖర్చును ఆకాశానికి చేర్చి ప్రజలను కనీస విద్య, వైద్యం కూడా దొరకని దారిద్ర్యంలో కూరుకుపోయేలా చేస్తుంది.

వాస్తవానికి టెర్రరిజం సమస్య చాలా లోతైనది. ప్రపంచ పాలకులు ముఖ్యంగా అమెరికా ఇజ్రాయెల్ వంటి దేశాలు చిత్తశుద్ధితో ఆలోచిస్తే వాటి అసలైన మూలాలు కనిపిస్తాయి. భారత పాకిస్థాన్‌లకూ ఇదే వర్తిస్తుంది. టెర్రరిజం గాని, వామపక్ష ఉగ్రవాదం గాని ఊరకే ఆకాశం నుంచి ఊడిపడేవి కావు. మెజారిటీ, మైనారిటీలు హాయిగా శాంతియుత సహజీవనం చేస్తున్న చోట సెక్యులరిజం వర్ధిల్లుతున్న దేశంలో మతపరమైన మెజారిటీని మైనారిటీల మీదికి రెచ్చగొట్టడం ప్రజాస్వామ్యమనిపించుకోదు. పాక్‌కు జీలం నదీ నీటిని ఆపడం గాని, ఘర్షణలకు కారణమయ్యారని భావించి వారి ఇళ్ల కూల్చి తల మీద కప్పు లేకుండా చేయడం గాని మానవీయమైన పనులు కావు. కక్ష కక్షనే ఇస్తుంది. ఉగ్రవాదానికి అది కూడా దారి తీస్తుంది. మన దేశంలో అధిక సంఖ్యాకుల మతస్వామ్యం వంటిదే రాజ్యమేలుతున్నది. వక్ఫ్ బిల్లులో మోదీ ప్రభుత్వం తేదలిచిన మార్పులను సెక్యులర్ రాజ్యాంగ రక్షకురాలైన సుప్రీంకోర్టు తీవ్రంగా ప్రశ్నించడమే ఇందుకు నిదర్శనం. ఉగ్రవాదం క్రూరమృగం కంటే ప్రమాదకరమైనది. దాని నిజమైన మూలాలు తెలుసుకొని వాటిని నిర్మూలించినంతవరకూ పేట్రేగుతూనే ఉంటుంది. బలమైన శత్రువు నేరుగా బరి మీదికి వస్తాడు. తగిన బలం లేనివాడు దొంగదెబ్బ తీస్తాడు. హమాస్ ఒకసారి తమపై దాడి చేసిందని ఇజ్రాయెల్ గాజాలో ఇప్పటివరకు దాదాపు అరవై వేలమందిని హతమార్చింది. వారిలో ముక్కుపచ్చలారని పసి పిల్లలు, మహిళలే అధికులు. అయినా హమాస్ కాకపోతే మరో ఉగ్రవాద సంస్థ పుడుతూ ఉండడానికే ఆస్కారం ఎక్కువ.

యుద్ధాలు అత్యంత ఖరీదైన ఆధునిక ఆయుధాల కొనుగోలును పెంచుతున్నాయి. దాని వల్ల కోట్లాది ప్రజలు బలవుతున్నారు. అమెరికన్ ఆయుధ కంపెనీల ఆదాయం ఆకాశానికి అంటుతున్నది. ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరా వల్ల 2024లో అమెరికన్ లాక్ హీడ్ కంపెనీ లాభాలు 14శాతం పెరిగాయి. ట్రంప్ పర్యటనలో అమెరికా నుంచి 152 బిలియన్ డాలర్ల ఆయుధాల కొనుగోలుకు సౌదీ అరేబియా ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ కొనుగోలును 600బిలియన్ డాలర్ల వరకూ తీసుకుపోడానికి ఒప్పందం కుదిరింది. భారతదేశం కూడా ఈ ఉచ్చులో చిక్కుకున్నది. ప్రధాని మోదీ అమెరికా ఆయుధ మార్కెట్లో చక్కర్లు కొడుతున్నారు. 2020 నుంచి 2025 వరకు భారతదేశం రక్షణ కోసం 350 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. పాకిస్థాన్ మిలిటరీ దేశం అని యెత్తి చూపే మనం ఎంత శాంతి కాముకులమో దీనిని బట్టి తెలుస్తున్నది. ఇంత చేసీ కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని తొలగించగలిగామా, లేదు. 2020 నుంచి కశ్మీర్‌లో టెర్రరిజం నిరాఘాటంగా సాగిపోతున్నది. వందలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారు. టూరిజం దారుణంగా దెబ్బ తిని లక్షలాది మంది ఉద్యోగాలు కొల్పోతున్నారు. ఆపిల్ వ్యాపారం మూతబడిపోతున్నది. గతంలోకి వెడితే 2015 డిసెంబర్‌లో ఆఫ్ఘానిస్తాన్ పర్యటన నుంచి తిరుగు ప్రయాణంలో ప్రధాని మోదీ ఊహించని విధంగా లాహోర్‌లో దిగి అప్పటి పాక్ అధినేత నవాజ్ షరీఫ్‌తో సమావేశమయ్యారు. నవాజ్ మనుమరాలి పెళ్ళికి హాజరయ్యారు. మళ్ళీ అటువంటి సన్నివేశాలను చూడలేమా, రెండు దేశాల మధ్య అతి చేరువ వ్యాపారం తిరిగి వర్ధిల్లదా, ఆయుధాల కొనుగోలుతో దేశాలకు దేశాలు ఆకలి అవిద్య జబ్బుతో, మందుల కరవుతో ఆత్మహత్య మార్గం పట్టడం ఆగదా, శాంతి పుంజం ప్రసరించదా?

> బంగ్లాదేశ్ అవతరణకు దారితీసిన యుద్ధంలో అమెరికాను సైతం ధిక్కరించిన ఇందిరా గాంధీతో మోదీని పోల్చుతున్నారు. కానీ ఆ యుద్ధం వల్ల సంభవించిన మానవ శోకం చెప్పనలవి కానిది. మోదీ పాకిస్థాన్‌ను ఆ విధంగా ఓడించలేకపోయారని అనడం యుద్ధ పిపాసనే సూచిస్తున్నది. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలని భావిస్తున్న దేశాల ప్రజలు యుద్ధోన్మాదంతో ఊగిపోవడం సరైనది కానే కాదు. ఇది రక్షణ ఖర్చును ఆకాశానికి చేర్చి ప్రజలను కనీస విద్య, వైద్యం కూడా దొరకని దారిద్ర్యంలో కూరుకుపోయేలా చేస్తుంది.

■ గార శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

ఎన్‌కౌంటర్లలో మరణించేది మానవత్వం, ప్రజాస్వామ్యం కూడా!

ఇటీవల జరిగిన 'ఎన్‌కౌంటర్‌'లో 27 మంది మావోయిస్టులు చనిపోయారని, వారిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు కూడా మృతి చెందారని కేంద్ర హోం మంత్రి ప్రకటించారు. హోం మంత్రి, ప్రధానమంత్రి ఇద్దరూ ఈ 'ఘనత'కు కారణమైన తమ బలగాలను బహిరంగంగా అభినందించారు. విజయోత్సాహంతో తమ విధానాన్ని పునరుద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని నెలలుగా మావోయిస్టు పార్టీ మీద యుద్ధం ప్రకటించి, ఏకపక్షంగా దాడి చేస్తూ వారిని తుదముట్టిస్తోంది.



మావోయిస్టుల మార్గంతో చాలామంది విభేదించవచ్చు. ఈ అత్యాధునిక సాంకేతికతల నేపథ్యంలో, దేశంలోని సగటు ప్రజలు గతంలో కంటే సాపేక్షికంగా అభివృద్ధి చెందిన ఈ కాలంలో మావోయిస్టు పార్టీ ఇప్పుడు అవలంబిస్తున్న మార్గం బహుశా కాలం చెల్లిపోయినది కూడా కావచ్చు. మావోయిస్టుల కారణంగా ఒకానొక కాలంలో ప్రత్యక్షహింస పెరిగి ఉండవచ్చు. అదే సమయంలో వారు పాల్పడ్డ నిరర్థక హింస కంటే వారు అనుభవించిన హింస శాతమే ఎక్కువ. సమసమాజ స్థాపనకు ఎంత దూరంలో ఉన్నా, తమ మార్గంలో వారెప్పుడూ నోరులేని, అత్యంత బలహీనవర్గాల పక్షమే అనేది ఎవరూ కాదనలేని సత్యం. మరి ఈ రోజు పరిపాలకులుగా ఉన్న వారి చరిత్ర ఏమిటి? వారు కాపాడుతున్న కార్పొరేట్ల చరిత్ర ఏమిటి?

ప్రభుత్వంతో చర్చిస్తామని, అందుకు అవకాశం కల్పించాలని మావోయిస్టులు రెండు నెలలుగా అభ్యర్థిస్తున్నారు. మావోయిస్టులతో ప్రభుత్వం చర్చించి ఈ వివాదానికి ఒక శాంతియుత, రాజకీయ పరిష్కారాన్ని సాధించాలని తెలంగాణ సహా దేశంలోని ప్రజాస్వామిక వాదులందరూ కోరుతున్నారు. మావోయిస్టులు ఈ యుద్ధంలో పూర్తిగా ఓడిపోతున్న సందర్భంలో మాత్రమే చర్చల ప్రస్తావన తీసుకువస్తున్నారని, వారేమీ శాంతికాముకులు కాదు కాబట్టి చర్చలు చేయాల్సిన అవసరం లేదని పాలక పార్టీ మేధావులు తీర్పులిస్తున్నారు. అవును, వారు బలహీనపడే అడుగుతున్నా, వారితో మాట్లాడితే తప్పేమిటి? యుద్ధానంతర ఒడంబడికలన్నీ అలాగే కదా జరిగేది. ఇక్కడా అదే నీతి వర్తిస్తుంది. అది సాధ్యమైతే ఇప్పటికైనా మరింత రక్తపాతం ఆగుతుంది కదా! అది సాధించిన వారు చరిత్రలో చాలా రక్తపాతాన్ని ఆపిన ఉత్తమ పరిపాలకులుగా నిలిచిపోతారు కదా! బలహీన పక్షంపైన బలంగా ఉన్న ప్రభుత్వం ఎన్ని షరతులైనా పెట్టవచ్చనేది లోకజ్ఞానంలోని విషయమే. తమ ఆధిపత్యానికి అడ్డంకిగా ఉన్న వారిని అంతం చేసి మాత్రమే అడ్డు తొలగించుకోవడం ఆటవిక జాతుల నీతి. ఆ సమస్యను చర్చించి, రాజకీయంగా పరిష్కరించుకోవటం మానవీయ, ప్రజాస్వామ్య నీతి. మావోయిస్టులు తిరిగి బలపడతారనేది మరో వాదన. వారు రాజకీయంగా బలపడితే బలపడవచ్చు. కానీ సాయుధంగా బలపడతారనేది చర్చలకు వెళ్లకుండా ఉండటానికి చెప్పే సాకు మాత్రమే.

కొన్ని సార్వజనీన, మానవీయ, ప్రజాస్వామ్య విలువలను, సూత్రాలను పరిపాలకులైనా, వారిని ధిక్కరించే వారైనా పాటించి తీరాలని కోరుకోవడం, ఆ రకమైన విమర్శ చేయడం పౌరసమాజం బాధ్యత. చైతన్యం గల పౌరసమాజాన్ని కలిగిన దేశాల్లోని ప్రభుత్వాలే ప్రజలకు జవాబుదారీగా ఉండగలవు. ఆ దేశాల్లోనే ప్రభుత్వాలు తమ సొంత ప్రజలపై యుద్ధం చేయవు. అటువంటి దేశంలోనే ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, భద్రత, జీవ వైవిధ్యం, పర్యావరణం, ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలు సజీవంగా ఉంటాయి. మన మధ్య అలాంటి విలువలను నెలకొల్పుకోగలమా? పాలకులను ప్రజాస్వామ్యం అనే దారిలోకి తేగలమా?!

– డా. ఎస్.తిరుపతయ్య, మానవ హక్కుల వేదిక

డిగ్రీ అతిథి అధ్యాపకుల గోడు వినండి

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని 150 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 1,940 మంది గెస్ట్ లెక్చరర్లు పని చేస్తున్నారు. రాష్ట్రంలో ఈ అతిథి అధ్యాపకులతో బోధనా విధానం 2012లో మొదలైంది. ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు 'త్రీ మెన్ సెలెక్షన్ కమిటీ' ద్వారా గెస్ట్ లెక్చరర్లను స్వయంగా నియమించుకుంటున్నాయి. పీహెచ్‌డీ, నెట్, సెట్ వంటి ఉన్నత విద్యార్హతలున్నప్పటికీ మా శ్రమకు తగిన వేతనం, గుర్తింపు దక్కడం లేదు. 'గంటల' విధానంలోనే ప్రభుత్వం మాకు గౌరవ వేతనం చెల్లిస్తోంది.

పాఠం చెబితేనే జీతం అనే నిబంధన ఉంది. అంటే ఒక్క పీరియడ్‌కు 390. నెలలో 21 రోజులు 72 పీరియడ్‌లు వస్తే ఆ నెల రూ. 28,080వస్తాయి. దసరా, సంక్రాంతి వంటి పండుగలతో పాటు విద్యార్థులకు ప్రిపరేషన్ హాలిడేస్, సమ్మర్ హాలిడేస్ సెలవుల సమయంలో మాకు నెలకు కేవలం రూ. 3000 నుంచి 10,000 ఇస్తారు. అంటే ఏడాదిలో మాకు ఆరు నుంచి ఏడు నెలలు మాత్రమే బోధన ఉంటుంది. మా సాలీన వేతనం రూ. 1,80,000 మాత్రమే. అంటే ఓ గవర్నమెంట్ రెగ్యులర్ ఫ్యాకల్టీ నెల వేతనం మా గెస్ట్ లెక్చరర్ల వార్షిక వేతనంతో సమానం!


సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని న్యాయస్థానాలు చెబుతున్నప్పటికీ ప్రభుత్వాలు మా గోడును పట్టించుకోవడం లేదు. ఆ జీతం కూడా మాకు మూడు నాలుగు నెలలకోసారి మాత్రమే అందుతోంది. రాష్ట్రంలోని యూనివర్సిటీలతో పాటు రెసిడెన్షియల్స్, డైట్, బీఈడీ, ఎంఈడీ, ఇంటర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లుగా చేస్తున్న వారిని ప్రతి ఏడాదీ రెన్యువల్ చేస్తున్నారు కానీ మాకు మాత్రం ఉద్యోగభద్రత లేకుండా ప్రతి ఏడాదీ ఇంటర్వ్యూలు నిర్వహించడం ఎంత వరకు సమంజసం?

ప్రస్తుతమున్న 'అవర్లీ' చెల్లింపుల విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలి. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా గెస్ట్ లెక్చరర్లకు నెలకు రూ. 50 వేల 'కన్సాలిడేషన్ పే'ను ప్రభుత్వం అమలు చేయాలి. ప్రస్తుతం ప్రతి ఏడాదీ నిర్వహిస్తున్న డెమో విధానాన్ని రద్దు చేసి, హైకోర్టు తీర్పు ప్రకారం మమ్మల్ని రెన్యువల్ చేయాలి. ఉచిత వైద్యం, ప్రమాద బీమా వంటి సౌకర్యాలనూ కల్పించాలి. డిగ్రీ అధ్యాపకుల రెగ్యులర్ పోస్టుల నియామకంలో అనుభవం ఆధారంగా మాకు వెయిటేజీ ఇవ్వాలి. ప్రమోషన్ ఆధారంగా ఏర్పడే ఖాళీల్లో గెస్ట్ లెక్చరర్లను నియమించి, వారిని కొనసాగించాలి. మేమూ ఉన్నత విద్యా వ్యవస్థలో భాగమే అని గుర్తించి, మా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

– కొర్ర ఈశ్వర్, ఓయూ, డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

తెలంగాణ ఆత్మగౌరవ పతాక

> ప్రతిభావంతుడైన సురవరం ప్రతాపరెడ్డి కృషి భావితరాల వారికి అందాలంటే ఆయన రచనలన్నీ సంపుటాలుగా రావాల్సిన అవసరమున్నది. దానికి తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం నిధులు కేటాయించి పని అప్పజెబితే బాగుంటుంది. అది సాధ్యం కాని దశలో తెలంగాణ సారస్వత పరిషత్ సంస్థ దాతల సహకారంతో నిధులు సేకరించి, ఈ సంపుటాల ముద్రణకు ప్రయత్నించాలి. అలాగే ప్రతాపరెడ్డిపై ప్రామాణికమైన ఆంగ్ల గ్రంథం వెలువడాలి.



తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. బహుముఖ ప్రజ్ఞాశాలి. వైతాళికుడు అంటే జాతిని మేల్కొలిపేవాడు. అభివృద్ధిబాటలో అభ్యుదయ పథంలో నడిపేవాడు. అట్లా నడిపించడానికి ఎన్ని రంగాల్లో పనిచేయాలో సురవరం అన్ని రంగాల్లో పనిచేసిండు. హైదరాబాద్ లాంటి రాజరికపు పాలనలో సైతం ఆధునికతకు పట్టం కట్టిన ప్రతిభాశాలి. హైదరాబాద్‌లో తొలి రాజకీయ సభలు మొదలు పెట్టి ఉద్యమం ఫలప్రదం చెంది ప్రజాస్వామికంగా ఎన్నికలు జరిగే వరకూ అన్ని దశల్లోనూ మొక్కవోని ధైర్యంతో, తెగింపుతో అవిశ్రాంతంగా పనిచేసిన ధీశాలి. ప్రజలను మేలుకొలిపేందుకు, హక్కుల భావనను, ప్రజాస్వామిక భావజాలాన్ని ప్రచారంలో పెట్టేందుకు రచన, పరిశోధన, పరిష్కరణ, ప్రచురణ, పత్రికా ముద్రణ, గ్రంథమాలల స్థాపన చేసిండు. పలు సంస్థలను నిర్మించిండు. విద్య ద్వారానే సమాజంలో జ్ఞానం విలసిల్లుతుందని తద్వారా చైతన్యవంతులైన బుద్ధిజీవులు హక్కుల కోసం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కోసం కొట్లాడుతరని నమ్మి, హైదరాబాదులో ఆంధ్ర విద్యాలయ స్థాపన చేసిండు. విద్యారంగ అభివృద్ధికి విశేషమైన కృషి చేసిండు. ఉర్దూ మీడియం పాఠశాలలకు పోటీగా తెలుగు పాఠశాలలు నెలకొనాలని చిత్తశుద్ధితో కృషి చేసిండు.

తెలంగాణలో 1920వ దశకంలో సాంస్కృతిక పునర్వికాసోద్యమానికి బలమైన పునాదులు వేసినవారు సురవరం ప్రతాపరెడ్డి. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో జమిందారీ, జాగీర్దారీ హక్కులు జతాయించడం, దొరతనం చలాయించడంపైనే శ్రద్ధ పెట్టిన రెడ్డి సామాజిక వర్గాన్ని విద్యవైపు మళ్లించినవాడు ప్రతాపరెడ్డి. రాజబహదూర్ వెంకటరామారెడ్డి సహకారంతో రెడ్డి హాస్టల్‌ని 1918లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసి, దాని ద్వారా ఎందరో విద్యార్థులను తన కనుసన్నల్లో తీర్చిదిద్దిండు. ఎలాంటి కట్టడి లేకుండా పెరిగిన దొరల బిడ్డలను తనదైన క్రమశిక్షణతో నడిపించి, వారి పురోభివృద్ధికి కృషి చేసిండు. కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు రావి నారాయణరెడ్డి, ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, బద్దం ఎల్లారెడ్డిలతో పాటు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తదితరులు కూడా రెడ్డి హాస్టల్‌లో ఉండి చదువుకున్నవారే! ఈ హాస్టల్‌లోనే 11వేల పుస్తకాలు, పాత తాళపత్ర గ్రంథాలతో ఒక లైబ్రరీని సురవరం ప్రతాపరెడ్డి ఏర్పాటు చేసిండు. అప్పటికిది అసఫియా తర్వాత అతి పెద్ద లైబ్రరీ. ఈ లైబ్రరీలో సంఘవిద్రోహ పుస్తకాలు (సావర్కర్ రచనలు) ఉన్నాయని కేసులను సైతం ఎదుర్కొన్నాడు. దీనికి తోడు విద్యార్థులు శారీరక ధారుఢ్యం కోసం ఒక జిమ్‌ని, మరో డిస్పెన్సరీని ఏర్పాటు చేసిండు. ఇక్కడ ఎలాంటి కుల వివక్ష లేకుండా అడ్మిషన్లుండేవి. హాస్టల్ పునాదిగా ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన సురవరం, ఆ తర్వాత తెలంగాణ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో తనదైన ముద్ర వేసిండు. తెలంగాణ 'వరం'గా సురవరం ఖ్యాతి గాంచిండు. తర్వాతి తరానికి దార్శనికుడిగా నిలిచిండు.

రెడ్డి హాస్టల్‌తో ప్రారంభమై ఆ తర్వాత వేమన ఆంధ్ర భాషా నిలయం, శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయాలతో మమేకమయింది. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం కార్యవర్గంలో చాలా ఏండ్లు సభ్యుడిగా ఉండి అనేక మంది పండితులతో సభలు సమావేశాలు ఏర్పాటు చేసిండు. రెడ్డి హాస్టల్ తర్వాత ప్రతాపరెడ్డి కృషి 1925 నుంచి 'గోలకొండ' పత్రికపై కేంద్రీకరించారు. ఈ పత్రికలో పెట్టుబడి పెట్టిందంతా రెడ్డి దొరలే అయినా, ఆ దొరల తప్పులను పత్రికలో ఎత్తి చూపడానికి, వారిని నిలదీయడానికి ప్రతాపరెడ్డి ఎన్నడూ వెనకాడలేదు. తాను ఆంధ్రమహాసభలో కీలక నాయకుడయినా, అందులో జరిగే ఏకపక్ష నిర్ణయాలను, ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను తన పత్రికల్లో సంపాదకీయాల ద్వారా తప్పు పట్టిండు. నందగిరి వెంకటరావు లాంటి 'అభివృద్ధి' పక్షంలోని యువతరాన్ని ప్రోత్సహించిండు.

ఆంధ్ర జనసంఘం, ఆ తర్వాత ఆంధ్రమహాసభతో మమేకమయిండు. 1930లో జోగిపేటలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభకు అధ్యక్షత వహించడమే గాకుండా అక్కడ బచ్చు వెంకటేశం గుప్త లాంటి సనాతనులు... దళితుడైన భాగ్యరెడ్డి వర్మ వేదిక ఎక్కకూడదని భీష్మించడంతో వారిని సముదాయించి, ఒప్పించిండు. భాగ్యరెడ్డి వర్మకు వేదిక కల్పించి ఆయనకు సభలో ప్రసంగించడానికి అవకాశం కల్పించిండు. తెలంగాణలో ఒక దళితుడికి తెలుగువారి వేదిక మీద అవకాశం కల్పించడం అదే మొదటిసారి. జోగిపేట చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల కోసం హరికథలు, బుర్రకథలు ఏర్పాటు చేసి దళితులు సైతం సమాన గౌరవం పొందడానికి అర్హులు, వారి పట్ల వివక్ష చూపడం తప్పని ప్రచారం చేసిండు. సురవరం ప్రతాపరెడ్డి 1927 ప్రాంతంలో ప్రారంభమయిన 'అరుంధతీయ మహాసభ'కు గౌరవాధ్యక్షుడిగా ఉన్నాడు. ముదిరాజ్ మహాసభ, మున్నూరు కాపు, పద్మశాలి, గౌడ కుల సంఘాలు నిర్వహించుకోవడానికి రావు బహదూర్ వెంకటరామారెడ్డితో మాట్లాడి అనుమతులిప్పించాడు.

పత్రికా రచనల్లో స్త్రీలు వెనుకబడి ఉండడాన్ని గుర్తించి 'చిత్రగుప్తుడు' అనే మారు పేరుతో వారిని రెచ్చగొట్టి స్పందించే విధంగా వ్యాసాలు రాసేవాడు సురవరం. ఈ వ్యాసాలకు స్పందనగా యల్లాప్రగడ సీతాకుమారి లాంటి మహిళోద్యమ నాయకులు స్పందించి జవాబిచ్చేవారు. ఇలా మహిళలు రచయితలుగా ఎదగడానికి కూడా ప్రతాపరెడ్డి తోడ్పడ్డాడు. తాను స్వయంగా 'జానపద గేయాలు' సేకరించి ప్రచురించడమే గాకుండా, బిరుదురాజు రామరాజు లాంటి వారు 'జానపద గేయవాఙ్మయం'పై పరిశోధన చేయడానికి స్ఫూర్తినిచ్చాడు. సామల సదాశివ లాంటి వారికి కవిత్వం రాయడంలో మార్గదర్శకంగా నిలిచిండు. అంటే ఒక తరానికి తరాన్ని తన రచన, ఆచరణ ద్వారా కదిలించారు.

గోలకొండ పత్రిక తరపున ప్రతి సంవత్సరం మే 10వ తేదీన వార్షిక సంచికలు వెలువరించేవారు. ఇలా 1933 నాటి వార్షిక సంచికలో ముడుంబై రాఘవాచార్యులు తెలంగాణలో 'కవులు పూజ్యం' అని రాసిండు. దీంతో ప్రతాపరెడ్డి నొచ్చుకొని తెలంగాణలో కవులు పూజ్యం కాదు; ఇక్కడి కవులు పూజ్యనీయులు అని 1934 డిసెంబర్ వరకు 354 మంది కవిత్వాన్ని సేకరించి 'గోలకొండ కవుల సంచిక'ను వెలువరించారు. ఇందులో కవుల కుల గోత్రాలే గాకుండా ప్రాచీన కవి పుంగవులను కూడా పరిచయం చేసిండు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని సాహిత్యంలో మెండుగా ప్రదర్శించిన తొలి సందర్భమిది. 1920 నుంచి 1953 వరకు వివిధ సందర్భాల్లో ప్రతాపరెడ్డి రాసిన వ్యాసాలు, ముందుమాటలు, సంపాదకీయాలు, రచనలు, లేఖలు అన్నీ ముద్రిస్తే పదివేల పేజీలకు తగ్గకుండా ఉంటాయి. ఇందులో కొన్ని రచనలు సురవరం సాహితీ వైజయంతి తరపున మూడు దశాబ్దాల క్రితం ప్రచురించారు. ఇప్పుడు ఆయన రచనలన్నీ అందుబాటులోకి తేవాల్సిన అవసరమున్నది. ఇవి వివిధ సందర్భాల్లో ఆయనప్పుడు ఎట్లా స్పందించేవారో ఇప్పటి తరానికి దారిదీపమైతాయి.


తెలంగాణ కేంద్రంగా రాసిన అనేక చారిత్రక వ్యాసాలు ఇంకా పత్రికల సంపుటాల్లోనే ఉన్నాయి. కర్నూలు రాజుల వంశావళి, ఆత్మకథ లాంటి రచనలు ఇంకా వెలుగులోకి రాలేదు. మద్యపాన నిరోధం, సంఘోద్ధరణము, జాగీరులు, తదితర బుక్‌లెట్స్ ఇప్పటి సందర్భానికి అవసరమైన గ్రంథాలు. 1938లోనే హక్కుల భావన ఏ మాత్రం లేని సమయంలో 'ప్రజాధికారములు' అని ప్రాథమిక హక్కులపై పుస్తకం ప్రచురించి తెలుగు ప్రజలను చైతన్యపరిచిండు.

రెడ్డి హాస్టల్, ఆంధ్రమహాసభ, ఆంధ్రసారస్వత పరిషత్తు, విజ్ఞానవర్ధినీ పరిషత్తు, గోలకొండ గ్రంథమాల, ఆంధ్ర విద్యాలయ, వేమన ఆంధ్ర భాషానిలయం, శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, అరుంధతీయ సంఘం, గ్రంథాలయ సభల నిర్వహణ ఇలా అనేక సంస్థల ఏర్పాటు నిర్వహణలో తలమునకలుగా ఉండేవాడు. స్వీయ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసి, పని ధ్యాసగా ఉండేవాడు. అముద్రితంగా, అపరిష్కృతంగా ఉన్న తాళపత్ర గ్రంథాలు సేకరించి, వాటిని పరిష్కరించి ప్రచురించేవాడు. తాను సేకరించిన కొన్ని తాళపత్రాలు ఆంధ్ర విశ్వవిద్యాలయ లైబ్రరీకి దానం చేసినట్లు తన గురువు వేదం వెంకటరాయశాస్త్రికి రాసిన లేఖల్లో చెప్పుకున్నాడు.

ఇంతటి ప్రతిభావంతుడి పేరు ఇప్పుడు అనేక పోరాటాల అనంతరం తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టిండ్రు. సంతోషం. ప్రతాపరెడ్డి కృషి భావితరాల వారికి అందాలంటే ఆయన రచనలన్నీ సంపుటాలుగా రావాల్సిన అవసరమున్నది. దానికి తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం నిధులు కేటాయించి పని అప్పజెబితే బాగుంటుంది. అది సాధ్యం కాని దశలో తెలంగాణ సారస్వత పరిషత్ సంస్థ దాతల సహకారంతో నిధులు సేకరించి, ఈ సంపుటాల ముద్రణకు ప్రయత్నించాలి. ఇందుకు ఒక విషయ నిపుణుల సలహా మండలిని ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది. అంతేగాక తెలుగు భాషపై విశేష కృషి చేసినందుకు, ఆంధ్రా ప్రాంతంతో ప్రతాపరెడ్డికి గ్రంథాలయోద్యమంతో సన్నిహిత సంబంధాలున్నందున ఆ ప్రాంతంలో కూడా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి. వారి పాఠ్యపుస్తకాల్లోనూ ప్రతాపరెడ్డి ప్రతిభ రికార్డు కావాలి. తెలంగాణ ప్రభుత్వం పూనుకొని దాశరథి, కాళోజీల మాదిరిగా ప్రతాపరెడ్డి పేరిట కూడా యేటా ఒక అవార్డుని సాహితీవేత్తలకు ఇవ్వాలి. అట్లాగే ప్రతాపరెడ్డిపై ప్రామాణికమైన ఆంగ్ల గ్రంథం వెలువడాలి. తద్వారా ఆయన ఘనత ప్రపంచ వ్యాప్తంగా తెలిసి రావడానికి వీలవుతుంది.

• డా. సంగిశెట్టి శ్రీనివాస్
(సురవరం ప్రతాపరెడ్డి జయంతి రేపు)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com






సరస్వతి మాత విగ్రహం వద్ద పుష్కర అతిథులు


హారతినిస్తున్న కాశీ పండితులు

- దాదాపు 16 లక్షల మంది భక్తులు వచ్చినట్టు అంచనా
- 12 రోజుల పాటు కనుల పండువగా సాగిన వేడుక
- చివరి రోజు 2.25 లక్షల మంది రాక
- సీఎంతో సహా స్వామివార్లను దర్శించుకున్న మంత్రులు, ప్రముఖులు
- 17 శాఖల నుంచి 6వేల మంది అధికారులు, సిబ్బంది సేవలు
- ఐదు వేల ట్రిప్పులతో రెండున్నర లక్షల మందిని చేరవేసిన ఆర్టీసీ


దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు

పుష్కరోత్సవం పరిసమాప్తం

వైభవంగా ముగిసిన సరస్వతి పుష్కరాలు

7

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద 12 రోజులపాటు భక్తి ప్రపత్తులతో సాగిన సరస్వతి పుష్కరాలు సోమవారం ముగిసాయి. తెలంగాణతో పాటు మరో ఐదు రాష్ట్రాల నుంచి దాదాపు 16 లక్షల మంది తరలివచ్చి పుష్కరాల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభమైన ఈ పుష్కరాల్లో గవర్నర్‌తో పాటు, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పీఠాధిపతులు పాలుపంచుకున్నారు. చివరి రోజున సీఎస్ రామకృష్ణరావు దంపతులు, స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్ దంపతులు పుష్కర స్నానం ఆచరించారు. మొత్తం వేడుకల్లో 12 రోజుల పాటు సరస్వతిమాతకు నిర్వహించిన నవరత్న మాల హారతి కార్యక్రమం హైలైట్‌గా నిలిచింది. అంచనాలకు మించి భక్తులు తరలిరావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడం మినహా మొత్తం పుష్కరోత్సవం విజయవంతంగా ముగిసింది.

- ఆంధ్రజ్యోతి, కాళేశ్వరం

వైభవంగా నవరత్న మాల హారతి

- తిలకించిన మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణా రావు, వికాస్‌రాజ్, ఎమ్మెల్యేలు

7

గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే ప్రణాళిక

7

- సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాం
- పొరపాట్లు ఉంటే భక్తులు క్షమించాలి
- పుష్కరాల ముగింపు కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు




గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పనులు త్వరగా పూర్తి చేయాలి...

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పురోగతి పరిశీలన
- రోడ్లు భవనాల కార్యదర్శి వికాస్ రాజ్, కలెక్టర్లతో సమీక్ష


క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న రామకృష్ణారావు

వరంగల్ మెడికల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు నిర్మిస్తున్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అన్నారు. సోమవారం ప్రభుత్వ కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్‌తో కలిసి కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆస్పత్రి ప్రాంగణంలోని సమావేశ హాలులో నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ ప్రజల వైద్య అవసరాల కోసం నిర్మిస్తున్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అన్నారు. దేశంలోనే అత్యధిక నిధులతో మెరుగైన వైద్య సేవలు, ఆధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి పనులను నిర్దేశిత గడువు నాటికి పూర్తి చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. ఆస్పత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఐకానిక్ ఆస్పత్రి అని పేర్కొన్నారు.

అంతకుముందు వరంగల్ నిట్ అతిథి గృహానికి చేరుకున్న సీఎస్‌కు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పూలమొక్క అందించి స్వాగతం పలికారు. ఈ సమీక్షలో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ నరేంద్ర కుమార్, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డి, ఎస్ఈ నాగేంద్ర, ఎల్‌అండ్‌టీ ఏరియా మేనేజర్ వెంకట్‌రెడ్డి, కేఎంసీ ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ కిశోర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించిన బృందం

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాజ్ రాజ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆస్పత్రి భవన నిర్మాణానికి సంబంధించి ఇప్పటి వరకు పూర్తయిన పనుల గురించి అధికారులు సీఎస్‌కు వివరించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి మ్యాప్‌లను పరిశీలించారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులను అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు వివరించారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- బల్దియా అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా
- ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువ
- 86 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు

6


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్, అధికారులు

రాకేష్ మృతదేహాన్ని ఇవ్వడానికి నిరాకరణ

ప్రభుత్వమే అంత్యక్రియలు నిర్వహించడంతో వెనుదిరిగిన కుటుంబ సభ్యులు

6



ఎంజీఎం సిబ్బందిపై కొరడా

- పాటించని సమయ పాలన
- 77 మంది వైద్యులు, సిబ్బందికి మెమోలు
- జారీ చేసిన సూపరింటెండెంట్ కిశోర్

6

ప్రభుత్వ ఉద్యోగాల పేరిట మోసం

- కలెక్టర్ సంతకం ఫోర్జరీ
- 40 మంది వద్ద రూ. 16.14 లక్షల వసూలు
- అరెస్టు చేసిన సుబేదారి పోలీసులు

6

కార్పొరేట్ శక్తుల చేతుల్లో దేశసంపద

- తలసరి ఆదాయం రెట్టింపైతే ఆకలిచావులు, రైతు ఆత్మహత్యలెందుకు?
- యుద్ధోన్మాదులు, మతోన్మాదులతోనే దేశానికి ప్రమాదకరం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి
- ఘనంగా ప్రారంభమైన సీపీఐ హనుమకొండ జిల్లా మహాసభలు



ర్యాలీలో పాల్గొన్న సీపీఐ జాతీయ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ నాయకుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హసన్‌పర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్లలో దేశంలో తలసరి ఆదాయం రెట్టింపు అయితే ఆకలిచావులు, రైతుల ఆత్మహత్యలను ఎందుకు ఆపలేకపోయారని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. సీపీఐ హనుమకొండ జిల్లా ద్వితీయ మహాసభలు హసన్‌పర్తి మండల కేంద్రంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బహిరంగ సభకు ముందు డాక్టర్ సోమేశ్వర్ ఆసుపత్రి నుంచి జడ్పీ హైస్కూల్ వరకు సీపీఐ భారీ ర్యాలీతో ప్రజా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు.

కేంద్రంలోని బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత తలసరి ఆదాయం రెట్టింపైతే ప్రజల కొనుగోలు శక్తి ఎందుకు పెరగలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎందుకు రాలేదని, రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలుఎందుకు కల్పించబడలేదని ప్రశ్నించారు. మోదీ పాలనలో సంపద అంతా కార్పొరేట్ శక్తులైన అంబానీ, ఆదానీల వద్దే కేంద్రీకృతమైందన్నారు. అందుకు పేదల బతుకులు మారలేదన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇండ్లు లేని నిరుపేదలు పెరిగిపోయారని అన్నారు.

మోదీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తులపైనే ఉండడంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించిన బీజేపీ యుద్ధోన్మాదానికి

మిగతా 8వ పేజీలో...

మా బంగారం మాకు ఇచ్చేయండి!

రాయపర్తి ఎస్‌బీఐ ఎదుట ఖాతాదారుల ఆందోళన

పురుగుల మందు డబ్బాతో ఖాతాదారుడి నిరసన



మందు డబ్బా చూపుతూ నిరసన తెలుపుతున్న ఖాతాదారుడు

రాయపర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి) : మా బంగారం మాకు ఇచ్చేయాలంటూ వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై ఖాతాదారులు ఆందోళన చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఏడు నెలల కిందట రాయపర్తి ఎస్‌బీఐలో దొంగలు లూటీ చేయడంతో 13కిలోలకు పైగా బంగారం దోపిడీకి గురైందని, 497 మంది ఖాతాదారుల బంగారం దొంగిలించడంతో బ్యాంకు అధికారులు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బంగారం ధరను లెక్క గట్టి అప్పటి ధరతో మాకు లిఖిత పూర్వకంగా పేపర్లు అందించారని, కానీ ఇప్పటి వరకు ఆ డబ్బులు చెల్లించడం లేదని ఆరోపించారు. బంగారం ధర రోజు రోజుకు పెరిగిపోతోందని, తమ ఇంట్లో శుభకార్యాల కోసం దాచుకున్న బంగారాన్ని ఇవ్వకపోవడంపై నిలదీస్తే పోలీసులతో బయటకు పంపిస్తున్నారని ఆరోపించారు. దీంతో వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై అందోళన చేపట్టారు. ఓ ఖాతాదారుడు పురుగుల మందు డబ్బా చూపుతూ తనకు న్యాయం చేయాలంటూ నిరసన తెలిపారు. ధర్నాతో ట్రాఫిక్ జాం భారీగా ఏర్పడింది. దీంతో పోలీసులు నచ్చచెప్పి ఆందోళన విరమింపచేసి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

సమయ పాలన పాటించని 77 మంది వైద్యులు, సిబ్బందికి మెమోలు

వరంగల్ మెడికల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎంలో సమయపాలన పాటించని 77 మంది వైద్యులు, సిబ్బందికి మెమోలు జారీ అయ్యాయి. సోమవారం ఉదయం కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ మెమోలు జారీ చేశారు. ఇటీవల వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఎంజీఎంను సందర్శించారు. రోగులు పడుతున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు. వైద్యులు సమయపాలన పాటించడం లేదని గుర్తించారు. అనేక మంది వైద్యులు, సిబ్బంది హైదరాబాద్ నుంచి రాకపోకలు చేస్తున్నారని తెలుసుకున్నారు. 12 గంటల వరకే వైద్యం చేసి వెళ్లిపోతున్నట్లు గుర్తించారు. అప్పటికప్పుడు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మినిస్ట్రీయల్ సిబ్బంది కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు రోగులు వారి దృష్టికి తీసుకొచ్చారు. ఎంజీఎం దుస్థితిపై వెంటనే కలెక్టర్ సత్యశారద దృష్టికి తీసుకెళ్లారు. వైద్యులు, సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ తెప్పించి సమయపాలన పాటించని వారందరికీ మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. దీంతో తొలివిడతగా 77 మంది వైద్యులు, సిబ్బందికి మెమోలు జారీ చేశారు. ఇప్పటికైనా అప్ అండ్ డౌన్ చేసే వైద్యులు తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒకేసారి ఎంజీఎంలో ఇంత మందికి మెమోలు జారీ కావడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. విధులకు ఎగనామం పెట్టి ప్రైవేట్ ప్రాక్టీస్ చేసే వైద్యులకు షాక్ తగిలినట్లు అయింది. వైద్యులు, సిబ్బందిపై నిఘా కొనసాగుతుందని కలెక్టర్ చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.

కార్మిక చట్టాల సవరణతో శ్రమ దోపిడీ

సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్



కేసముద్రంలో మాట్లాడుతున్న సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్

కేసముద్రం, మే 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో కార్మిక చట్టాలను సవరించడంతో కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఏఐటీయూసీ అనుబంధ సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ ఆరోపించారు. కేసముద్రంలోని లక్ష్మీసాయి గార్డెన్స్‌లో సోమవారం ఆ సంఘం జిల్లా మహాసభ వడ్డెబోయిన లక్ష్మీనర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. తొలుత మునిసిపాలిటీ కేంద్రంలో బైక్‌ర్యాలీ, పాదయాత్ర చేశారు. అనంతరం మహాసభలో మునీశ్వర్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం ఆదేశాలున్నప్పటికీ కేంద్రం అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు ప్రజా పంపిణీ వ్యవస్థలో పనిచేస్తున్న సివిల్ సప్లయీస్ కార్మికులను పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి, రేషపనల్లి నవీన్, మంద భాస్కర్, చొప్పరి శేఖర్, కాసు సాయిచరణ్, పెరుగు కుమార్, వీరవెల్లి రవి, వంకాయలపాటి జకరయ్య, రాజబోయిన శ్రీను, బానోత్ రాజు, నారాయణ పాల్గొన్నారు.

రోడ్డెక్కిన అన్నదాతలు..



రోడ్డు పై ధర్నా చేస్తున్న రైతులు

కాంటాలు సక్రమంగా నిర్వహించడం లేదని ఆగ్రహం

తాడిచర్ల, కొయ్యూర్ రహదారిపై వంటావార్పు కార్యక్రమం

ఏడు గంటల పాటు సాగిన ఆందోళన

చైర్మన్ హామీతో ఆందోళన విరమించిన రైతులు

మల్హర్, మే 26(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం కాంటాలు సక్రమంగా నిర్వహించడం లేదని భూపాలపల్లి జిల్లా మల్హర్ మండల కేంద్రంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన రైతులు సోమవారం తాడిచర్ల, కొయ్యూర్ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ అధ్వాన్నంగా తయారైన అధికారులు పట్టించుకోక పోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆరోపించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో తాడిచర్లలో పెద్ద తూండ్లకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం పోసి రోజులు గడుస్తున్న కొనుగోళ్లు చేపట్టడం లేదని సుమారు వంద మంది రైతులు ఆందోళనకు దిగారు. కొయ్యూర్, తాడిచర్ల ప్రధాన రహదారిపై టెంట్ వేసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. గంటలు గడుస్తున్న ఏవరు స్పందించక పోవడంతో రోడ్డు పై వంట, వార్పు కార్యక్రమంతో నిరసనను ఉధృతం చేశారు. ఈ కొనుగోలు కేంద్రం ప్రారంభం నుంచి వివాదాలకు కేంద్రంగా మారిందని, డబ్బులు ఇచ్చిన వారికే కాంటాలను ఇష్టారీతిగా నిర్వహించినట్లు రైతులు ఆరోపించారు. పీఏసీఎస్ నిర్లక్ష్యం వల్ల వర్షాలకు వరి ధాన్యం తడిసిందని ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో డబ్బులు ఎందుకు ఇవ్వాలని వారు ప్రశ్నించారు. ఈ కొనుగోలు కేంద్రంలో సీరియల్ ప్రకారం కాంటాలు నిర్వహించకుండా సెంటర్ నిర్వాహకుడు ఇష్టారీతిగా వ్యవహరించినట్లు రైతులు తెలిపారు. కాంటాలు కాక పోవడంతో కొంత మంది ధాన్యాన్ని బయటకు తరలించి విక్రయించినట్లు పేర్కొన్నారు. ఈ కొనుగోలు కేంద్రంలో తరుగు పేరిట అదనంగా కోతలు విధిస్తున్నారని ఇందులో అందరి భాగస్వామ్యం ఉందని రైతులు ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తరుగు, ఇష్టారీతిగా కాంటాల నిర్వాహణ ఈ కేంద్రంలో మాత్రమే సాగుతుందన్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహణ కష్టంగా మారితే అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించి వైదొలిగితే తాము ఇతరులకు విక్రయించుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, సీఈవో సంతోష్ అక్కడికి చేరుకోవడంతో వారితో కాసేపు మాటల యుద్ధానికి దిగారు. ఆరుగాళం కష్టపడి పంట పండించిన రైతలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు.

కొనుగోలు కేంద్రంలో ని చివరి వరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని చైర్మెన్ మొండయ్య చెప్పడంతో రైతులు శాంతించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ ఆందోళన మధ్యాహ్నం మూడు గంటల వరకు కొనసాగింది. అలాగే మండలంలోని కొయ్యూర్‌లో కూడ మొలకెత్తిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మంథని, భూపాలపల్లి ప్రధాన రహదారిపై కూర్చోని నిరసనకు దిగారు. దీంతో మూడు కిలోమీటర్ల మేర బొగ్గు లారీలు నిలిచిపోయాయి.

లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ ప్రారంభం

కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులోని మోడల్ స్కూల్‌లో 50 రోజుల పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్లకు నిర్వహించే శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సందర్శించి శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టం-2025ను పక్కాగా అమలు చేసేందుకు జిల్లాలో ఎంపికైన 390 మందిలో తొలి విడతగా 203 మందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వీరికి జూలై 26 వరకు 50 రోజుల పాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెక్షన్లుగా థియరీ, క్షేత్రస్థాయి సర్వేలు నిర్వహించి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం శిక్షణకు హాజరైన సర్వేయర్లకు సర్వే మెటీరియల్‌ను అందించారు. జిల్లా అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మచారి, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ నర్సింహమూర్తి పాల్గొన్నారు.



లైసెన్స్‌డ్ సర్వేయర్‌లకు మెటీరియల్‌ను అందిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

రాకేష్ మృతదేహాన్ని ఇవ్వడానికి నిరాకరణ

ఐదు రోజుల పాటు నిరీక్షణకు తెర

మృతదేహాలను అప్పగించాలని మృతుల కుటుంబ సభ్యులు, బంధవులు

అక్కడి పోలీసులే అంత్యక్రియలు నిర్వహించడంతో వెను దిరిగిన కుటుంబ సభ్యులు



నారాయణపూర్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఎదురు చూస్తున్న రాకేష్ కుటుంబ సభ్యులు

హసన్‌పర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి) : చత్తీస్‌గఢ్ మడ్ ఆటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టుకు చెందిన మావోయిస్టు అగ్ర నేత కేశవరావు అలియాస్ బసవరాజ్ కంప్యూటర్ ఆపరేటర్ బూర రాకేష్ అలియాస్ వివేక్ (32) మృతదేహాన్ని ఇవ్వడానికి చత్తీస్‌గఢ్ పోలీసులు నిరాకరించారు. రాకేష్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని చీరాల, శ్రీకాకుళం, వరంగల్ ప్రాంతాలకు చెందిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారి మృతదేహాలను ఇవ్వడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిరాకరించింది. దీంతో మృతుల కుటుంబ సభ్యులు ఆ రాష్ట్రంలో నారాయణపూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి నుంచి పోలీసు స్టేషన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన తమ బిడ్డల మృతదేహాలను అప్పగించాలని నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు నారాయణపూర్‌లో తిండి తిప్పలు మానేసి ఐదు రోజుల నుంచి ఎదురు చూస్తున్నా ఇప్పటి వరకు తమ బిడ్డల మృతదేహాలను ఇవ్వకపోవడంతో మృతుల కుటుంబ సభ్యులు, బంధవులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. చత్తీస్‌గఢ్ ప్రభుత్వం కాలయాపనతో మృతుల కుటుంబ సభ్యులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇవ్వాలా... రేపా... అంటూ గురువారం నుంచి ఐదు రోజుల పాటు ఎదురు చూస్తున్న మృతుల కుటుంబ సభ్యులకు చుక్కెదురైంది. మృతుల దేహాలను అప్పగించలేమని సోమవారం ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెగేసి చెప్పడంతో మృతుల కుటుంబ సభ్యులు అక్కడి ప్రభుత్వ తీరుకు నిరాశతో తమ తమ ఇండ్లకు తిరుగు పయణమయ్యారు. ఈ క్రమంలో అక్కడి పోలీసులు తామే దహన సంస్కారాలు నిర్వహిస్తామని చెప్పారు. దీంతో అక్కడ దహన సంస్కారాలు చేసే ప్రదేశానికి వెళ్లి కార్యక్రమాన్ని చూసి వెనుదిరిగారు. మానవ హక్కుల సంఘం లాయర్ భాటియాతో పాటు హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టుకు చెందిన మావోయిస్టు బూర రాకేష్ (32) తండ్రి బూర బాబు, మృతుడి కుటుంబ సభ్యులు ధార సారయ్య, బాతుల అనిల్, బాతుల కిరణ్, దాసరి రమేష్, పప్పుల మొగిళి అంత్యక్రియ అనంతరం అక్కడి నుంచి సోమవారం సాయంత్రం హనుమకొండకు తిరుగు పయణమయ్యారు.

ఆత్మహత్యలు చేసుకుంటాం

మృతుడు రాకేష్ తల్లి స్వరూప

అంతకు ముందు అక్కడి మీడియాతో మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్‌లో మృతి చెందిన తమ కొడుకు బూర రాకేష్ మృతదేహాన్ని అప్పగించకుంటే కుటుంబ సభ్యులతో కలిసి తాము ఆత్మహత్య చేసుకుంటామని మృతుడి తల్లి స్వరూప కన్నీటి పర్యంతమయ్యారు. ఐదు రోజులుగా కళ్లల్లో ఒత్తులు వేసుకొని కొడుకు మృతదేహం కోసం ఎదురు చూస్తున్నామని గుండెలవిసేలా విలపించిన తీరు స్థానికులను కలిచివేసింది. చెట్టంత ఎదిగి చేతికి అందిన కొడుకు మృతి చెందాడని ఆవేదనను వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లో ఉద్యోగం కోసం వెళ్తున్నట్లు చెప్పిన తన కొడుకును పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారని గుండెలవిసేలా విలపించింది. కనీసం తన కొడుకు మృతదేహాన్ని ఇచ్చినా కడసారి చూసుకొని దహన సంస్కారాలు చేసుకుంటామని ప్రభుత్వాన్ని వేడుకున్న తీరు గ్రామస్థులను శోకానికి గురిచేసింది. ఇప్పటికైనా తన బిడ్డ మృతదేహాన్ని అప్పగించి దహన సంస్కారాలకు సహకరించాలని బోరున విలపించిన తీరు అక్కడి వారిని ఆవేదనకు గురిచేసింది.

మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించాలి

వరంగల్ క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి) : చత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్‌లో ఈ నెల 21 న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన తెలుగు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు సజ్జ వెంకట నాగేశ్వర్‌రావు (రాజన్న), వన్నాడ విజయలక్ష్మీ (భూమిక), గోనెగండ్ల లలిత (సంగీత) బుర్ర రాకేశ్ (వివేక్)ల మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు తక్షణమే అప్పగించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆత్రం భుజంగరావు, డాక్టర్ ఎస్. తిరుపతయ్య చత్తీస్‌గఢ ప్రభుత్వాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతుల కుటంబసభ్యులు చత్తీస్‌గఢ్‌కు వెళ్లి నారాయణపూర్ పోలీస్‌స్టేషన్, ఆస్పత్రి చుట్టూ ఆరు రోజులుగా తిరుగుతూ అవసరమైన పత్రాలను సమర్పించినప్పటికీ వరకు మృతదేహాలను అప్పగించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారన్నారు.

మృతదేహాలను కోల్డ్‌స్టోరేజ్‌లో కాకుండా ఓపెన్‌గా పడేశారని ఆరోపించారు. మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించుకునే బాధ్యత కుటుంబసభ్యులకు ఉందన్నారు. మృతదే హాలను గౌరవప్రదంగా ఉం డే హక్కు ఉంటుం దని సుప్రీం కోర్టు అనేక సా ర్లు చెప్పినట్లు గుర్తు చేశారు. కానీ చత్తీస్‌గఢ్ ప్రభుత్వం, పోలీసులు ఇవేమి పట్టించుకోకుండా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాస్తూ ఉద్దేశపూర్వకంగానే మృతదేహాలను అప్పగించడంలో ఆలస్యం చేస్తున్నారన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాల పేరిట మోసం

40 మంది వద్ద రూ. 16.14 లక్షల వసూలు

కలెక్టర్ సంతకం ఫోర్జరీ - అరెస్టు చేసిన పోలీసులు



నిందితున్ని అరెస్టు చూపుతున్న ఏసీపీ నర్సింహరావు, సీఐ పి. సత్యనారాయణరెడ్డి

హనుమకొండ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసులు చేసి మోసం చేసిన వ్యక్తిని సుబేదారి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. హనుమకొండ ఏసీపీ నర్సింహరావు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని రామన్న పేటకు చెందిన మంద కళ్యాణ్ 2019 నుంచి 2024 వరకు గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీ పబ్లిక్ హెల్త్ జవాన్ ఉద్యోగం చేసినట్లు తెలిపారు. 2024 ఫిబ్రవరిలో వేతనం డబ్బులు చాలడం లేదని ఉద్యోగం మానేసినట్లు ఏసీపీ తెలిపారు. జులాయిగా తిరగడం వలన ఎటువంటి ఆదాయం రాకపోవడంతో స్నేహితులు, బంధువులకు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి 40 మంది నిరుద్యోగుల వద్ద రూ.16..14 లక్షలు వసూలు చేశాడు. కూరపాటి భవ్య కిరణ్, మంద వంశీ సహకారంతో వరంగల్ కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగాలకు సంబంధించి నకిలీ నియామక పత్రాలను తయారు చేసి పత్రాలపై వరంగల్ జిల్లా కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసి బాధితులకు ఇచ్చినట్లు తెలిపారు. నకిలీ నియామక పత్రాలు ఇచ్చినట్లు గుర్తించిన బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ అనంతరం మంద కళ్యాణ్‌ను సోమవారం అదాలాత్ జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 39 సర్వీస్ బుక్కు, 23 నకిలీ అపాయింట్ మెంట్ లెటర్స్, కలర్‌టీవీ, 1. సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. కూరపాటి భవ్య కిరణ్, మంద వంశీ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబేదారీ సీఐ పి. సత్యనారాయణరెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

బల్దియా అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ వారం బల్దియా ప్రజావాణి ద్వారా ప్రజలు నుంచి వస్తున్న ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని బల్దియా అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బల్దియా అదనపు కమిషనర్ జోనా హాజరై ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జోనా మాట్లాడారు. నగర ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలపై అధికారులు చొరవ చూపాలని అన్నారు. తాగు నీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజావాణిలో పాల్గొన్న వివిధ విభాగాల అధికారులకు పలు సూచనలు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 86 ఫిర్యాదులు స్వీకరించినట్లు అదనపు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వోలు రమేష్, లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, పన్నుల అధికారి వై. రామకృష్ణ, సెక్రటరీ అలివేలుతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ - 25, హెల్త్, శానిటేషన్ - 9, ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ - 7, టౌన్‌ప్లానింగ్ - 38, తాగునీటి సరఫరా - 6, డీఆర్ఎఫ్ - 1 ఇలా మొత్తం 86 ఫిర్యాదులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇలా..

- వరంగల్ కాశిబుగ్గ సమీపంలోని మధురానగర్‌లో ఇటీవల ఒక బార్ షాపు ఇళ్ల మధ్యలో వెలిసింది. షాపునకు సంబంధించిన చిమ్ని తమ ఇంటి వైపు ఉండడం వల్ల వంటు చేస్తున్న సమయంలో పొగ మొత్తం తమ ఇంట్లోకి వస్తుందని చిగురుమామిడి రాజమౌళి అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- వరంగల్ డాక్టర్స్ కాలనీ సమీపంలోని గౌతమినగర్‌లో ఇటీవల సీసీ రోడ్డు, డ్రైనేజీ కోసం బల్దియా నుంచి నిధులు కేటాయించారు. సీసీ రోడ్డు నిర్మించారు కానీ డ్రైనేజీ నిర్మించకపోవడం వల్ల ఇండ్లలో నుంచి వచ్చిన మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ 2వ డివిజన్ గుండ్లసింగారంలోని శ్రీలక్ష్మీనగర్ కాలనీలో చాలా కాలంగా సీసీ రోడ్డు, డ్రైనేజీ లేక ఇబ్బందులు పడతున్నామని, వర్షం పడితే బయటకు వెళ్లే పరిస్థితి ఉండదని కాలనీ వాసులు వెల్లడించారు.
- హనుమకొండ భీమారంలోని తన ఇంటి ముందు ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి కట్టడాలు చేస్తున్నాడు. 30 ఫీట్ల రోడ్డును ఆక్రమించి కట్టడాలు చేయడం వల్ల రోడ్డు కుచించుకు పోయిందని నాగరాజు అనే వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేశాడు.

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను పరామర్శించిన కేటీఆర్



సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యవతిరాథోడ్‌ను పరామర్శిస్తున్న కేటీఆర్

మహబూబాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో మోకాలి శస్త్ర చికిత్స చేయించుకున్న రాష్ట్ర మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా క్షేత్రంలో అడుగుపెట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. తొలుత మానుకోట మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ యశోద ఆస్పత్రికి చేరుకుని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను పరామర్శించారు.

రాష్ట్ర అవతరణ వేడుకలకు ఏర్పాట్లు చేయండి : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. జూన్ 2న నిర్వహించే వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. వేడుకల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అత్యంత వైభవంగా జరిపించాలని, ఇందుకు ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించా రు. సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్ ఏర్పాటు, ఇందిరమ్మ ఇళ్లు, ట్రాన్స్‌పోర్ట్, ఆర్‌అండ్‌బీ, ఫారెస్ట్ తదితర శాఖల శకటాలు తయారు చేయాలన్నారు. ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని, వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎఫ్‌వో అనుజ్ అగర్వాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా నవరత్నమాల హారతి

తిలకించిన మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు, వికాస్‌రాజ్, ఎమ్మెల్యేలు

కాళేశ్వరం, మే 26(ఆంధ్రజ్యోతి):కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతీపుష్కరాలను పురస్కరించుకుని చివరి రోజైన సోమవారం రాత్రి 7 గంటల నుంచి 7.45గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్నమాల హారతిని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సంగీత నేపథ్యంతో పలు అష్టకాలతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హారతులతో కూడిన నవరత్న హారతిని ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి వికాసరాజ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, మదన్‌మోహన్, దేవాదా యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ హాజరయ్యారు. వందలాది మంది భక్తుల సమక్షంలో కన్నుల పండువగా త్రివేణి సంగమం అంతర్వాహిని సరస్వతి మాతకు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పుష్కరాలు విజయవంతం కావడం, 12 రోజుల పాటు ప్రజలందరికీ శ్రేయస్సును, శుభాన్ని కలిగించాలని నదీమాతకు నవరత్నమాలహారతి సమర్పించడం ఆనందదాయకమన్నారు. పుష్కరాలను దిగ్విజయంగా నిర్వహించినందుకు హర్షం వ్యక్తం చేశారు. కాగా పుష్కరాలు విజయవంతంగా ముగించడానికి ఉద్దేశించిన డ్రోన్ షో, బాణాసంచా కాల్చివేత కార్యక్రమాలు వర్షంతో రద్దయ్యాయి. జమున బృందం చేసిన కూచిపూడి నృత్యం చూపరులను ఆకట్టుకుంది. ఈ నవరత్నమాల హారతి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, దేవాదాయశాఖ కమిషనర్ వెంకట్రావు, ఎస్పీ కిరణఖరే పలు శాఖల అధికారులు, కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయ అధికారులు వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.


సరస్వతిమాత విగ్రహం వద్ద పుష్కర అతిథులు


హారతినిస్తున్న కాశీ పండితులు


హారతిని తిలకిస్తున్న భక్తులు


కూచిపూడి నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు


పుణ్యస్నానం ఆచరిస్తున్న మహిళలు


పుష్కర పనులను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పుష్కర నిర్వహణలో అన్నీ తానై..

- ప్రత్యేకతను చాటుకున్న మంత్రి శ్రీధర్‌బాబు
- 12 రోజుల పాటు నిరంతర పరిశీలన ,పర్యవేక్షణ
- అంచనాలకు మించి వచ్చిన జనంతో ఆనందం

మహాదేవపూర్, మే 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరొందిన కాళేశ్వర క్షేత్రంలో జరిగిన సరస్వతి పుష్కరాల నిర్వహణలో మంత్రి శ్రీధర్ బాబు అన్నీ తానై ముందుండి నడిపించారు. ఈ నెల 15న ప్రారంభమై సోమవారంతో ముగిసిన సరస్వతి పుష్కరాల నిర్వహణ కోసం గడిచిన మూడు నెలల పాటు ప్రత్యేకంగా దృష్టి సారించి నిధులు మంజూరు చేయించడం మొదలుకొని పుష్కర పనుల నిర్మాణాల వరకు నిరంతరం పర్యటించి పర్యవేక్షించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత త్రివేణి సంగమంలో పుష్కరాలను ఘనంగా నిర్వహించాలన్న ప్రతిపాదన రాగానే దానిని సరస్వతి పుష్కరాలతోనే ఆరంభించాలని ప్రత్యేకంగా అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో పుష్కరాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి మొదటి విడతలో రూ.25కోట్లు, రెండో విడతలో మరో రూ.10 కోట్లు గ్రీన్ చానల్ ద్వారా మంజూరు చేయించడమే కాకుండా వేగంగా పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. అయితే అనుకోని విధంగా వరుస ఎలక్షన్ కోడ్‌లు అడ్డురావడంతో పనుల ప్రారంభం ఆలస్యమైంది. పుష్కరాలకు పది రోజుల ముందు మాత్రమే సమయం దొరకడంతో అనుకున్న విధంగా పుష్కరాల నిర్వహణ జరుగుతుందా లేదా అనే ప్రశ్నలు ఉదయించాయి. పనులను యుద్ధ ప్రాతిపదికపై పూర్తి చేయాలని ఆదేశించడంతో అధికార యంత్రాంగం అంతా కాళేశ్వరంలోనే తిష్ట వేసి సిమెంట్ రోడ్‌లు, తాత్కాలిక మరుగుదొడ్లు, మూత్రశాలలు, కేశ ఖండన శాల, పుష్కర ఘాట్‌లను చేపట్టింది. ఇందులో సమయాభావం వల్ల పుష్కరాల ప్రారంభం నాటికి పూర్తి కాకపోవడంతో తాత్కాలిక పనులు చేపట్టి భక్తులకు అసౌకర్యం కలగకుండా మౌళిక సదుపాయాలు కల్పించడంలో మంత్రి సఫలీకృతులయ్యారు. ముఖ్యంగా సరస్వతి మాత విగ్రహం, ఆర్చి నిర్మాణం, మెట్ల నిర్మాణం పూర్తి చేశారు. అలాగే భక్తులు రాకపోకలకు వీలుగా యుద్ధ ప్రాతిపదికన భూమిని సేకరించి తాత్కాలిక పక్కా రోడ్డును రాత్రికి రాత్రే నిర్మించారు. పుష్కరాలు ప్రారంభించే సమయానికి పనులు సమగ్రంగా పూర్తి కాకపోయినా పరవాలేదనిపించారు. ఆరంభంలో భక్తుల సంఖ్య ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకే కొనసాగడంతో మిగతా పనుల చకచకా పూర్తయ్యేలా మంత్రి శ్రీధర్, ఆయన సతీమణి దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ఉండి పరిశీలించారు. జిల్లా అధికారులు కూడా కాళేశ్వరంలోనే ఉండి పుష్కరాల నిర్వహణ సజావుగా సాగింది. అంచనాలకు మించి భక్తులు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయితే మహాదేవపూర్ నుంచి కాళేశ్వరం దాకా సింగిల్ రోడ్డు ఉండడమే ఈ సమస్యకు కారణమని గుర్తించి ఈ రోడ్డు విస్తరణ కోసం సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తయ్యేలా చూడాలని, వచ్చే గోదావరి పుష్కరాలకు అందుబాటులో ఉంచాలని కోరడం విశేషం. ఈ నేపథ్యంలోనే పుష్కరాల ప్రారంభానికి వచ్చిన ముఖ్యమంత్రి కాళేశ్వర ఆలయం, పుష్కర ఘాట్‌లు, క్షేత్రాభివృద్ధి కోసం రూ. 200 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. ముఖ్యమంత్రి ప్రకటనకు ముందు మంత్రి శ్రీధర్‌బాబు నిధుల కోసం లాబీయింగ్ చేసినట్లు స్వయంగా ముఖ్యమంత్రే చెప్పడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రభుత్వం గ్రీన్‌చానల్ ద్వారా విడుదల చేస్తానని ప్రకటించిన రూ.200 కోట్ల నిధులతో 2027లో జరిగే గోదావరి పుష్కరాల నాటికి పనులను శాశ్వత ప్రాతిపదికపై పూర్తి చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే మాస్టర్ ప్లాన్ తయారీని అధికారులు ప్రారంభించారు.

గోదావరి పుష్కరాలకు ఇప్పటినుంచే ప్రణాళిక

- సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాం
- పొరపాట్లు ఉంటే భక్తులు క్షమించాలి
- పుష్కరాల ముగింపు కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం, మే 26 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాల అనుభవంతో 2027లో గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ముందు నుంచే ప్రణాళికబద్దంగా కృషి చేస్తామని రాష్ట్ర ఐటీపరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సరస్వతి పుష్కరాల ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారంకాళేశ్వరంలోని సరస్వతి ఘాట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 12 రోజుల పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సరస్వతి పుష్కరాలను ఘనంగా నిర్వహించామన్నారు. దేవాదాయ శాఖ మంత్రి, సంబంధిత అధికారులు పుష్కరాలను విజయవంతం చేయడంలో శ్రమించారని తెలిపారు. పుష్కరాల సందర్భంగా చిన్న చిన్న తప్పులు జరిగి ఉంటే భక్తులు పెద్ద మనస్సుతో క్షమించాలని కోరారు. ఈ పుష్కరాల అనుభవంతో రాబోయే గోదావరి పుష్కరాలను తెలంగాణవ్యాప్తంగా వైభవంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రకృతి సహకరించకపోయినా సాధ్యమైనంత మేరకు ఇబ్బందులు కలుగకుండా విజయవంతం చేశామన్నారు. 12 రోజుల్లో తాము ఊహించిన దానికంటే అధికంగా లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారని అన్నారు. రాబోయే రోజుల్లో కాళేశ్వరం ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. పుష్కరోత్సవ పనులు నిర్వహించే ందుకు ఎన్నికల నియామావళితో సమస్యలు ఉత్పన్నం అయ్యాయని, పనులు నెమ్మదిగా ప్రారంభమైనా జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ నేతృత్వంలో భక్తులు ఇబ్బందులు పడకుండా ఒక రూపం తీసుకరావడం కోసం పనిచేశారన్నారు. త్వరలోనే మిగతా పనులన్నీ పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యార్, మాడుగుల నాగఫణిశర్మ తదితరులు కూడా ప్రసంగించారు.

కార్యక్రమంలో అర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, మదన్ మోహన్, ఠాకూర్ మక్కాన్ సింగ్, ట్రేడ్‌కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్‌రెడ్డి, దేవాదాయశాఖ డెరెక్టర్ వెంకట్రావ్, జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరేలు పాల్గొన్నారు. అనంతరం సరస్వతి నవరత్నమాల కార్యక్రమాన్ని నిర్వహించారు.



షాట్ సర్క్యూట్‌కు గురైన ప్రైవేటు బస్సు

షార్ట్ సర్క్యూట్‌తో ప్రైవేట్ బస్సులో మంటలు

తృటిలో తప్పిన ప్రమాదం

మహాదేవపూర్, మే 26(ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాలకు వచ్చిన ఓ ప్రైవేటు బస్సు షార్ట్ సర్క్యూట్‌కు గురైంది. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేయడంతో ప్రమాదం తృటిలో తప్పింది. సిరిసిల్లకు చెందిన 36 మంది భక్తులు ఏపీ 29డబ్ల్యూ 2727నెంబర్ గల వెంకటరమణ ట్రావెల్స్ బస్సులో సరస్వతి పుష్కరాలకు చేరుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో మద్దులపల్లి అటవీ ప్రాంత సమీపంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌కు గురైంది. సమయానికి ఫైర్ ఇంజన్ చేరుకుని మంటలు ఆర్పివేసింది. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



తాత్కాలిక బస్టాండ్‌లో పలు బస్సులు ఎక్కుతున్న ప్రయాణికులు

పుష్కర భక్తులకు ఆర్టీసీ విస్తృత సేవలు

- వివిధ రీజియన్ల నుంచి 400 బస్సులతో సుమారు ఐదువేల ట్రిప్పులతో భక్తుల చేరవేత
- 2.50 లక్షలకు పైగా భక్తులను తరలించిన బస్సులు

కాళేశ్వరం, మే 26(ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్రంలో సరస్వతి పుష్కరాలు 12 రోజుల పాటు వైభవంగా నిర్వహించగా లక్షలాది మంది భక్తులు హాజరై పుణ్యస్నానాలు చేశారు. నిత్యం వేలాదిగా ప్రైవేట్ వాహనాల్లో భక్తులు తరలిరాగా ఆర్టీసీ సైతం విస్తృత సేవలందించింది. వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ తదితర రీజియన్ల పరిధిలోని వివిధ డిపోలకు చెందిన 400బస్సులను పుష్కరాల్లో భక్తుల చేరవేతకు వినియోగించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. సుమారు 5వేల ట్రిప్పులతో 2.50లక్షల మంది భక్తులను చేరవేసినట్లు వెల్లడించారు. కాళేశ్వరంలో తాత్కాలిక బస్టాండ్‌తో పాటు పాత బస్టాండ్ ద్వారా భక్తులకు విస్తృత సేవలందించారు. భూపాలపల్లి, మంథని, పర్కాల, హన్మకొండ, వరంగల్, మంచిర్యాల, చెన్నూరు, తొర్రూరు, జగిత్యాల, నర్సంపేట, జనగామ తదితర డిపో లకు చెందిన బస్సులను ఆర్‌ఎంలు, డిప్యూటీ ఆర్‌ఎంలు, డీఎంలు, ఇతర అధికారులు, సిబ్బంది 12రోజుల పాటు సరస్వతి పుష్కరాల్లో భక్తులకు సేవలందించారు. చిన్నపాటి సంఘటనలు మినహా భక్తులను చేరవేతలో ఆర్టీసీ విజయవంతమైనట్లు చెప్పవచ్చు. కాగా ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పుష్కరాల్లోనూ ఆ ఎఫెక్ట్ కనిపించింది.ప్రతీ బస్సులో 70శాతం మహిళ భక్తులు ప్రయాణం చేసినట్లు అంచనా.


పూర్ణాహుతి ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్

పూర్ణాహుతితో ముగిసిన 12 రోజుల హోమాలు

పాల్గొన్న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజారామయ్యర్

కాళేశ్వరం, మే26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాల సందర్భంగా 12 రోజుల పాటు నిర్వహించిన హోమాలు సోమవారంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా 12 రోజులు శీదత్తాత్రేయ శ్రీకార్త వీర్యార్జున, సంకష్టహరగణపతి, శ్రీహయగ్రీవ, శ్రీస్వయంవరపార్వతి, అరుణశ్రీ శ్రీపుత్రకామేష్టి, మేధాదక్షణామూర్తి మహామృత మృతుంజయ, మన్యసూక్త, కాలభైరవ, సుదర్శన, శీసూక్త, పురుషసూక్త, నవగ్రహ శ్రీమత్స్య శ్రీరుద్ర, చండి హోమాలను వేదపండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజారామయ్యర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యం, సంపద, పాడిపంటలు బాగుండాలని సరస్వతి పుష్కరాల సందర్భంగా 12 రోజులు హోమాలు నిర్వహించారని అన్నారు. అత్యంత వైభవంగా జరిగిన పుష్కరాలను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి హృదయ పూర్వక కృతజ్ఞతలు ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటరావు, ఈవో మహేష్‌లు పాల్గొన్నారు.

పుష్కరోత్సవం పరిసమాప్తం

వైభవంగా ముగిసిన సరస్వతి పుష్కరాలు



కాళేశ్వరం, మే 26 (ఆంధ్రజ్యోతి): భక్తి ప్రపత్తులతో సాగిన సరస్వతి పుష్కరాలు సోమవారంతో పరిపూర్ణమయ్యాయి. రోజుకో కార్యక్రమ నిర్వహణతో కనుల పండువగా రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఈ వేడుకను నిర్వహించింది. తెలంగాణతో పాటు మరో ఐదు రాష్ట్రాలకు చెందిన భక్తజనం పుష్కర స్నానమాచరించి కాళేశ్వరముక్తీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. వేడుకల నిర్వహణకు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే వారివారి అధికార యంత్రాంగాన్ని, సిబ్బందిని నిరంతరాయంగా అప్రమత్తం చేస్తూ ముందుకు సాగారు.

15.90 లక్షల మంది రాక..

సరస్వతి పుష్కరాలకు ఊహించిన స్థాయి కంటే భక్తజనులు పోటెత్తారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిసా రాష్ట్రాల్లోని భక్తులు పవిత్ర గోదావరి నదీ తీరాన పుష్కర స్నానామాచరించి పూజలు చేశారు. 12 రోజుల్లో 15.90 లక్షల మంది వచ్చినట్లుగా అధికారులు అంచనాకు వచ్చారు. ఆఖరి రోజు సోమవారం సైతం 2.25 లక్షల మంది భక్తులు కాళేశ్వర క్షేత్రానికి తరలివచ్చారు. గోదావరిలో పుష్కర స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు.

అధికారుల మకాం..

పుష్కరాలను విజయవంతం చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించింది. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే నేతృత్వంలో జిల్లా స్థాయి అధికారులంతా కాళేశ్వరంలో మకాం వేసి సౌకర్యాలు, వసతుల కల్పనపై దృష్టి పెట్టారు. మొత్తంగా 19 శాఖలకు చెందిన అధికారులు సుమారు 6వేల మంది 12 రోజుల పాటు నిర్వహించిన వేడుకల్లో పాలు పంచుకున్నారు.

వాహనాల జోరు

సరస్వతి పుష్కరాలకు లక్షలాది జనాలు తరలొచ్చారు. వీరి రాకపోకలకు ఆర్టీసీ బస్సులతో పాటు కార్లు, టాటా ఏసీలు, జీపులు, డీసీఎంలు, ఆటోలు, స్కూల్ వ్యాన్లు ఇతరత్రా ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించారు. ఇందుకు గాను ఆర్టీసీ సంస్థ 400 బస్సులను సమకూర్చగా 5 వేల ట్రిప్పులతో 2.50 లక్షల మందిని చేరవేసింది.

అలాగే, భూపాలపల్లి నుంచి 55 వ్యాన్‌లు, సింగరేణి సంస్థ నుంచి 25 వ్యాన్‌లు, మంచిర్యాల 10 బస్సులు, కరీంనగర్ నుంచి 30 మినీ బస్సులు కాళేశ్వరంలో ప్రయాణికులను చేరవేసేందుకు ఏర్పాటు చేశారు. ఇక ప్రైవేటు వాహనాలన్నీ కలిపితే సుమారు లక్ష పైచిలుకే ఉంటాయని అధికారులు అంచనాకు వచ్చారు. మొత్తంగా ట్రాఫిక్ జామ్ సమస్యతో పాటు కమలాపూర్ సమీపంలో ఒక ప్రమాదం, కాటారం సమీపంలో ఒక ప్రమాదం చోటు చేసుకుంది.


విస్తృతంగా వైద్య సేవలు..

పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా వైద్య సేవలు అందించారు. మొత్తంగా 11 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 1,30,840 మందికి వైద్య చికిత్స అందించారు. అలాగే, రూ. 25 లక్షల విలువ గల మందులను అందించారు. ఇక రూ. 2 లక్షల ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేశారు. వడదెబ్బ కారణంగా కాటారం మండలానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందగా.. మరో గుర్తు తెలియని వ్యక్తి మృత్యువాత పడ్డాడు.

గవర్నర్, సీఎం సహా పలువురు హాజరు..

గతంలో ఎన్నడులేని విధంగా ఈ పుష్కరాలకు వీఐపీలు, ప్రముఖులు పెద్ద ఎత్తున తరలొచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ,పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ దంపతులు, ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్‌శాఖ ధనసరి అనసూయ (సీతక్క), రెవెన్యూశాఖ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పుష్కర స్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకున్నారు. అలాగే, వివిధ పీఠాలకు చెందిన మొత్తం ఏడుగురు పీఠాధిపతులు పుష్కరాల్లో పాల్గొని సరస్వతి మాతకు, కాళేశ్వర ముక్తీశ్వరులకు అభిషేకాలు నిర్వహించారు. వీరితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, సినీ ప్రముఖులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రతిపక్ష నేతలు పుష్కరాలకు హాజరయ్యారు. సోమవారం సీఎస్ రామకృష్ణరావు దంపతులు, స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్ దంపతులు పుష్కర స్నానమాచరించారు.

6,231 మంది భక్తులకు ఆయుష్ వైద్య సేవలు


వైద్యశిబిరంలో వైద్యులు, సిబ్బంది

కాళేశ్వరం, మే 26(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వర క్షేత్రంలో సరస్వతి పుష్కరాల్లో వందల ఏళ్లనాటి నుంచి వస్తున్న సంప్రదాయ వైద్య సేవలు పుష్కర భక్తులకు అందించారు. కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ప్రాచీన వైద్య పద్ధతు లైన అయుర్వేదం, యునాని, హోమియోపతిలకు సంబంధించిన చికిత్సలు, మందులు అందించారు. ఆయుష్ (ఆయుర్వేద, యోగ, యునాని, సిద్ధ, హోమియో) హనుమకొండ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ భాను కుమార్ నేతృత్వంలో జిల్లా ఇంచార్జి డాక్టర్ తనూజారాణి ఆధ్వర్యంలో పలువురు వైద్యులు, ఫార్మసిస్టులు, ఎంఎన్‌వోలు 12రోజుల పాటు నిర్వహించిన పుష్కరాల్లో 6,231మంది భక్తులకు ఆయుర్వేద, హోమియో, యునాని వైద్య సేవలు, మందులు అందించినట్లు వైద్యులు తెలిపారు. జనరల్, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు చికిత్సలు అందించి మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు లీచంద్ర, తనూజ, శ్రీవాణి, మారుతి, అమర్‌నాథ్, ఆర్గనైజర్ కోట శ్రీనివాస్ సోమవారం తెలిపారు.

భక్తుల తిరుగుప్రయాణం


తిరుగు ప్రయాణమైన భక్తులు


కాళేశ్వరం, మే 26(ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాలు కన్నుల పండుగగా జరిగాయి. సోమవారం పుష్కరాల చివరి రోజు కావడంతో త్రివేణి సంగమానికి చేరుకున్న భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కాళేశ్వరుడిని దర్శించుకుని తిరుగుప్రయాణమయ్యారు. సరస్వతి మాత వందనం తల్లీ అంటూ అందరినీ చల్లంగా చూడాలని ఆకాంక్షించారు. తిరుగు ప్రయాణంలో అటు ఆర్టీసీ బస్సులు, ఇటు ప్రైవేటు వాహనాలు అన్నీ తిరుగుప్రయాణం కావడంతో రహదారులు రద్దీని సంతరించుకున్నాయి.

పుణ్యస్నానం ఆచరించిన ప్రముఖులు

కాళేశ్వరం, మే 26(ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాల్లో భాగంగా చివరి రోజైన సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదిర్శ కే. రామకృష్ణరావు దంపతులు, ప్రత్యేక కార్యదర్శి దంపతులు పుష్కరస్నానం ఆచరించి సరస్వతిమాతకు చీర, సారె సమర్పించారు. అనంతరం ముక్తీశ్వరుడని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించి హారతి కార్యక్రమం, ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. అంతకముందు దర్మపురి ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర ఆలయంలో మహాదేవుడికి అభిషేకాలు నిర్వహించారు.


సరస్వతి ఘాట్ వద్ద సీఎస్ రామకృష్ణారావు, ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్


ఆలయంలో ధర్మపురి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



కలెక్టరేట్ ప్రజావాణికి వినతుల వెల్లువ

హనుమకొండ కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 113 వినతులు వచ్చాయి. బాధితుల నుంచి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్లు వై.వి గణేష్, మేన శ్రీనులు వినతులు స్వీకరించి సంబంధిత అధికారులు పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ డిపార్ట్‌మెంట్‌లకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న జిల్లా ఇంఛార్జీ అదనపు కలెక్టర్లు గణేష్, శ్రీను

కార్పొరేట్ శక్తుల చేతుల్లో దేశసంపద

5వ పేజీ తరువాయి

తెరలేపిందని, మతోన్మాదులు, యుద్ధోన్మాదులతో దేశానికి ప్రమాదకరమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం పేరు మీద ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతుందని ధ్వజమెత్తారు. గుత్తా కోటీశ్వరులకు రైట్ ఆఫ్ లోన్స్ పేరుతో 16 లక్షల 35వేల కోట్లు రద్దు చేయడాన్ని ఆక్షేపించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతు పెట్టిన పెట్టుబడికి రెట్టింపు ఖర్చు ఇచ్చినప్పుడే మద్దతు ధర లభిస్తుందని దానికి కేవలం 119 లక్షల కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందని దీనిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో చత్తీస్‌గడ్‌లో విప్లవకారులను ఎన్‌కౌంటర్‌ల పేరుతో హననం చేయడాన్ని ఆపి శాంతి చర్చలు చేయాలని హితవు పలికారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికై సీపీఐ రాజీలేని ప్రజా పోరాటాలను నిర్వహిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్రం విఫలమైందన్నారు. రెండు సంవత్సరాల క్రితం కాజీపేటలో ప్రధాని మోదీ శంఖుస్థాపన చేసిన కోచ్ ఫ్యాక్టరీ నేటి వరకు అనుమతి ఇవ్వలేనదన్నారు. ఈ కార్యక్రమంలో మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నేదునూరి రాజమౌళి, నేదునూరి జ్యోతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయసారథి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్,మండ సదాలక్ష్మీ, నద్దునూరి అశోక్ స్టాలిన్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు లక్ష్మణ్, రాములు, ఓదేలు, సంతోష్, రాజుగౌడ్, సారంగపాణి, వెంకట్రాజం, సదానందం, రవి, మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ ఆధ్వర్యంలో కళాకారులు పాడిన పాటలు సభికులను ఉత్తేజ పరిచాయి.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రోడ్లు తెగిపోయే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలి
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మే26(ఆంధ్రజ్యోతి) : రానున్న వర్షాకాలం నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం వివిధ శాఖల అధికారులతో వరద ముప్పు నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. రెవెన్యూ, మునిసిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, అగ్నిమాపక, వ్యవసాయ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు రానున్న వర్షాకాలంలో తీసుకుంటున్న చర్యల గురించి ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. రానున్నది వర్షాకాలం కావడంతో ముంపు ప్రాంతాలను అధికారులు ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. రోడ్లు తెగిపోయే ప్రాంతాలను, చెరువు, వాగుల స్థితిగతులను ఎప్పటికప్పుడు ఆయా శాఖల అధికారులు గుర్తించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని, వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆ శాఖ అధికారులు చూసుకోవాలన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు విపత్తు నిర్వహణకు సంబంధించిన ఉపకరణాలను సిద్ధంగా ఉంచాలని, బోట్స్, లైఫ్‌జాకెట్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సరిపోను మందులు నిల్వ ఉంచాలని, వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్న చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించేలా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. వర్షాకాలాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ పరిధిలో అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కంట్రోల్‌రూంను ఏర్పాటు చేస్తామన్నారు.



ముఖాముఖి

వ్యవసాయ శాఖ మండల అధికారి అడ్లూరి అనురాధ

సాగులో రసాయనాల వాడకం తగ్గించాలి

ప్రశ్న: వానాకాలంలో ఎలాంటి పంటలను ఎంపిక చేసుకోవాలి ?

జవాబు: భూసారాన్ని అనుసరించి వరి, పత్తి, మొక్కజొన్న, మిరప, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పప్పు దినుసులు, కూరగాయలను సాగు చేయాలి.

ప్ర: ప్రస్తుతం విత్తనాలు నాటే సరైన సమయం ఏది ?

జ: మృగశిర కార్తె (జూన్ 8 నుంచి జూన్ 21)లో మూడు నుంచి నాలుగు భారీ వర్షాలు (60 మి.మీ. వర్షపాతం) కురిసిన తర్వాత విత్తనాలు నాటాలి.

ప్ర: నీటి సదుపాయం లేని భూముల్లో మొలకెత్తని విత్తనాలు నాటేందుకు సరైన సమయం ఏది ?

జ: నీటి సదుపాయం లేని భూముల్లో మృగశిర కార్తెలో నాటినా మొలకెత్తని విత్తనాల స్థానంలో ఆరుద్ర కార్తె (22 జూన్ నుంచి జూలై 5)లో మళ్లీ విత్తనాలు నాటుకోవాలి.

ప్ర: పంటల దిగుబడి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటి ?

జ: భూమికి బలాన్నిచ్చే జనుము, జీలుగ, అపరాలు వంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేసి భూమిలో కలియదున్నాలి. అధిక రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలి. సాగులో సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి.

ప్ర: సాగులో చీడపీడల నివారణలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జ: సరైన సమయంలో పంట సాగు చేసుకోవాలి. చీడపీడలను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలి. పంట మార్పిడి చేసుకోవాలి. శాస్త్రవేత్తలు సూచించిన మేరకే మొక్కల దూరాన్ని పాటించాలి.

- ఆంధ్రజ్యోతి, హసన్‌పర్తి



ఫిర్యాదు చేసేందుకు వాట్సాప్ నెంబరు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

లింగ నిర్ధారణ చేస్తే ఫిర్యాదు చేయండి

వరంగల్ మెడికల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సంక్షేమశాఖ సూచనల మేరకు లింగ నిర్ధారణ పరీక్షలకు సంబంధించి ఫిర్యాదు చేసేందుకు వాట్సాప్ నెంబరు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సోమవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని చెప్పడం, తెలుసుకోవడం చట్టరీత్యా నేరమని, చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే 63000 30940 నెంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. అలాగే 104, 181, 1098, డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, డీడబ్ల్యూఓ జయంతి, డాక్టర్ మంజుల, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 29 మందికి జరిమానా

వరంగల్ క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 30మందిని సోమవారం కోర్టులో హాజరుపరచగా ఒకరికి జైలు శిక్ష, 29 మందికి రూ. 33,200 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ తీర్పు ఇవ్వడం జరిగిందని హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ జి.సీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని నలుగురికి రూ. 2,300 జరిమానా విధించారన్నారు.

తెలంగాణ సీఎస్‌ను కలిసిన 'కుడా' చైర్మన్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు వరంగల్ పర్యటన సందర్భంగా కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాజీపేట ఎన్ఐటీలో జరిగిన కార్యక్రమానికి రామకృష్ణారావు హాజరు కాగా వెంకట్రామ్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కుడా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వెల్లడించారు.



సీఎస్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కుడా చైర్మన్

మావోయిస్టుల మృతదేహాలను వెంటనే అప్పజెప్పాలి

పౌర, ప్రజా, విద్యార్థి సంఘాల నేతల డిమాండ్

హసన్‌పర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల మృతదేహాలను వెంటనే అప్పజెప్పాలని పౌర, ప్రజా, విద్యార్థి సంఘాల నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్రం అబుజ్‌మడ్ ప్రాంతంలో మే 21న ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వారి మృతదేహాలను వారి బంధువులకు అప్పజెప్పకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. మృతదేహంతో గౌరవప్రదంగా వ్యవహరించాలనే హక్కును ఉల్లంఘించారన్నారు. సోమవారం హసన్‌పర్తి మండలం చింతగట్టులోని మావోయిస్టు అగ్రనేత కేశవరావు కంప్యూటర్ ఆపరేటర్ బూర రాకేష్ (32) గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌర హక్కుల సంఘం నేత పీ రమేష్‌చందర్, ప్రజా సంఘాల నేతలు బీ రమాదేవి, జనగాం కుమారస్వామి, డాక్టర్ ఎం వెంగళరెడ్డి, అమరుల బంధుమిత్రుల సంఘం నేతలు కళక్క, శాంతక్క, భారతక్క, విద్యార్థి సంఘాల నేతలు జీ క్రాంతి, సంజీవ, ఉదయ్ సింగ్ మాట్లాడారు. ఛత్తీస్‌గడ్‌లో మృతి చెందిన మావోయిస్టుల పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఛత్తీస్‌గడ్ అడ్వకేట్ జనరల్ 2025 మే 24న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ముందు హామీ ఇచ్చినా ఇప్పటికీ మృతదేహాలను ఇవ్వలేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. జాప్యం వల్ల తమ ప్రియమైన వారి మృతదేహాలను తీసుకెళ్లడానికి చాలా దూరం ప్రయాణించి వెళ్లి దుఃఖంలో ఉన్న తమ కుటుంబాలకు మరింత వేదనను కలిగిస్తోందన్నారు. మృతదేహాలను భద్రపరచాలనే చట్టపరంగా, నైతిక బాధ్యత ఉన్నా వాటిని కోల్డ్ స్టోరేజీలో భద్రపరచకపోవడంతో కుళ్లిపోయాయన్నారు. ఇలా వ్యవహరించడం వైద్యపరంగా, చట్టపరమైన ప్రోటోకాల్‌ను ఉల్లంఘించడమేనని మండిపడ్డారు. కోర్టు విచారణ సమయంలో భారత యూనియన్ తరుపున హాజరైన డిప్యూటీ సొలిసిటర్ జనరల్ అంత్యక్రియల ఊరేగింపుల వల్ల శాంతిభద్రతల సమస్య వస్తుందని పేర్కొంటూ ఇద్దరి మృతదేహాలను అప్పగించడాన్ని వ్యతిరేకించడం బాధ కలిగించిందన్నారు. శాంతియుతంగా అంతిమ సంస్కారాలు చేయడానికి తాము ఎలాంటి షరతులకైనా కట్టుబడి ఉంటామని బాధిత కుటుంబాలు సీనియర్ న్యాయవాది ద్వారా కోర్టుకు ఇప్పటికే హామీ ఇచ్చాయన్నారు. అయినా మృతదేహాలను ఇవ్వకపోవడం మానవ హక్కుల ఉల్లంఘనే కాకుండా మనుషుల దుఃఖాన్ని అడ్డుకోవడమేనన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం మరణంలో సైతం గౌరవం పొందే హక్కును దృష్టిలో పెట్టుకొని ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మృతుడు బూర రాకేష్ తల్లి స్వరూప, సోదరుడు రంజిత్‌తో పాటు టీ-జాక్ నాయకుడు ఉదయ్‌సింగ్, సీఎంఎస్ నాయకులు అనిత, రాంబ్రహ్మం, ఇంద్రసేన, డీఎస్‌పి నాయకుడు శివ, పీడీఎస్‌యూ నాయకులు మహేష్, వంశీకృష్ణ, సీఎల్‌సీ నాయకులు జయంత్, పాణి, ప్రవీణ్, రంజిత్, పౌర స్పందన వేదిక నాయకుడు శంకర్‌రావు పాల్గొన్నారు.

పలు కాలనీల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

కాజీపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 63వ డివిజన్ ఈద్గా రోడ్, జూబ్లీ మార్కెట్ సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ, పైప్‌లైన్ పనులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. రూ. 40 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 62, 63వ డివిజన్ కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలి, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, ఎండీ అంకూస్, అరూరి సాంబయ్య, సిరిల్ లారెన్స్, దొంగల కుమార్, ఎండీ అస్గర్, పోగుల శ్రీనివాస్, ఇప్ప శ్రీకాంత్, బైరబోయిన అశోక్, రమేశ్, ఆంజనేయులు, రాజులు, బొంద్యాలు, శివరాం, రాము, కర్ణాకర్, రవి, రాజు, రాకేశ్, సంతోష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

ఎమ్మెల్యే చొరవతో స్పందించిన రైల్వే అధికారులు

47వ డివిజన్ బూదిగడ్డ, బాపూజీ నగర్ ప్రాంతాల్లో కొన్ని సంవత్సరాలుగా వర్షాకాలంలో డ్రైనేజీలు నిండిపోయి నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి వెంటనే రైల్వే అధికారులతో మాట్లాడారు. దీంతో స్పందించిన రైల్వే అధికారులు జేసీబీ ద్వారా డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కార్యక్రమంలో రైల్వే ఏఎన్ రాజు, మునిసిపల్ ఎంహెచ్‌ఓ రాజిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎంపీ శంకుస్థాపన

49వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ, గణేష్‌నగర్, 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్‌లో రూ. 1.70 కోట్లతో పలు అభివృద్ధి పనులకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య సోమవారం శంకుస్థాపన చేశారు. కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, డివిజన్ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మందుల సరఫరాలో అప్రమత్తంగా ఉండాలి

వరంగల్ మెడికల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : మందుల సరఫరాలో జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సౌకర్యాల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఫణీంద్రరెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌ను ఆకస్మికంగా సందర్శించారు. సీఎంఎస్ అధికారులు, ఆస్పత్రుల వైద్యాధికారులతో సమన్వయంగా ఉంటూ మందుల కొరత లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం మందుల నిల్వలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంఎస్ ఇన్‌చార్జి ఫార్మసీ ఆఫీసర్లు ఉప్పు భాస్కర్‌రావు, నళిని, కార్పొరేటర్ చీఫ్ ఇంజనీర్ పి.దేవేంద్ర కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.కౌటిల్య, కేఎస్‌కే.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులు పెండింగ్‌లో ఉండొద్దు

అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో అందిన వినతులను వెంటవెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం అధికారులతో మాట్లాడారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతుల పట్ల అలసత్వం వహించకుండా సాధ్యమైనంత మేరకు వెంటనే పరిష్కరించాలని సూచించారు. గ్రీవెన్స్ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను సైతం పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 101 వినతులు అందగా వాటిని శాఖల వారీగా ఎండార్స్ చేశారు. రెవెన్యూ శాఖకు 44, హౌసింగ్ పీడీ 11 దరఖాస్తులు రాగా మిగతావి వివిధ శాఖలకు సంబంధించి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, హౌసింగ్ పీడీ గణపతి, ఎస్సీ కార్పొరేషన్ డీఈ సురేశ్, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డీసీవో నీరజ, డీపీవో కల్పన, డీఈవో జ్ఞానేశ్వర్, బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

డీఈవోను సస్పెండ్ చేయాలంటూ వినతి..

విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల పదో తరగతి విద్యార్థిని భాషిక రవిత్రేణి ఫెయిల్ అయిందని, ఈ విషయంలో విచారణ జరిపి డీఈవో జ్ఞానేశ్వర్‌తో పాటు సంబంధిత ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, టీజీవీపీ, ఏబీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. దుగ్గొండిలో గల సోషల్‌వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో చదివిన విద్యార్థిని చెన్నారావుపేటలో పరీక్ష రాసిందని, ఆమె ఫెయిల్ కావడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందారని, ఈ విషయమై సదరు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారని అందులో పేర్కొన్నారు. కాగా, ఇటీవల డీఈవో కార్యాలయం నుంచి సదరు విద్యార్థినికి ఫోన్ చేసి మీరు సోషల్ పేపర్ ఆబ్జెక్టివ్ పార్ట్ బీ మ్యాప్‌ను మెయిన్ ఆన్సర్ షీట్‌కి కట్టలేదని చెప్పారని, అందుకు తాను అన్ని పేపర్స్ సరిగానే సమర్పించానని చెప్పిందని, అయినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పత్రాలు జమ చేయకుంటే ఇన్విజిలేటర్ ఎలా పేపర్ టీసుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికైనా విచారణ జరిపి బాధిత విద్యార్థినికి న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంథిని గ్రామ దళితులు

దళితుల భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్ ఎదుట పంథిని గ్రామ దళితుల ధర్నా


హనుమకొండ కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఐనవోలు మండల పంథిని గ్రామంలోని సర్వేనెంబర్ 322లో ఉన్న ఎస్సీ(మాదిగ)లకు చెందిన 35 గుంటల భూమిని ఆక్రమించిన కురిమిళ్ల విక్రంరావుపై చర్యలు తీసుకోవాలని సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట పంథిని గ్రామ దళితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు కలిసి దళితుల భూములను విక్రంరావుకు నకిలీపట్టా పాస్‌బుక్ ద్వారా ఎక్కించారన్నారు. వీరిపై కలెక్టర్‌కు సంబంధిత అధికారులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ భూములు తమకు కావాలని మేము విక్రంరావును గ్రామంలో అడిగితే మీకు ఇక్కడ భూమి ఎక్కడిది, మీకు దిక్కు ఉన్న చోట చెప్పుకో అని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడన్నారు. వెంటనే కలెక్టర్ సర్వేనెంబర్ 322కు వచ్చి పరిశీలించిన్యాయం చేయాలని వేడుకున్నారు. ధర్నాలో పంథిని గ్రామ దళితులు ఎస్.నిఖిల్, జి.రాజశేఖర్,రాజ్‌కుమార్, ప్రసాద్, యశ్వంత్,పూలమ్మ, భద్రమ్మ పాల్గొన్నారు.

ఘనంగా పైలెట్ల దినోత్సవం

వరంగల్ మెడికల్, మే 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ పైలెట్ల (డ్రైవర్స్) దినోత్సవాన్ని సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని 108 కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108, 102, 1962 వాహనాల ప్రోగ్రాం మేనేజర్ మరిజ లక్ష్మణ్ కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లకావత్ బాలాజీ నాయక్, దేవేందర్‌రావు, అశోక్‌రెడ్డి, అనిల్, కోటిలింగం, రాజుయాదవ్, నరేశ్, చైతన్య సాగర్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న 108 పైలెట్లు



బోనమెత్తుకొని మహిళలతో తరలివస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఘనంగా బీరన్న బోనాలు

మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి, మే 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రంలో సోమవారం బీరన్న ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కామరాతిస్వామి బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్ల, కురుమ మహిళలు బోనాలతో డప్పు సప్పుళ్లు, మంగళ వాయిద్యాలతో బీరన్న ఆలయానికి బయలుదేరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ వేడుకల్లో పాల్గొని బోనమెత్తారు. అనంతరం బీరన్న ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ సభ్యుడు నమిండ్ల శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, వెంకన్న, గొర్రె కిరణ్, తాళ్ల మధు, ఆరెల్లి వెంకటస్వామి, వేల్పుల సాంబయ్య, కురుమ కులపెద్దలు, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, మే 26(ఆంధ్రజ్యోతి) : చండీఘర్ రాష్ట్రంలో మే 29 నుంచి జూన్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న 43వ జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనున్న పవన్‌కుమార్, ఎం. జగదీష్, ఎ. స్ఫూర్తిలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభినందించారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయిని రాజేందర్‌రెడ్డిని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...వి. పవన్‌కుమార్, ఎం. జగదీష్, ఎ. స్ఫూర్తిలు జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియనషిప్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి. రాజేందర్ మాట్లాడుతూ... మెదక్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో క్రీడాకారులు వి. పవన్‌కుమార్, ఎం. జగదీష్, ఎ. స్ఫూర్తిలు ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపిక కావడం జరిగిందన్నారు.

జీవనశైలి

ఉరుకుల పరుగుల జీవితం మనది. ఈ పరుగులో ఆహారం, నిద్రలు నిర్లక్ష్యానికి గురవుతూ ఉంటాయి. ఒత్తిడిలు, ఆందోళనలు ఆవరిస్తూ ఉంటాయి. దాంతో ఒక్కసారిగా నిస్సత్తువకు లోనై, అడుగు వేయలేని పరిస్థితులు కూడా తలెత్తుతూ ఉంటాయి. ఇదే పరిస్థితి అరుదుగా కాకుండా తరచూ వేధిస్తుంటే, మూలాల్లోకి వెళ్లి అసలు కారణాన్ని కనిపెట్టి, దాన్ని సరిదిద్దుకోవాలి.



నీరసం నలతగా మారితే...

మనలో చాలా మంది నీరసాన్ని పెద్దగా పట్టించుకోరు. దాన్నొక చిన్నపాటి నలతగా సరిపెట్టుకుని, దానంతట అదే సర్దుకుంటుందిలే అనే ఆలోచనతో బలవంతంగా పనులను చేసుకుపోతూ ఉంటారు. కానీ రాత్రంతా కంటి నిండా నిద్రపోయినా, ఉదయం నిద్ర లేచిన వెంటనే నిస్సత్తువ ఆవరిస్తున్నా, చిన్నపాటి పనులకే అలసట వేధిస్తున్నా పరిస్థితిని తీవ్రంగానే పరిగణించాలి.

ఆరోగ్యపరమైన కారణాలు ఇవే!

శరీర జీవక్రియలు గాడి తప్పినప్పుడు బయల్పడే మొట్టమొదటి సంకేతం నీరసం. ఈ పరిస్థితి ఎన్నో సందర్భాల్లో బయల్పడుతూ ఉంటుంది. అవేంటంటే...

- **హైపో థైరాయిడ్:** థైరాయిడ్ సమస్యల్లో కనిపించే ప్రధాన లక్షణం నీరసం. వీటితో పాటు కండరాల నొప్పులు, అతి నిద్ర, వెంట్రుకలు ఊడిపోవడం, చర్మం పొడిబారడం, నెలసరి క్రమం తప్పడం లాంటి లక్షణాలు తోడైతే వైద్యులను కలిసి థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవాలి
- **మధుమేహం:** మధుమేహం తలెత్తినా, ఉన్న మధుమేహం క్రమం తప్పినా నీరసం వేధిస్తుంది. నీరసంతో పాటు దాహం, ఆకలి పెరగడం, గాయాలు మానకపోవడం లాంటి లక్షణాలు కూడా కనిపిస్తే వెంటనే వైద్యులను కలవాలి
- **పోషకలోపాలు:** బి12 పోషకలోపం ఎక్కువ మందిలో ఉంటుంది. మరీముఖ్యంగా శాకాహారుల్లో ఈ సమస్య ఎక్కువ.
- **క్యాల్షియం లోపం:** విటమిన్ డి లోపంతో, శరీరంలోకి చేరుకునే క్యాల్షియాన్ని శరీరం శోషించుకోలేదు.
- **అనీమియా:** రక్తహీనతలో కూడా నిస్సత్తువ వేధిస్తుంది. పోషకాహార లోపంతో పాటు, పెద్దపేగుల్లో సమస్యలతో విరోచనంలో రక్తస్రావం మూలంగా కూడా నీరసం వేధిస్తుంది. మహిళల్లో ఫైబ్రాయిడ్స్ వల్ల అధిర రక్తస్రావంతో రక్తహీనత తలెత్తి, నిస్సత్తువ ఆవరిస్తుంది
- **నిద్రలేమి:** మన జీవగడియారం రాత్రి నిద్రకు తగ్గట్టు రూపొంది ఉంటుంది. కాబట్టి ఆ జీవగడియారం క్రమం తప్పకుండా చూసుకోవాలి. రాత్రుళ్లు మేలుకుంటూ పగలు ఏడు గంటలు నిద్రపోయినా నిస్సత్తువ వేధించడానికి కారణం ఇదే!
- **ఒత్తిడి:** వృత్తిపరమైన, వ్యక్తిగతమైన ఒత్తిళ్లు నిద్రకు దూరం చేస్తాయి. శరీరాన్ని నీరసింపజేస్తాయి. కాబట్టి వాటిని తగ్గించుకునే మార్గాలను కనిపెట్టాలి. అందుకోసం యోగా, ధ్యానం సహాయపడతాయి

ఇలా నిస్సత్తువ బలాదూర్

- సరైన సమయంలో సరిపడా నిద్ర
- నిద్రకు గంటకు ముందు నుంచి అన్ని రకాల స్ర్కీన్స్‌కు దూరంగా ఉండాలి
- ప్రొటీన్లు, పీచు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి
- రోజు మొత్తంలో మూడు ప్రధాన భోజనాలు, రెండు అల్పాహారాలు తీసుకోవాలి
- కనిష్ఠంగా రోజుకు 30 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి
- ఒత్తిళ్లకు దూరంగా ఉండాలి



సప్లిమెంట్లు ఎప్పుడు?

పోషక లోపాలను ఆహారంతో భర్తీ చేసుకోవడం కొంత వరకూ తేలికే! విటమిన్ బి12 లోపం ఉన్న వ్యక్తులు మాంసాహారులైన పక్షంలో మాంసాహారంతో ఆ లోపాన్ని భర్తీ చేసుకోవచ్చు. అయితే శాకాహారులకు ఇది సాధ్యపడకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో పోషకాలను సప్లిమెంట్ల రూపంలో తీసుకోక తప్పదు. అయితే వీటిని వాడుకునే సమయంలో ఏ పోషక లోపం కొరవడిందో దాన్ని మాత్రమే భర్తీ చేసే సప్లిమెంట్లు వాడుకోవాలి. బదులుగా ఇతరత్రా విటమిన్లు, ఖనిజలవణాల లోపాలను కూడా భర్తీ చేసే సప్లిమెంట్లను వాడుకోకూడదు.

మెనోపాజ్ మహిళల్లో...

నెలసరి ఆగిపోయిన తర్వాత శరీరంలో ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తి ఆగిపోయి, ఎముకలు గుల్లబారే సమస్య తలెత్తుతుంది. దాంతో ఎముకల నొప్పులు వేధిస్తూ ఉంటాయి. కానీ ఎక్కువ మంది మహిళలు ఈ సమస్యను తీవ్రంగా పరిగణించకుండా, పైబడే వయసులో ఇవన్నీ సహజమే అని సరిపెట్టుకుంటూ ఉంటారు. కానీ నిస్సత్తువను దూరం చేయడంతో పాటు ఎముకలను దృఢంగా ఉంచుకోవడం కోసం సప్లిమెంట్లు తప్పక వాడుకోవాలి.

ఈ పరీక్షలు అవసరం

నిస్సత్తువకు అసలు కారణాన్ని కనిపెట్టడం కోసం కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సిబిపి), విటమిన్ డి3, బి12, థైరాయిడ్, మధుమేహ పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. ఫలితాన్ని బట్టి సమస్యను మందులతో సరిదిద్దుకోవడం ద్వారా నిస్సత్తువను దూరం చేసుకోవచ్చు.

వ్యాయామం కీలకం

శరీరం చురుగ్గా ఉండడానికి వ్యాయామం చేయడం తప్పనిసరి. గుండె సమస్యలు, కీళ్ల సమస్యలు లేనివాళ్లు కార్డియో వ్యాయామంలో భాగంగా ఏరోబిక్స్ చేయొచ్చు. ప్రతి రోజూ నడవడం ఆరోగ్యకరమే! కానీ కార్డియోతో పాటు కండరాలను బలపరిచే స్ట్రెంగ్తెనింగ్ వ్యాయామాలు కూడా జోడించాలి. ఇలా బరువులతో కూడిన వ్యాయామాలతో కండరాలను బలపరుచుకోవడం వల్ల, మన శరీర బరువును మోసే బాధ్యతను కేవలం ఎముకలే కాకుండా కండరాలు కూడా తీసుకుంటాయి. దాంతో శరీరం తేలిక అవుతుంది.

డాక్టర్ శ్రద్ధా సంఘాని,
కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్,
రెనోవా సెంచరీ హాస్పిటల్స్,
బంజారాహిల్స్, హైదరాబాద్



అవగాహన

డార్క్ చాక్లెట్‌తో బీపీకి చెక్



చాక్లెట్‌ను ఇష్టపడని వారుండరు. అయితే డార్క్ చాక్లెట్ రక్తపోటును తగ్గిస్తుందని ఓ తాజా అధ్యయనంలో తేలింది. ఆ వివరాలు తెలుసుకుందాం..

యూకే యూనివర్సిటీ ఆఫ్ సర్రే పరిశోధకులు తాజాగా చేపట్టిన ఒక అధ్యయనంలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. డార్క్ చాక్లెట్, ద్రాక్ష, యాపిల్, టీలను రోజూ తీసుకుంటే అధిక రక్తపోటు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని యూరోపియన్ జర్నల్ ఆఫ్ ప్రివెంటివ్ కార్డియాలజీలో ప్రచురితమైన ఆ అధ్యయనంలో వెల్లడైంది. ఫ్లేవనాయిడ్ సమ్మేళనాలు రక్తపోటును నియంత్రిస్తాయనీ, గుండె ఆరోగ్యంలో ముఖ్య పాత్ర పోషించే రక్తనాళాల లోపలి సన్నని పొర ఎండోథీలియం పనితీరును మెరుగుపరుస్తాయనీ పరిశోధకులు అధ్యయనంలో కనుగొన్నారు. కోకో, బ్లాక్ టీ, గ్రీన్ టీ, యాపిల్స్, బెర్రీలు, ద్రాక్షలు వంటి వాటిలో ఫ్లేవనాయిడ్ సమ్మేళనాలు పుష్కలంగా ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. అందుకే ఈ ఆహార పదార్థాలను కొద్దిమొత్తంలో రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు. అయితే ఈ ఆహార పదార్థాలు వైద్యులు సూచించే మందులకు ప్రత్యామ్నాయం కాదని కూడా వారు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 128 కోట్ల మంది ప్రజలు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. అధిక రక్తపోటు... గుండెపోటు, గుండె వైఫల్యం, మూత్రపిండాల వ్యాధులు లాంటి ప్రాణాంతక సమస్యలకు దారి తీస్తుంది. కాబట్టి రక్తపోటును నియంత్రించే మందులు వాడుకోవడంతో పాటు, సమతులాహారం తీసుకుంటూ, శారీరకంగా చురుగ్గా ఉంటూ, ధూమపానం, మద్యపానాలకు దూరంగా ఉండాలి.

పరిశోధన

మైక్రోప్లాస్టిక్స్ ఇలా మాయం



శరీరంలోకి చేరుకునే మైక్రో ప్లాస్టిక్స్ ఆరోగ్యానికి ఎంత హానికరమో మనందరికీ తెలిసిందే! ఇవి నీళ్ల ద్వారా మన శరీరంలోకి చేరుకుంటూ ఉంటాయి. కాబట్టి బెండకాయ, మెంతులతో వాటిని నిర్మూలించే ఒక చిన్న చిట్కాను శాస్త్రవేత్తలు కనిపెట్టారు. అదేంటంటే...

నీటి శుద్ధి ప్రక్రియలో మెంతులు, బెండకాయ పొడులను కలపడం ద్వారా నీళ్లలో కలిసిన మైక్రోప్లాస్టిక్స్‌తో పాటు ఇతరత్రా కలుషితాలను నిర్మూలించవచ్చని శాస్త్రవేత్తలు కనిపెట్టారు. అందుకోసం ఒక లీటరునీళ్లలో ఒక గ్రాము బెండకాయ, మెంతి పొడిని కలపడం ద్వారా గంట సమయంలో 67% మైక్రోప్లాస్టిక్స్ తొలగిపోయినట్టు వాళ్లు ప్రయోగాలతో కనిపెట్టారు. సమపాళ్లలో కలిపిన బెండ, మెంతి పొడులు సహజసిద్ధ పాలిమర్స్‌లా ప్రవర్తిస్తూ, సింథటిక్, వాణిజ్యపరమైన పాలిమర్స్ కంటే ఎంతో సమర్థంగా వ్యర్థనీటి శుద్ధికి తోడ్పడుతున్నట్టు వాళ్లు తెలుసుకున్నారు. ఈ తాజా ప్రయోగంతో నీటిశుద్ధి ప్రక్రియ మరింత మెరుగుపడి, నీటిలో కలిసిన మైక్రోప్లాస్టిక్స్ కలుషితాలు తొలగిపోయి, వాటితో ముడిపడి ఉండే అనారోగ్యాల ముప్పు తప్పుతుందని వాళ్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పోషకాహారం

క్యాల్షియం కావాలా?

క్యాల్షియం ఏఏ ఆహార పదార్థాల్లో దొరుకుతుందో తెలిసినా, వాటిని ఎంత పరిమాణంలో తింటే ఎంత క్యాల్షియం దక్కుతుందనే అవగాహన అందరికీ ఉండదు. ఒక కప్పు పరిమాణంలోని భిన్నమైన పదార్థాల్లో ఎంత క్యాల్షియం ఉంటుందో తెలుసుకుందాం!



- రాగి : 344 మిల్లీ గ్రాములు
- మినుములు : 124 మిల్లీ గ్రాములు
- తోటకూర : 500 మిల్లీ గ్రాములు
- కరివేపాకు : 830 మిల్లీగ్రాములు
- బాదం : 230 మిల్లీగ్రాములు
- మునగాకు : 440 మిల్లీ గ్రాములు
- నువ్వులు : 1450 మిల్లీ గ్రాములు
- పెరుగు : 150 మిల్లీ గ్రాములు
- అటుకులు : 238 మిల్లీ గ్రాములు

అప్రమత్తం

కండరాల మీద ఓ కన్నేసి...

ప్రతి క్షణం మన శరీరంలో ఏదో ఒక కండరం పని చేస్తూనే ఉంటుంది. మన శరీర కదలికలన్నీ కండరాల మీదే ఆధారపడి ఉంటాయి. కాబట్టి అవి మొండికేసినా, దెబ్బ తిన్నా, క్షీణించినా నొప్పులు, అసౌకర్యాలు తప్పవు. కాబట్టి కండరాల మీద ఓ కన్నేసి ఉంచాలంటున్నారు వైద్యులు.



నొప్పి, వాపు, అవయవాన్ని కదిలించలేకపోవడం.. దెబ్బతిన్న కండరం ప్రధాన లక్షణాలు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను కలవాలి. వారు సూచించినంత కాలం ఆ కండరాలకు విశ్రాంతినివ్వాలి.

మనకు తెలియకుండానే మనమెన్నో మార్గాల్లో కండరాలను ఇబ్బంది పెడుతూ ఉంటాం. తప్పుడు కోణంలో చేతులను, కాళ్లను వంచుతాం. అవసరానికి మించి ఒకే అవయవ కండరాలను ఒత్తిడికి లోను చేస్తాం. అంతే కాదు, కండరాలను బలపరిచే ఆహారాన్ని నిర్లక్ష్యం చేస్తూ, కండరాల బలహీనత బారిన పడుతూ ఉంటాం. ఫలితంగా నొప్పులు వేధించినా అవి స్వీయ తప్పిదాలనే విషయాన్ని గ్రహించకుండా, అవే పొరపాట్లు మళ్లీ మళ్లీ చేస్తూ, అంతిమంగా వైద్యులను కలిసే పరిస్థితిని కొని తెచ్చుకుంటూ ఉంటాం.

కండరాల బలహీనత ఇందుకే...

సాధారణంగా 60 ఏళ్ల వయసులో కీళ్ల నొప్పులు మొదలవుతాయి. కానీ నేడు 40 ఏళ్లకే కీళ్ల నొప్పులు వేధిస్తున్నాయి. మెట్లు ఎక్కినా, కొద్ది దూరం నడిచినా మోకాళ్ల నొప్పి పెడుతూ ఉంటాయి. ఇందుకు కారణం మోకీళ్లకు దన్నుగా ఉండే కండరాలు బలహీనపడడమే! ఇలా మోకాళ్లలోని కండరాలు బలహీనపడడానికి అధిక బరువు, కండర బలహీనత, ఇండియన్ టాయలెట్స్ వాడకం ప్రధాన కారణాలు. సమస్య ఏ కారణంతో ముడిపడి ఉన్నప్పటికీ కండరాల నొప్పులు దరి చేరకుండా ఉండాలంటే ఎత్తుకు తగిన బరువును కలిగి ఉండాలి. భారతీయ మహిళలు సగటున 158 సెంటీమీటర్ల ఎత్తు ఉంటారు కాబట్టి 58 నుంచి 60 కిలోల బరువు ఉంటే సరిపోతుంది. పురుషులు 178 సెంటీమీటర్ల ఎత్తు ఉంటారు కాబట్టి బరువు 72 కిలోలు ఉంటే సరిపోతుంది. కానీ మన దేశంలో సగటున ప్రతి ఒక్కరూ ఐదారు కిలోలు అధిక బరువును కలిగి ఉంటున్నారు

- **అధిక బరువు:** మన శరీరం ఒక కిలో ఎక్కువ బరువు పెరిగితే, శరీరం మీద రెండు కిలోల భారం పడుతుంది. కాబట్టి తప్పనిసరిగా ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలి.
- **వ్యాయామం:** రోజుకు కనీసం అరగంట పాటైనా వ్యాయామం చేయాలి. లేదంటే వారంలో నాలుగు రోజుల పాటు అరగంట చొప్పున వారం మొత్తంలో 150 నిమిషాలకు తగ్గకుండా చూసుకోవాలి
- 50 ఏళ్ల దాటిన వాళ్లు మెట్లు, ఇండియన్ టాయిలెట్స్ వాడకపోవడమే మంచిది

మెడ నొప్పి వెనక...

విటమిన్ డి3 లోపం సర్వసాధారణమైపోయింది. దీంతో తలెత్తే ప్రధాన ఇబ్బంది మెడ నొప్పి. ప్రతి వంద మందిలో 80 మందికి విటమిన్ డి3, 30 కంటే తక్కువగా ఉంటోంది. విటమిన్ డి సమృద్ధిగా దొరికే పాల ఉత్పత్తులు, ఆకుకూరలు సరిపడా తీసుకోకపోవడం, సూర్యరశ్మికి బహిర్గతం అవకపోవడం వల్ల ఈ విటమిన్ లోపం ఎక్కువమందిని వేధిస్తూ ఉంటుంది. ఇలాంటి వాళ్లలో మెడ నొప్పితో పాటు, వీపు నొప్పి కూడా ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించడం కోసం విటమిన్ డి3 సప్లిమెంట్లు తీసుకోవడంతో పాటు సూర్యరశ్మికి కూడా బహిర్గతమవుతూ ఉండాలి. అలాగే ఆకుకూరలు, పాల ఉత్పత్తులు సరిపడా తీసుకోవాలి.

డైటింగ్‌తో... కండర నష్టం

బరువు తగ్గడం కోసం పలురకాల డైట్స్‌ను అనుసరించడంలో భాగంగా తీసుకునే ఆహారంలో కోత విధిస్తే, కొవ్వుతో పాటు కండర నష్టం కూడా జరుగుతుంది. డైట్ చేశాం కాబట్టి బరువు తగ్గినట్టు భావిస్తూ ఉంటారు. కానీ సరిపడా పోషకాలు అందక, కండరాలు కూడా నష్టపోతున్నామనే విషయాన్ని చాలా మంది గ్రహించరు. కండరాలు దృఢంగా ఉండాలంటే సరిపడా పిండిపదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వులు అవసరం. బరువు తగ్గే క్రమంలో కండరాలు వదులుగా మారి, సాగిపోతున్నట్టు తయారైతే, దాన్ని కండర నష్టంగానే పరిగణించాలి. సరిపడా పోషకాలు అందేలా ఆహార పరిమాణాన్ని తగ్గించుకోగలిగితే, బరువు తగ్గడంతో పాటు కండర నష్టం జరగకుండా నియంత్రించుకోవచ్చు. అలాగే డైట్ చేస్తున్న వాళ్లు కండరాలు దృఢంగా ఉండడం కోసం తప్పనిసరిగా వ్యాయామం చేయాలి.

కండరాలు చిరిగితే?

ముఖ్యంగా జిమ్‌లో ప్రత్యేకించి భుజానికి సంబంధించిన వ్యాయామాలు చేసే వారిలో రొటేటర్ కఫ్ కండరం ఒత్తిడికి లోనవుతుంది. వ్యాయామం చేసే క్రమంలో తప్పుడు కోణంలో భుజాలను కదిలించినప్పుడు ఈ కండరం కందిపోవడం మొదలుపెడుతుంది. దాంతో విపరీతమైన నొప్పితో పాటు, భుజాన్ని పైకి లేపలేని పరిస్థితి తలెత్తుతుంది. కొన్నిసార్లు ఈ కండరం పాక్షికంగా లేదా పూర్తిగా చిరిగిపోతుంది. ఇలాంటి సందర్భాల్లో ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి. ఎక్స్‌రే, ఎమ్మారైలతో ఈ చిరుగును వైద్యులు సులువుగా గుర్తించగలుగుతారు. సమస్య పాక్షికంగా ఉంటే, విశ్రాంతితో సమస్య పరిష్కారమవుతుంది. ఒకవేళ చిరుగు ఎక్కువగా ఉంటే, కీహోల్ సర్జరీ చేయవలసి ఉంటుంది. ఈ సర్జరీతో సమస్య పూర్తిగా సర్దుకుంటుంది. వ్యాయామం మూలంగా కండరాలు చిరిగిపోకుండా ఉండాలంటే ఒకేసారి అధిక బరువులతో వ్యాయామం చేయకుండా బరువులను క్రమేపీ పెంచుకుంటూ పోవాలి. ఎక్కువ బరువులను బలవంతంగా వ్యాయామాలు చేయడానికి బదులుగా తక్కువ బరువులతో ఎక్కువ రిపిటీషన్స్ చేయాలి. ఇలాంటి వ్యాయామాలతో కండరాలు పెరుగుతాయి. దృఢంగా పెరుగుతాయి.

కండరాలు శ్రమకు, ఒత్తిడికీ లోనైనప్పుడు అసౌకర్యం, నొప్పులు మొదలవుతాయి. ఆయా కండరాలకు 72 గంటల పాటు విశ్రాంతిని ఇచ్చినప్పుడు అవి పూర్తిగా కోలుకుంటాయి. కానీ చాలా మంది ఉపశమనం కోసం నూనెలతో మర్దనలు మొదలుపెట్టేస్తారు. ఇలా చేయడం వల్ల కండరం మరింత ఒత్తిడికి లోనవుతుంది. కాబట్టి విశ్రాంతి, చల్లనీటి కాపడం, అవయవాన్ని ఎత్తులో ఉంచడం లాంటివి చేయాలి. వీటితో అలసిన కండరాలు స్వాంతన పొందుతాయి. ఒకవేళ అప్పటికీ నొప్పి అదుపులోకి రాకపోతే వైద్యులను కలవాలి.

కండరాల ఆరోగ్యం ఇలా...

కండరాలు ఆరోగ్యంగా ఉండాలంటే సరిపడా మాంసకృత్తులు తీసుకోవాలి. గుడ్డు తెల్లసొన, డ్రైఫ్రూట్స్, సలాడ్స్, మొలకలు క్రమం తప్పకుండా తింటూ ఉండాలి. శాకాహారులు ప్రొటీన్ కోసం సోయా ఉత్పత్తులను ఎంచుకోవచ్చు. అలాగే విటమిన్ డి3, క్యాల్షియం, శరీరానికి అవసరమైన ఖనిజలవణాలు కూడా సరిపడా అందేలా చూసుకుంటూ ఉండాలి. మరీ ముఖ్యంగా ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పరిమితంగా చేపలు తీసుకోవాలి. రెడ్ మీట్, మటన్ తగ్గించాలి. సోయా, పాల ఉత్పత్తులతో పాటు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నువ్వుల లడ్లు తింటూ ఉండాలి. వీటితో సరిపడా క్యాల్షియం దక్కుతుంది. అలాగే మధ్యాహ్న భోజనంలో సలాడ్ తప్పనిసరిగా తినాలి. ఉదయం లేదా సాయంత్రం సెనగలు, పెసలు, బొబ్బర్లు... వీటిలో ఏదో ఒక మొలకలు తినాలి. వారంలో కనీసం నాలుగు సార్లు, 30 నుంచి 35 నిమిషాల పాటు లేదా వారం మొత్తంలో 150 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి.

డాక్టర్ బాలరాజు నాయుడు,
రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్,
స్పోర్ట్స్ మెడిసిన్ అండ్ ట్రామా స్పెషలిస్ట్,
ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్ హైదరాబాద్



విటమిన్ డి లేదా చేప నూనె? ఏది మేలు?



విటమిన్ డి, చేప నూనె రెండూ ఆరోగ్యానికి మేలు చేసేవే, ఒకే విధమైన ప్రయోజనాన్ని అందించేవే! అయితే వీటిలో దేన్ని ఎంచుకోవాలి? తెలుసుకుందాం!


విటమిన్ డి మేలు : విటమిన్ డి ఎముల ఆరోగ్యానికీ, వ్యాధినిరోధకతకూ సహాయపడుతుంది. అలాగే మానసిక ఆరోగ్య మెరుగుదలలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. శరీర వాపులను తగ్గిస్తుంది. శరీరానికి అవసరమైన కాల్షియం అందించడంలో సహాయపడుతుంది. అమెరికాలో 35 శాతం మంది పెద్దలు(ముఖ్యంగా శీతాకాలంలో) విటమిన్ డి లోపంతో బాధపడుతున్నారు. విటమిన్ డి లోపం వలన ఎముకలు బలహీనపడడంతో పాటు డిప్రెషన్ ఆవహిస్తుంది. సాధారణంగా విటమిన్ డి, సూర్యరశ్మి నుంచి అందుతుందని మనకు తెలుసు. పాలు, చీజ్, గుడ్డుసొన, చేప కొవ్వుల నుంచి కూడా విటమిన్ డి అందుతుంది. అయితే సూర్యరశ్మి సరిగ్గా అందని వారు, డి విటమిన్ లోపంతో బాధపడేవారు విటమిన్ డి సప్లిమెంట్స్ వాడుకోవలసిన అవసరం ఉంటుంది. అయితే ఈ విటమిన్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల అనర్థాలు కూడా ఉన్నాయి. అధిక మోతాదు విటమిన్ డి శరీరంపై విషంలా పనిచేస్తుంది. హైపర్ కాల్సీమియా(అధిక కాల్షియం), వికారం, మూత్రపిండాల సమస్యలకు దారి తీస్తుంది.

చేప నూనె మంచిదే! : ఇది గుండె, మెదడు ఆరోగ్యానికి బాగా ఉపయోగపడుతుంది. చేపనూనె మెదడును చురుగ్గా ఉండడంతో పాటు జ్ఞాపక శక్తిని మెరుగుపరుస్తుంది. చేపనూనెలో ఓమేగా 3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచుతాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. అలాగే దీన్లో విటమిన్ ఎ కూడా అధికంగా ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగుపరుస్తుంది. చర్మ ఆరోగ్యానికి దోహదపడుతుంది. అమెరికా హార్ట్ అసోసియేషన్, వారినికి రెండు సార్లు చేపలు(వీలైతే కొవ్విన చేపలు) తినాలని సిఫార్సు చేస్తోంది. తరచూ చేపలను తినలేని వారు దానికి ప్రత్యామ్నాయంగా చేపనూనె సప్లిమెంట్లను తీసుకుంటారు. అయితే ఈ సప్లిమెంట్ల వలన జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయి.

విటమిన్ డి క్యాప్సూల్, చేపనూనె సప్లిమెంట్లు... ఈ రెండూ ఆరోగ్యానికి లాభం చేకూర్చేవే! కానీ వీలైనంత వరకూ విటమిన్లు, పోషకాలు మన శరీరానికి సహజసిద్ధంగా అందేలా చూసుకోవాలి. ఆ తర్వాత మనకున్న సమస్యను బట్టి వైద్యులను సంప్రదించి వారి సలహా మేరకు వీటిలో ఏది మన శరీరానికి అవసరమో దాన్ని సప్లిమెంట్ రూపంలో తీసుకోవాలి.

తెలుసుకుందాం

పిల్లలకు అదనపు పోషకాలు అవసరమా?



పిల్లలకు సరిపడా పోషకాలు అందాలంటే బహుళ విటమిన్ మాత్రలు వాడడం అవసరమని కొన్ని కంపెనీలు ప్రకటనలతో ఊదరకొడుతూ ఉంటాయి. అయితే ఆ మాత్రలు పిల్లలకు అవసరమా? దీని గురించి నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం..

విటమిన్ ఎ, బి- కాంప్లెక్స్, సి, డి, ఇ, కె, ఐరన్, జింక్, అయోడిన్, క్యాల్షియం మాత్రలు, గమ్మీలు, ద్రావణాల రూపంలో అందుబాటులో ఉంటాయి. సాధారణంగా వీటిని పోషకాల లోపం ఉంటేనే వాడతారు. అయితే ఇటీవల చాలా బ్రాండ్లు తమ మల్టీవిటమిన్ సప్లిమెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయనీ, మెదడును చురుగ్గా ఉంచుతాయనీ, పిల్లలకు శక్తినిస్తాయనీ ప్రచారం చేసుకుంటున్నాయి. అయితే పిల్లలకు ఇలాంటి సప్లిమెంట్లకు బదులుగా, ఆహారం ద్వారానే సరిపడా పోషకాలు అందేలా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, తృణధాన్యాలు.. వాటి ద్వారా శరీరం పోషకాలను బాగా గ్రహించుకోలదని సలహా ఇస్తున్నారు. అయితే సమతుల్య ఆహారం తినని పిల్లలు, శాకాహార పిల్లలు, దీర్ఘకాలిక రుగ్మతలు, అనారోగ్య సమస్యలు, జీర్ణకోశ వ్యాధుల బారిన పిల్లల్లో కొన్ని పోషకాల లోపం ఉండొచ్చు. అలాంటి వారికి వైద్యుల సలహా మేరకు అవసరమైన విటమిన్ సప్లిమెంట్లను అందించాలి. మల్టీవిటమిన్ సప్లిమెంట్లు శరీరానికి పోషకాలను అందిస్తాయి. అయితే వీటిని ఎక్కువ మోతాదులో తీసుకుంటే ఆరోగ్యానికి ప్రమాదకరం. ముఖ్యంగా పిల్లల్లో అధిక పోషకాలు మరింత హాని చేస్తాయి. కొవ్వులో కరిగే ఎ, డి, ఇ, కె విటమిన్లు శరీరంలో పేరుకుపోయి విషంగా మారతాయి. దీనివల్ల వికారం, తలనొప్పి, అలసటతో పాటు కొన్నిసార్లు అవయవాలు కూడా దెబ్బతింటాయి.

ఎన్‌కౌంటర్ మృతుల పార్థివదేహాలను వెంటనే బంధువులకు అప్పగించాలి

- మానవ హక్కుల వేదిక డిమాండ్
- ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి
- పౌరహక్కుల సంఘాల వినతులు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారి పార్థివదేహాలను వెంటనే బంధువులకు అప్పగించాలని కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలను మానవ హక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు ఎస్. జీవన్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి డా. ఎస్. తిరుపతయ్య సోమవారం ఒక ప్రకటన చేస్తూ ఎన్‌కౌంటర్‌లో మరణించిన అగ్రనేత నంబాల కేశవరావుతోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన సజ్జ వెంకట నాగేశ్వరరావు (రాజన్న), వన్నాడ విజయలక్ష్మి (భూమిక), గోనెగండ్ల లలిత (సంగీత), బుర్ర రాకేష్ (వివేక్) మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు ఛత్తీస్‌గఢ్ వెళ్లి నారాయణపూర్ జిల్లా పోలీసులు, ఆస్పత్రి ముందు పడిగాపులు కాస్తున్నా అప్పగించడం లేదన్నారు. భౌతిక కాయాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించే బాధ్యతను ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు తీసుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక తరపున అన్ని ప్రజాసంఘాల ప్రతినిధులు కలసి సోమవారం పలు పార్టీలకు వినతి పత్రాలు సమర్పించారు. ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, కార్యదర్శి నారాయణ రావు, చంద్రమౌళి, వెంకటయ్య, శ్రావణ్, బల్లరవి, భవాని బృందం.. హరియాణా గవర్నర్ దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లను కోరుతూ వారి కార్యాలయాల్లో వినతిపత్రం సమర్పించారు.

కేంద్రం తక్షణమే శాంతి చర్చలు జరపాలి: నారాయణ

చేవెళ్ల/హైదరాబాద్, మే 26(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే శాంతి చర్చలు జరపాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణ కేంద్రంలో రాష్ట్రస్థాయి జన సేవాదల్ శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలతో కలిసి కవ్రసాము చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. మావోయిస్టులు లేని దేశంగా మార్చుతామని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుని వారిని చంపడం సరైన విధానం కాదన్నారు. పాక్‌తో శాంతి ఒప్పందం చేసుకున్న కేంద్ర ప్రభుత్వం... దేశ పౌరులైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపదని ప్రశ్నించారు.

హక్కు ఉల్లంఘనే: శాంతి సమన్వయ కమిటీ

మృతదేహంతో గౌరవప్రదంగా వ్యవహరించాలనే హక్కును పోలీసులు ఉల్లంఘిస్తున్నారని శాంతి సమన్వయ కమిటీ పేర్కొంది. ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఏపీ, తెలంగాణకు చెందిన వారి మృతదేహాల్ని వారి బంధువులకు అప్పజెప్పకపోవడం పట్ల కమిటీ ప్రతినిధులు ప్రొ. హరగోపాల్, ప్రొ. జి.లక్ష్మణ్, డా.ఎం.ఎఫ్ గోపీనాథ్, కవితా శ్రీవాత్సవ, క్రాంతి చైతన్య, మీనా కందసామి సోమవారం ఓ ప్రకటనలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మృతదేహాలు కుళ్లిపోవడానికి ముందే వారి కుటుంబాలకు అందజేయాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి కమిటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

కేశవరావుది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే: గుమ్మడి నర్సయ్య

అరసవల్లి: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో ఉన్న నంబాళ్ల కేశవరావును అడవుల్లోకి తీసుకెళ్లి కాల్చి చంపేశారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని సీపీఐ(ఎంఎల్) నేత, మాజీ ఎమ్మెల్యే గుమ్మడినర్సయ్య ఆరోపించారు. సోమవారం ఏపీలోని శ్రీకాకుళంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మృతదేహాన్నీ బంధువులకు అప్పగించకపోవడం దుర్మార్గమని, కనీస మానవత్వం లేకుండా ప్రభుత్వం ప్రవర్తించడం దారుణమన్నారు. కగార్ నిలిపేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

అంత్యక్రియలకు అవకాశమివ్వలేదు

(మొదటిపేజీ తరువాయి)

పోలీసు హెడ్‌క్వార్టర్స్ సమీపంలోని చెట్లు, పొదల మధ్య.. అందుబాటులో ఉన్న ఎండు కర్రలను వేర్వేరుగా పేర్చి, వాటి మధ్యలో మృతదేహాలను వేసి.. కిరోసిన్‌తో నిప్పుపెట్టారు. నంబాల సహా.. మిగతా ఐదుగురు నక్సల్స్‌కు అయినవారు, బంధుమిత్రులు లేరని పేర్కొంటూ పోలీసులు ఏకపక్షంగా దహన కార్యక్రమాలను నిర్వహించారు. మృతదేహాలను అప్పగించాలని పోలీసులను కోరితే.. తమను బెదిరించారని బంధుమిత్రులు ఆరోపిస్తున్నారు. హనుమకొండ జిల్లా చింతగుట్టకు చెందిన బూర రాకేశ్ అలియాస్ వివేక్(32) మృతదేహం కోసం అతని తండ్రి బూర బాబు, కుటుంబ సభ్యులు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లారు. అయితే.. మృతదేహాలను ఇచ్చేది లేదంటూ నారాయణపూర్ పోలీసులు తేల్చిచెప్పారని వారు వాపోయారు. దాంతో మృతుల బంధుమిత్రులు నారాయణపూర్ ప్రభుత్వాస్పత్రి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అయితే.. పోలీసులు మాత్రం తాము చట్టపరంగా, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాలతో అంత్యక్రియలను నిర్వహించామని చెబుతున్నారు. "ఈ నెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది నక్సల్స్ చనిపోయారు. 20 మంది నక్సల్స్ మృతదేహాలను బంధుమిత్రులకు అప్పగించాం. కోసి అలియాస్ హంగి అనే మావోయిస్టు బంధుమిత్రులకు కూడా మృతదేహాన్ని అప్పగించాం. అయితే.. కుళ్లిపోతున్న ఆ మృతదేహం వల్ల అంటువ్యాధుల ముప్పు ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నారాయణపూర్‌లోనే అంత్యక్రియలకు అవకాశం కల్పించాలని కోరారు. మేము అందుకు అనుమతించాం. మిగతా ఆరు మృతదేహాలను చట్టపరంగా దహనం చేశాం" అని నారాయణపూర్ ఎస్పీ కార్యాలయం సోమవారం సాయంత్రం ఓ ప్రకటనను విడుదల చేసింది. అంత్యక్రియలకు సంబంధించిన వీడియోలను మీడియాకు షేర్ చేసింది. ఉద్యమం కోసం జీవితాలను త్యాగం చేసిన మావోయిస్టులకు ఇది తీవ్ర అవమానమని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఉద్దేశపూర్వకంగా మృతదేహాలను దహనం చేశారని వాపోయాయి. ముఖ్యంగా మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతదేహాన్ని అప్పగించకుండా, కుట్రపన్నాయని మండిపడ్డాయి. అడ్వొకేట్ జనరల్ కూడా చట్టప్రకారం ప్రక్రియ జరుగుతోందని ఛత్తీస్‌గఢ్ హైకోర్టుకు తెలిపినా.. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని విమర్శించాయి.



మావోయిస్టుల అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

అప్పట్లో ఎత్తుకెళ్లిన ఆయుధాలు

2010లో గవాడి(నారాయణపూర్ జిల్లా), అదే సంవత్సరం ఏప్రిల్‌లో తాడ్మెట్ల, 2017 బుర్కపాల్(సుక్మా జిల్లా)లో జరిగిన దాడుల్లో మావోయిస్టులు అపహరించిన ఆయుధాల్లో కొన్ని తాజా ఎన్‌కౌంటర్‌లో లభ్యమైనట్లు నారాయణపూర్ పోలీసులు తెలిపారు. తాజా ఎన్‌కౌంటర్‌లో మూడు ఏకే-47, నాలుగు ఎస్ఎల్ఆర్, ఆరు ఇన్సాస్, ఒక కార్బైన్, ఆరు .303 తుపాకులను, ఒక బీజీఎల్ లాంచర్, రెండు రాకెట్ లాంచర్లు, మూడు 12-బోర్ తుపాకులు, ఒక నాటు పిస్టల్, రెండు భర్మార్లు, పెద్దమొత్తంలో మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

నంబాలను సజీవంగా పట్టుకుని చంపారు

- ద్రోహుల సమాచారంతోనే ఎన్‌కౌంటర్
- ఆయన్ని కాపాడేందుకు 27మంది త్యాగం
- అయినా.. కాపాడుకోలేకపోయాం
- షెల్టర్‌జోన్‌కు వెళ్లాలన్నా వినలేదు
- దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ

అమరావతి/చర్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజును పోలీసు బలగాలు పట్టుకుని, కాల్చి చంపాయని మావోయిస్టు దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ ఆరోపించింది. విప్లవ ద్రోహుల వల్లే ఈ నెల 21న అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్ జరిగిందని కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్ పేరిట మీడియాకు ఓ లేఖ విడుదలైంది. 'భద్రతాబలగాలు నంబాలను సజీవంగా పట్టుకుని, కాల్చి చంపాయి. ఈనెల 19 నుంచి 21 వరకు భీకరపోరు జరిగింది. మావైపు 35 మంది.. 25 వేల మంది భద్రతాబలగాలున్నాయి. మమ్మల్ని 60 గంటలు చుట్టుముట్టి నిర్బంధించారు. 10 గంటల్లో 5 ఎన్‌కౌంటర్లు జరిగాయి. నంబాలను కాపాడుకునేందుకు 27 మంది నాయకులు ప్రాణ త్యాగం చేసినా ఆయన్ను మేం కాపాడుకోలేకపోయాం. ఈ ఎన్‌కౌంటర్‌లో 28 మంది మావోయిస్టులు మరణించారు. ఒక మృతదేహాన్ని మేం వెంట తీసుకెళ్లాం. మరో ఏడుగురు సురక్షితంగా బయటపడ్డారు" అని ఆ లేఖలో వికల్ప్ తెలిపారు. లొంగిపోయిన విప్లవ ద్రోహుల వల్లే ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని మండిపడ్డారు. "నంబాల రక్షణ దళంలోని ఆరుగురు కీలక వ్యక్తులు పోలీసులకు సహకరించడం వల్లే ఆయన ఉన్న ప్రాంతానికి డీఆర్జీ, ఇతర బలగాలు సులభంగా చేరుకున్నాయి. దేశచరిత్రలోనే మే 21 చీకటి రోజు. ఎన్‌కౌంటర్‌కు నిరసనగా.. అమరవీరులను స్మరించుకుంటూ.. 'షాహిద్ సంస్మరణ సభ'లను నిర్వహించాలి" అని పిలుపునిచ్చారు. నంబాల అ బూజ్‌మడ్‌లోనే ఉన్నట్లు బలగాలు, నిఘావర్గాలకు ఆర్నెల్ల ముందే తెలుసునని, పోలీసులు ఆయనను చేరుకోవడానికి లొంగిపోయిన నక్సల్స్ సహకరించారని ఆరోపించారు. "మొదట్లో నంబాలకు 60 మం దితో పటిష్ఠ భద్రత ఉండేది. ఆపరేషన్ కగార్ త ర్వాత పరిస్థితుల్లో భద్రత 35కు కుదించి వ్యూహాత్మకంగా పలువురు పోలీసుల ఎదుట లొంగిపోయేలా చేశాం. అలా లొంగిపోయిన వారిలో ఆరుగురు ద్రోహులు, యూనిఫైడ్ కమాండ్ సభ్యుడు పోలీసులకు నంబాల సమాచారమిచ్చా రు. నిజానికి 17నే బలగాలు చుట్టుముట్టాయి. అదే రోజు పీపీసీ కమిటీ సభ్యుడొకరు తన జీవిత సహచరితో కలిసి పారిపోవడంతో.. కుట్ర జరిగిందని మాకు అర్థమై.. వెంటనే శిబిరం మార్చినా.. 19న బలగాలు మాదాకా వచ్చాయి. షెల్టర్ జోన్‌కెళ్లాలని కోరినా నంబాల నిరాకరించారు. యువ నాయకత్వాన్ని కాపాడుకోవాలని ముందు నిలిచిన ఆయన్ను కాపాడుకోవడంలో మేం విఫలమయ్యాం' అని తెలిపారు. తాము శాంతి చర్చలు ప్రతిపాదించినా.. కేంద్రం సిద్ధంగా లేదన్నారు. పాక్‌తో కాల్పుల విరమణకు ఓకే అన్న కేంద్రం.. మావోయిస్టులతో విముఖతకు కారణమేంటని నిలదీశారు.

డివైడర్ దాటొచ్చి.. కారును ఢీకొట్టి..

- రాజమండ్రి వంతెనపై లారీ బీభత్సం
- నలుగురి దుర్మరణం

రాజమహేంద్రవరం, మే 26(ఆంధ్రజ్యోతి): కాకినాడలో చదువుకుంటున్న మనవరాలి పుట్టినరోజు సందర్భంగా.. ఆమెను కలిసి ఆశీస్సులు అందించేందుకు ఆ తాతయ్య, అమ్మమ్మలు.. మరో ముగ్గురితో కలిసి కారులో బయలుదేరారు. అయితే, వీరు బయలుదేరిన పది నిమిషాలకే.. మృత్యువు బొగ్గు లారీ రూపంలో ఎదురొచ్చింది. రాజమండ్రి గామన్ బ్రిడ్జి హైవేపై లారీ అదుపుతప్పి డివైడర్‌ను దాటి.. పక్క రోడ్డులో ఎదురుగా వస్తున్న వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో నలుగురు మృతి చెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలివీ.. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలానికి చెందిన ఉప్పులూరి వరప్రసాద్(60) భార్య శివలీలావతి(56)తో కలిసి కొవ్వూరులో నివాసం ఉంటూ కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వీరి కుమార్తె భవానీ ఏడేళ్లక్రితం విద్యుదాఘాతంలో మరణించింది. భవానీకి కుమార్తె భువనేశ్వరి, కుమారుడు శంకర్ ఉన్నారు. కూతురి మరణంతో మనవళ్ల సంరక్షణ భారం వీరిపై పడింది. వీళ్ల భాగస్వామ్యంతోపాటు బంధుమిత్రుల సాయంతో ఇద్దరినీ చదివిస్తున్నారు. సోమవారం భువనేశ్వరి పుట్టినరోజు. కాకినాడలో చదువుకుంటోన్న ఆమె వద్దకు ఉదయం 9గంటల సమయంలో కొవ్వూరు నుంచి కారులో బయలుదేరారు. ఆమెకు ఇష్టమైన తినుబండారాలు సిద్ధం చేసుకుని పెట్టుకున్నారు. కారులో వరప్రసాద్ దంపతులతోపాటు పక్కింటివారైన.. చాగల్లు మండలానికి చెందిన లక్కంసాని సురేశ్(అవంతి ఫీడ్స్ ఉద్యోగి), బిందు(34) దంపతులు, చాగల్లు మండలం మార్కొండపాడుకు చెందిన శివలీలావతి తల్లి ఉప్పులూరి వీరవెంకట సత్యవతి(75) ఉన్నారు. వరప్రసాద్ కారు డ్రైవింగ్‌లో ఉన్నాడు. గామన్ వంతెన హైవే రోడ్డులో ఎడమవైపు లైన్‌లో ఆటోనగర్ జంక్షన్ దగ్గర్లోకి వచ్చారు. పక్కనే కుడివైపు రోడ్డులో దివాన్‌చెరువు వైపునుంచి వచ్చే వాహనాలను ఆటోనగర్ జంక్షన్‌వద్ద రోడ్డు రవాణా అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో బొగ్గు లోడుతో విశాఖ నుంచి మహారాష్ట్ర వెళ్తున్న లారీ వస్తోంది. వాహనాల తనిఖీలు గమనించిన లారీ డ్రైవర్ కంగారులో సడెన్ బ్రేక్ వేశాడు. వాహనంలో 30 టన్నుల కుపైగా బొగ్గు లోడు ఉండడంతో వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో లారీ డివైడరును దాటి అవతలి లైన్‌లో వస్తున్న కారును ఢీకొట్టి పది మీటర్ల మేర నెట్టుకుపోయింది. చిన్న చెట్టు అడ్డు రావడంతో చెట్టుకు లారీకి మధ్య కారు నలిగిపోయింది. దీంతో కారులో ఉన్న వరప్రసాద్, సత్యవతి, బిందు ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. లీలావతి ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికి మరణించగా.. సురేశ్ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంపై రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ప్రేమ.. ప్రతీకారం.. మోసం



అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా షానియల్ డియో దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న పాన్ ఇండియా చిత్రం 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న థియేటర్లలో విడుదల కానుంది. సోమవారం ఈ చిత్రం నుంచి మేకర్స్ ఫైర్ గ్లింప్స్ విడుదల చేశారు. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ మధ్య నెలకొన్న ఉద్రిక్త క్షణాల్లో గ్లింప్స్ ప్రారంభమౌతుంది. సానుభూతితో నిండిన వాయిస్‌లో శేష్ ఆమెను 'జూలియట్' అని పిలుస్తాడు. అందరూ ఆమెకు అన్యాయం చేశారని చెబుతాడు. కానీ వెంటనే అతని స్వరం మారుతుంది. 'నేను నిన్ను మోసగించడానికి రాలేదు. అంత కంటే ఎక్కువ చేస్తా' అంటూ అనుమానాస్పద నవ్వుతో శేష్ చెప్పే డైలాగ్ అదిరిపోయింది. మరో ఎపిసోడ్‌లో.. ఖైదీ యూనిఫాంలో జైలు వ్యాన్‌లో ఉన్న శేష్ కూల్‌గా తన నోటి నుంచి ఒక కీని బయటకు తీస్తాడు. తర్వాత ఓ రైలు ఆ వ్యాన్ మీదుగా దూసుకెళ్తుంది. చివరి సన్నివేశంలో.. మృణాల్ అతని పక్కన కూర్చుంటుంది. శేష్ కాల్పులు జరుపుతాడు. మొత్తానికి గ్లింప్స్‌ని బట్టి ప్రేమ, ప్రతీకారం, మోసంతో నిండిన కథ అని అర్థమవుతోంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో నేపథ్య సంగీతం అందించారు.

సినీ థియేటర్ల బంద్‌పై విచారణ జరుగుతోంది

- ఏపీ మంత్రి కందుల దుర్గేశ్



సినిమా థియేటర్ల బంద్ వ్యవహారంలో హోంశాఖ విచారణ చేస్తోందని.. నివేదిక రాగానే వివరాలు వెల్లడిస్తామని ఏపీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే నూతన ఫిల్మ్ పాలసీ తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలకు అండగా కూటమి ప్రభుత్వం ఉందన్నారు. తాము విచారణ మాత్రమే చేయమన్నామని, ఎవర్నీ అరెస్ట్ చేయమని చెప్పలేదని పేర్కొన్నారు. జూన్ 12న విడుదల కానున్న 'హరిహర వీరమల్లు' చిత్రం విషయంలోనే కొందరు ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారో తెలియాల్సి ఉందన్నారు. సినిమాల విడుదల సమయంలో టికెట్ల ధరలు పెంచాలని నిర్మాతలు తమను కలిసి అడుగుతున్నారని, అందుకు తాము అంగీకరిస్తున్నామని అన్నారు. తమ సమస్యలు తామే పరిష్కరించుకుంటామని కొందరు అహంభావంతో మాటాడడం సరైన విధానం కాదన్నారు. సినిమా ప్రజలను ప్రభావితం చేసే మాధ్యమం అని, అందువల్ల ప్రభుత్వానికి సంబంధం ఉంటుందన్నారు. సినిమాటోగ్రఫీ శాఖ నిర్వహించిన వైసీపీకి చెందిన మాజీ మంత్రి వక్రభాష్యాలు చెబుతున్నారని, సినీ పరిజ్ఞానం లేకుండా అజ్ఞానంతో మాట్లాడడం సరికాదన్నారు.

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)



పవన్ కల్యాణ్ మాకు పెద్దన్న ఆయన తిట్టినా పడతాం


దిల్‌రాజు



"కొవిడ్‌లో తప్పితే అంతకుముందెన్నడూ థియేటర్లను బంద్ చేయలేదు. 'జూన్ 1 నుంచి థియేటర్లు బంద్' అనే విషయం ప్రజల్లోకి తప్పుగా వెళ్లింది. ఈ విషయంలో చొరవ తీసుకుని వివాదానికి తెరదించిన ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌కి కృతజ్ఞతలు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రాన్ని ఆపే దమ్ము ఎవ్వరికీ లేదు. ఇకనైనా ఈ సమస్యను ముగిద్దాం" అని తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు హితవు పలికారు. థియేటర్ల బంద్ విషయంతో పాటు ఏపీ ప్రభుత్వం, సినీ పరిశ్రమ మధ్య నెలకొన్న తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. "ఏప్రిల్ 19న తూర్పు గోదావరిలోని పంపిణీదారులు, ఎగ్జిబిటర్ల మధ్య ఓ సమావేశం జరిగింది. అందులో సినిమాలు పర్సెంటేజ్ విధానంలో ఆడితే తమకు లాభదాయకంగా ఉంటుందని థియేటర్ ఓనర్స్ చెప్పారు. ప్రస్తుతం ఏడాదికి 150 సినిమాలు విడుదలవుతుంటే, 90 శాతం పర్సెంటేజీ విధానంలోనే ప్రదర్శితమౌతున్నాయి. సహజంగానే పెద్ద సినిమాలకు మొదటివారం రెంట్ ఇస్తున్నాం. ఆ తర్వాత పర్సెంటేజీ ఇస్తున్నాం. ఇది కొందరు ఎగ్జిబిటర్స్‌కు నచ్చడం లేదు. దీంతో వారు ఈ విషయంలో సమస్యలు లేవనెత్తి, అభ్యంతరం వ్యక్తం చేయడం మొదలు పెట్టారు. అలా, తూర్పు గోదావరి ఎగ్జిబిటర్స్ తమ ఆలోచనను హైదరాబాద్‌లోని ఎగ్జిబిటర్స్‌కు తెలిపారు. దీనిపై ఏప్రిల్ 26న జరిగిన గిల్డ్ మీటింగ్‌లో చర్చించాం. గిల్డ్ సమావేశ సమయానికి 'హరిహర వీరమల్లు' రిలీజ్ డేట్ ఫిక్స్ కాలేదు. కాబట్టి ఇది ఆ సినిమాకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం అనేది కరెక్ట్ కాదు. తెలంగాణలో 370 సింగిల్ స్ర్కీన్లు ఉంటే ఎస్వీసీసీ సహా మా వద్ద ఉన్నవి 30 మాత్రమే. ఏషియన్ ఫిల్మ్స్ సునీల్ నారంగ్, సురేశ్ బాబుకు 90 ఉన్నాయి. మిగిలిన వాటిని ఓనర్స్ లేదా వారికి సంబంధించిన వారు మాత్రమే నడుపుతున్నారు. 'ఆ నలుగురు' అంటూ మాపై ఇష్టమొచ్చినట్లు ప్రచారం చేస్తున్నారు. 'ఆ నలుగురి'లో నేను లేను. మా గిల్డ్ మీటింగ్ తర్వాత తెలంగాణలోని సింగిల్ థియేటర్స్ ఓనర్స్ కూడా పర్సంటేజ్ గురించి శిరీష్‌ను అడిగారు. ఆయన ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే మే 18న ఏపీ, తెలంగాణ ఎగ్జిబిటర్స్ మీటింగ్ నిర్వహించారు. ఆ రోజున మీటింగ్‌లో ఏం జరిగిందో పూర్తిగా తెలుసుకోకుండానే 'జూన్ 1 నుంచి థియేటర్స్ బంద్' అనే ప్రచారం మొదలైంది. ఈ నెల 30న జరిగే చాంబర్ ఈసీ మీటింగ్ ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకుంటారు" అని దిల్ రాజు తెలిపారు.

'నిర్మాతలంతా కలసి ఎగ్జిబిటర్లుకు సమస్యలు ఉన్నాయని అంగీకరించారు. జాయింట్ మీటింగ్‌లో ఓ పరిష్కారానికి వద్దామని నిర్ణయించుకున్నాం. ఈ నెల 24 అందుకే జాయింట్ మీటింగ్ పెట్టాం. అంతలోపే సమస్యను పవన్‌కల్యాణ్‌గారి చిత్రంపైకి డైవర్ట్ చేశారు. థియేటర్ల బంద్ విషయం పవన్‌కల్యాణ్‌గారి దగ్గరికి నెగెటివ్ కోణంలో వెళ్ళింది. అందుకే ఆయన ఆగ్రహానికి గురయ్యారు. అయినా, ఆయన తిట్టినా మేం పడతాం. పెద్దన్న స్థానంలో ఉన్న ఆయనకు ఆ హక్కు ఉంది' అన్నారు దిల్ రాజు.

రైలుపై సాహస కృత్యాలు



తేజ సజ్జా హీరోగా కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'మిరాయ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈనెల 28న సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటిస్తూ చిత్రబృందం పోస్టర్‌ని విడుదల చేసింది. తేజ సజ్జా చేతిలో మంత్ర దండం పట్టుకొని నడుస్తున్న రైలుపై నిలబడి, సాహస కృత్యాలు చేస్తుండటం ఆసక్తిని కలిగిస్తోంది.ఈ సినిమాలో తేజ సజ్జా సూపర్ యోధగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. అలాగే మంచు మనోజ్ విలన్‌గా, రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది భాషల్లో విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన తేజ సజ్జా, మంచు మనోజ్ ఫస్ట్ లుక్ పోస్టర్లు, స్పెషల్ గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి.

మంచి సందేశంతో హృదయాన్ని బరువెక్కిస్తుంది

పవన్‌ప్రభ



నూతన దర్శకుడు పవన్‌ప్రభ తెరకెక్కించిన చిత్రం 'షష్టిపూర్తి'. డాక్టర్.రాజేంద్రప్రసాద్, అర్చన, రూపేశ్, ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రల్లో నటించారు. రూపేశ్ నిర్మించారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు పవన్‌ప్రభ. "సమాజంలోని పరిస్థితులను గమనిస్తున్నప్పుడు పుట్టిన కథ ఇది. వాణిజ్యాంశాలతో ఆకట్టుకుంటూనే, మంచి సందేశంతో హృదయాన్ని బరువెక్కిస్తుంది. కథానాయకుడు రూపేశ్ ఇందులో లాయర్‌గా కనిపిస్తారు. సినిమాలోని ప్రతీ పాత్రకు ప్రాధాన్యం ఉంటుంది. కథనం సరికొత్తగా ఉంటుంది. తల్లితండ్రుల విలువను హృద్యంగా ఆవిష్కరించి, అందరినీ మెప్పించే ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఇది" అని చెప్పారు.

చిన్ని చిన్ని తప్పులేవో



'అర్థనారి' చిత్రంతో హీరోగా పరిచయమైన అర్జున్ అంబటి ఆ తర్వాత 'తెప్ప సముద్రం', 'వెడ్డింగ్ డైరీస్' చిత్రాల్లో నటించారు. ఆయన తాజా చిత్రం 'పరమపద సోపానం'. జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ కథానాయిక. దర్శకుడు పూరి జగన్నాథ్ దగ్గర శిష్యరికం చేసిన నాగ శివ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. గిడిమిట్ల శివ ప్రసాద్ నిర్మాత. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ థ్రిల్లర్ మూవీ జూలై 11న విడుదల కానుంది.ఈ సందర్భంగా 'చిన్ని చిన్ని తప్పులేవో' పాటను విడుదల చేశారు. రాంబాబు గోశాల రాసిన పాటను పృథ్వీ చంద్ర, అదితి భావరాజు పాడారు. డేవ్ జాండ్ సంగీత దర్శకుడు. ఈ చిత్రానికి గుడిమెట్ల ఈశ్వర్ సహ నిర్మాత.

రక్త పిశాచి



పూర్వజ్ స్వీయ దర్శకత్వంలో కథానాయకుడిగా నటిస్తోన్న చిత్రం 'కిల్లర్'. పూర్వజ్, ప్రజయ్ కామత్, ఏ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. తాజాగా ఈ చిత్రం నుంచి హీరోయిన్ జ్యోతి పూర్వజ్ నటించిన 'రక్తిక' క్యారెక్టర్ లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. రక్త పిశాచి పాత్రలో ఆమె భీతి గొలుపుతున్నారు. విశాల్ రాజ్, దశరథ్, చందూ, గౌతమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్, సూపర్ హీరో..ఇలాంటి అంశాలతో ఆద్యంతం ఆసక్తికరంగా సినిమా రూపుదిద్దుకుంటున్నట్లు చిత్రబృందం తెలిపింది. సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది.

స్థిరమైన వృద్ధిపై దృష్టి

ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి



న్యూఢిల్లీ: క్రమశిక్షణతో కూడిన వ్యయ నిర్వహణ, తక్కువ ఖర్చుతో డిపాజిట్ల సేకరణ, రుసుము ఆదాయ విస్తరణ ఆధారంగా స్థిరమైన రాబడుల కోసం క్రమమైన వృద్ధి నమూనాను నిర్మిస్తున్నామని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. "ఈ వ్యూహాల కలయిక మమ్మల్ని దేశంలో అతిపెద్ద బ్యాంక్‌గానే కాకుండా భవిష్యత్ దృక్పథంతో కూడిన సంస్థగా నిలబెట్టనుంది" అని ఎస్‌బీఐ వార్షిక నివేదికలో ఆయన పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌బీఐ రూ.70,901 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24లో గడించిన రూ.61,077 కోట్ల లాభంతో పోలిస్తే 16 శాతం వృద్ధి కనబరిచింది.

వార్షిక నివేదికలో ఎస్‌బీఐ చైర్మన్ ప్రస్తావించిన మరిన్ని విషయాలు..

- స్థిరమైన, రిస్క్‌ను సర్దుబాటు చేసుకోగలిగే వృద్ధిని సాధించేందుకు ఎస్‌బీఐ క్రెడిట్ అండర్ రైటింగ్, పోర్ట్‌ఫోలియో మానిటరింగ్, సంస్థాగత ముప్పుపై ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు వీలుగా ఆధునిక అనలిటిక్స్ టూల్స్‌ను ఉపయోగిస్తున్నాం.
- ఆస్తుల నాణ్యతను పెంచడంతోపాటు ఎంఎస్ఎంఈ, మౌలికం వంటి ప్రాధాన్య రంగాలకు రుణ మద్దతిచ్చేలా రంగాల వారీ రిస్క్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాం.
- కార్యనిర్వహణ దక్షత, కస్టమర్ల అనుభూతిని మరింత మెరుగుపరచడంతో పాటు స్థిరమైన మార్కెట్ ఆధిపత్యం, మానవ వనరుల సామర్థ్యాల బలోపేతం, రిస్క్‌ను సర్దుబాటు చేసుకోగలిగే వృద్ధికి మద్దతు, లాభదాయకతను పెంచుకోవడంపై ఎస్‌బీఐ దృష్టిసారించింది.

టీసీఎస్ ఏఐ.క్లౌడ్ వ్యాపార విభజన

ముంబై: ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఏఐ.క్లౌడ్ వ్యాపారాన్ని రెండుగా విభజించింది. కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ వ్యాపారాల్లో మరింత అధిక వృద్ధి లక్ష్యంగా కంపెనీ ఈ పునర్‌వ్యవస్థీకరణ చేపట్టినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. టీసీఎస్ 2023 ఆగస్టులో ఏఐ.క్లౌడ్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఏఐ.క్లౌడ్‌కు ఉప అధిపతిగా ఉన్న కృష్ణ మోహన్ ఇకపై క్లౌడ్ విభాగానికి సారథ్యం వహించనున్నారు. ఆశోక్ క్రిష్ ఏఐ గ్లోబల్ హెడ్‌గా వ్యవహరించనున్నారు. కాగా, సతీష్ భైరవన్ డేటా విభాగ గ్లోబల్ హెడ్‌గా సేవలందించనున్నారు.

మార్కెట్లకు తొలకరి పులకరింత

25,000 పైన నిఫ్టీ

ముంబై: రుతుపవనాలు అంచనాల కన్నా ముందుగా ప్రవేశించిన ఉత్సాహంలో స్టాక్ మార్కెట్ సూచీలు వారం రోజుల గరిష్ఠ స్థాయికి దూసుకుపోయాయి. కేంద్రానికి ఆర్‌బీఐ రూ.2.69 లక్షల కోట్ల భారీ డివిడెండ్ పంచడం, భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని నీతి ఆయోగ్ ప్రకటించడం, ఈయూపై 50 శాతం సుంకాల అమలును ట్రంప్ జూలై 9కి వాయిదా వేయడం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయి. మదుపరులు ఆటో, ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెంచడంతో సెన్సెక్స్ 455.37 పాయింట్ల లాభంతో 82,176.45 వద్ద ముగిసింది. ఒకదశలో సూచీ 771 పాయింట్లకు పైగా ఎగిసి 82,492 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 148 పాయింట్లు పెరిగి 25,001.15 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.3 లక్షల కోట్లు పెరిగి రూ.444.79 లక్షల కోట్లకు చేరింది.

- డాలర్‌తో రూపాయి మారకం విలువ 35 పైసలు బలపడి రూ.85.10 వద్ద ముగిసింది.
- ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.550 పెరిగి రూ.99,300కు చేరగా.. కిలో వెండి రూ.1,170 పెరుగుదలతో రూ.1,00,370కి ఎగబాకింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒకదశలో 25 డాలర్లు పెరిగి 3,332 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

గ్రో ఐపీఓ.. రూ.8,500 కోట్ల వరకు సమీకరణ

ఆన్‌లైన్ స్టాక్ బ్రోకింగ్ ప్లాట్‌ఫామ్ 'గ్రో' మాతృ సంస్థ బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్‌కు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు(డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ 70-100 కోట్ల డాలర్ల (రూ.5,950-8,500 కోట్లు) స్థాయిలో నిధులు సమీకరించే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల సమాచారం.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లాభం రూ.20.69 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఓజీఎల్) 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.448.92 కోట్ల ఆదాయంపై రూ.20.69 కోట్ల నికరలాభం ఆర్జించింది. ముందు ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 55%, లాభం 39% పెరిగాయి. ఈ త్రైమాసికంలో తాము 219 వాహనాలను డెలివరీ చేశామని, గత ఏడాది అందించిన 131 వాహనాలతో పోల్చితే ఇది 67% అధికమని కంపెనీ తెలిపింది. ఇప్పటికి మొత్తం 2,718 బస్సులను అందించినట్లు పేర్కొంది. ప్రస్తుతం తమ చేతిలో 10,022 బస్సుల సరఫరా ఆర్డర్లున్నట్టు తెలియచేసింది. మార్చి 31తో ముగిసిన ఏడాది కాలానికి ఒక్కో షేరుపై రాబడి (ఈపీఎస్) రూ.9.36 నుంచి రూ.16.92కి పెరిగినట్టు కంపెనీ సీఎండీ కేవీ ప్రదీప్ ప్రకటించారు. ఇదిలా ఉండగా 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.1801.9 కోట్ల ఆదాయంపై రూ.139.21 కోట్ల నికరలాభం ఆర్జించింది.

స్వల్పంగా తగ్గిన అరబిందో ఫార్మా లాభం

న్యూఢిల్లీ: అరబిందో ఫార్మా లాభాలు మార్చి త్రైమాసికంలో స్వల్పంగా తగ్గాయి. 2024 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.907 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించిన ఈ కంపెనీ ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో రూ.903 కోట్ల నికర లాభం నమోదు చేసింది. అయితే ఇదే సమయంలో కంపెనీ ఆదాయం మాత్రం రూ.7,580 కోట్ల నుంచి రూ.8,382 కోట్లకు చేరింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ నికర లాభం 10 శాతం వృద్ధితో రూ.3,484 కోట్లకు చేరింది. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.29,002 కోట్ల నుంచి రూ.31,724 కోట్లకు పెరిగింది. అమ్మకాలు, స్థూల లాభంపరంగా చూస్తే ఇది తమకు అత్యుత్తమ త్రైమాసికమని అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కే నిత్యానంద రెడ్డి తెలిపారు.

రోటెర్‌డ్యామ్ పోర్టుతో ఏఎం గ్రీన్ ఒప్పందం

భారత-యూరప్ మధ్య గ్రీన్ ఫ్యూయల్ కారిడార్

న్యూఢిల్లీ: ఏఎం గ్రీన్ పెద్ద ఎత్తున యూరప్ దేశాలకు గ్రీన్ అమ్మోనియా ఎగుమతులకు సిద్ధమవుతోంది. ఇందుకోసం రోటెర్‌డ్యామ్ పోర్టుతో ఒక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం ఏటా దాదాపు 100 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,500 కోట్లు) విలువైన 10 లక్షల టన్నుల హరిత అమ్మోనియా, హైడ్రోజన్ యూరప్‌కు ఎగుమతి చేసేందుకు వీలవుతుంది. రోటెర్‌డ్యామ్ రేవు అధికారులు ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తారు. ఈ ఒప్పందం ప్రకారం ఏఎం గ్రీన్ కంపెనీ యూరప్ వాయువ్య ప్రాంతంలోని కంపెనీలకు అవసరమైన హరిత నౌకా, విమాన ఇంధనాలు సరఫరా చేస్తుంది.

కాకినాడ ప్లాంటు: వచ్చే ఏడాది ద్వితీయార్ధానికల్లా కాకినాడ ప్లాంటులో హరిత అమ్మోనియా, హైడ్రోజెన్ ఉత్పత్తి ప్రారంభమవుతుందని ఏఎం గ్రీన్ ప్రకటించింది. దాదాపు రూ.12,500 కోట్ల పెట్టుబడితో కంపెనీ ఈ ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. ఇందులో తొలి దశలో ఏటా 10 లక్షల టన్నుల హరిత అమ్మోనియా ఉత్పత్తి చేస్తారు. ఈ మొత్తాన్ని దిగుమతి చేసుకునేందుకు యూరప్‌నకు చెందిన వివిధ కంపెనీలు ఇప్పటికే ఏఎం గ్రీన్ కంపెనీతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

సిమెంట్ రంగంలో మరిన్ని కొనుగోళ్లు


మూడీస్ అంచనా

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ పరిశ్రమలో కన్సాలిడేషన్ కొనసాగుతుందని మూడీస్ రేటింగ్స్ ఒక నివేదికలో తెలిపింది. చిన్న కంపెనీలే ఇందుకు లక్ష్యమవుతాయని పేర్కొంది. గత ఐదేళ్లలో టాప్-10 కంపెనీలు రూ.89,000 కోట్ల పెట్టుబడితో 14 కోట్ల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ప్రాంతీయ చిన్న కంపెనీలను కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేసింది. మార్కెట్‌పై పట్టు బిగించేందుకు అల్ట్రాటెక్, అంబుజా సిమెంట్ వంటి పెద్ద కంపెనీలు ఇక ముందు కూడా తక్కువ ఉత్పత్తి సామర్థ్య వినియోగం, అరకొర లాభాలతో పని చేసే చిన్న చిన్న కంపెనీల కొనుగోళ్లు కొనసాగిస్తాయని మూడీస్ రేటింగ్స్ అంచనా. ఒక్క దక్షిణ భారతంలోనే ఇలాంటి చిన్న కంపెనీలు 70 వరకు ఉన్న విషయాన్ని గుర్తు చేసింది.

మరింత ఉత్పత్తి సామర్థ్యం : పెరుగుతున్న గృహ నిర్మాణం, ప్రభుత్వ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో 2030 వరకు దేశంలో సిమెంట్ గిరాకీ ఏటా ఆరు నుంచి ఏడు శాతం వరకు పెరుగుతుందని అంచనా వేసింది. డిమాండ్‌ను తట్టుకునేందుకు కంపెనీలు వచ్చే ఐదేళ్లలో తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరో 30 శాతం (20 కోట్ల టన్నులు) పెంచాల్సి ఉంటుందని మూడీస్ స్పష్టం చేసింది. ఇందులో 17 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం 2028 మార్చి నాటికి అందుబాటులోకి రానుంది. 2030 నాటికి ఏర్పడే 20 కోట్ల అదనపు ఉత్పత్తి సామర్థ్యంలో 30 శాతం (ఆరు కోట్ల టన్నులు) అల్ట్రాటెక్, అంబుజా సిమెంట్ కంపెనీల ద్వారానే అందుబాటులోకి రానుంది. మరో 25 శాతం ఉత్పత్తి శ్రీ సిమెంట్, దాల్మియా భారత్ కంపెనీల ద్వారా అందుబాటులోకి వస్తుందని అంచనా.

ధరలు మరింత పైకి : మరోవైపు సిమెంట్ కంపెనీలు ధరల పెంపు ప్రారంభించాయి. వారం పది రోజుల క్రితం వరకు తెలుగు రాష్ట్రాల్లో 50 కిలోల సిమెంట్ బస్తా ధర కంపెనీని బట్టి రూ.310 నుంచి రూ.350 వరకు ఉండేది. ఇపుడది రూ.360 నుంచి రూ.400 పలుకుతోంది. గత రెండు నెలల్లో కంపెనీలు ధరలు పెంచడం ఇది రెండో సారి. ధరలు పెంచడంతో అమ్మకాలు మరింత తగ్గాయని రిటైల్ డీలర్లు చెబుతున్నారు. బస్తా సిమెంట్ ధర కనీసం రూ.400 ఉంటే తప్ప గిట్టుబాటు కాదని కంపెనీలు చెబుతున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	510
వరంగల్	512	గోదావరి	505
చిత్తూరు	603	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	117
కరీంనగర్	115	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	105
కర్నూలు	115	నెల్లూరు	110
విశాఖపట్నం	111	అనంతపురం	110
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,640 ▼	89,500 ▼	1,11,000 ▲
విజయవాడ	99,000 ▼	93,000 ▼	1,00,000 ▲
విశాఖపట్నం	98,830 ▲	89,950 ▲	1,11,000 ▲
రాజమండ్రి	97,640 ▼	89,500 ▼	1,09,000 ▲
ప్రొద్దుటూరు	96,300 ▲	88,600 ▲	99,000 ▼
ముంబై	95,810 ▲	95,430 ▲	97,400 ▲

ఇండిగోలో మరో 3.4 శాతం షేర్ల అమ్మకం

న్యూఢిల్లీ: ఇండిగో ప్రమోటర్లలో ఒకరైన రాకేశ్ గంగ్వాల్ మరో విడత షేర్ల అమ్మకానికి సిద్ధమయ్యారు. మంగళవారం తనకు, తన కుటుంబ ట్రస్టుకు ఇండిగో ఈక్విటీలో ఉన్న 13.5% వాటాలో 3.4% వాటా (1.32 కోట్ల షేర్లు) అమ్మకానికి పెడుతున్నారు. ఒక్కోటి రూ.5175 చొప్పున ఆయన, ఆయన కుటుంబ సభ్యులు ఈ షేర్లను అమ్మకానికి పెట్టారు. ఈ అమ్మకం ద్వారా గంగ్వాల్ కుటుంబానికి రూ.6,831 కోట్లు లభిస్తాయని అంచనా.

ఈక్విటీ డెరివేటివ్‌ల ముగింపునకు మంగళ లేదా గురువారం

స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సెబీ నిర్దేశం

అన్ని స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లోనూ ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు ఒకే రోజున జరిగేందుకు సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు మంగళవారం లేదా గురువారాన్ని ఎంచుకోవాలని ఎక్స్ఛేంజ్‌లను సెబీ నిర్దేశించింది. ఈ జూన్ 15 కల్లా ఎక్స్ఛేంజ్‌లు తమ ప్రతిపాదనను పంపాలని కోరింది. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో ఎఫ్ అండ్ ఓ కాంట్రాక్టుల ముగింపు రోజు గురువారం కాగా.. బీఎస్ఈలో మంగళవారంగా ఉంది.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ — లఖ్‌నవూ x బెంగళూరు — వేదిక: లఖ్‌నవూ — రా.7.30 నుంచి

పారా అథ్లెట్ మహేంద్ర ప్రపంచ రికార్డు



న్యూఢిల్లీ: భారత పారా అథ్లెట్ మహేంద్ర గుర్జార్ పురుషుల జావెలిన్ ఎఫ్ 42 విభాగంలో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న వరల్డ్ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీలో భాగంగా జావెలిన్‌ను 61.17 మీటర్ల దూరం విసిరిన 27 ఏళ్ల మహేంద్ర నూతన రికార్డుతో స్వర్ణం సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో 2022లో బ్రెజిల్ త్రోయర్ రాబెర్టో ఫ్లోరియాని 59.19 మీటర్ల దూరంతో నమోదు చేసిన గత ప్రపంచ రికార్డ్‌ను గుర్జార్ తిరగ రాశాడు. ఇక..పురుషుల ఎఫ్64 జావెలిన్ త్రోలో రెండుసార్లు పారాలింపిక్స్ స్వర్ణ పతక విజేత సుమిత్ అంటిల్ (72.35 మీటర్లు) స్వర్ణం చేజిక్కించుకున్నాడు.

తేజస్వినికి స్వర్ణం



సుహ్ల్ (జర్మనీ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ వరల్డ్‌కప్‌లో హరియాణా షూటర్ తేజస్విని పసిడి పతకంతో మెరిసింది. సోమవారం ఇక్కడ జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో 31 పాయింట్లు సాధించిన తేజస్విని ప్రథమ స్థానంలో నిలిచింది. అలీనా నెస్ట్‌యారోవిచ్ (తటస్థ అథ్లెట్) రజతం, మిరియం (హంగేరి) కాంస్యం సాధించారు. ఈ పోటీల్లో భారత్‌కిది మూడో స్వర్ణం కాగా.. మొత్తంగా 11వ పతకం. ఈ మెడల్‌తో చైనాను వెనక్కి నెట్టి వరల్డ్‌కప్ పతకాల పట్టికలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంది.

బరిలో సాత్విక్ జోడీ

నేటి నుంచి సింగపూర్ ఓపెన్



సింగపూర్: ఫిట్‌నెస్ సమస్యలతో కొన్ని టోర్నీలకు దూరమైన భారత డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి.. సింగపూర్ ఓపెన్‌లో రీఎంట్రీ ఇవ్వనున్నారు. మంగళవారం నుంచి జరిగే టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో మలేసియాకు చెందిన చూంగ్ హాన్ జియాన్-హైకల్ జంటతో సాత్విక్ జోడీ తలపడనుంది. కిడాంబి శ్రీకాంత్ ఈ టోర్నీ నుంచి తప్పుకొన్నా.. ప్రణయ్, లక్ష్య సేన్, ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జ్ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్, మాళవిక బన్సోడ్, పీవీ సింధు, ఉన్నతి హుడా, అనుపమ బరిలోకి దిగనున్నారు. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్, కవిప్రియ-సిమ్రన్, అమృత-సోనాలి, మిక్స్‌డ్‌లో రుత్విక శివాని-రోహన్, తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జంటలు ఆడనున్నాయి.

ఇన్‌స్టాలో అమ్మాయితో అర్ష్‌దీప్ చాటింగ్!



వైరల్‌గా మారిన స్క్రీన్‌షాట్లు

న్యూఢిల్లీ: టీమిండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ సోషల్‌మీడియా వివాదంలో చిక్కుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ అమ్మాయితో అర్ష్‌దీప్ చాట్ చేసినట్టుగా ఉన్న స్క్రీన్‌షాట్లతో కూడిన వీడియో ఒకటి బయటికొచ్చింది. సదరు అమ్మాయితో అర్ష్‌దీప్ వ్యక్తిగత సంభాషణ చేసినట్లున్న ఆ సందేశాల్లో అసభ్యపదజాలం లేదు కానీ, ఆ స్క్రీన్‌షాట్ల వీడియో మాత్రం వైరల్‌గా మారింది. ఈ చాటింగ్‌పై సోషల్‌మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 26 ఏళ్ల అర్ష్‌దీప్ ప్రస్తుతం ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున ఆడుతున్నాడు.

వావ్..పంజాబ్

- క్వాలిఫయర్-1కు అయ్యర్ సేన
- అదరగొట్టిన ఆర్య, ఇంగ్లిస్
- 7 వికెట్లతో ముంబై చిత్తు



జైపూర్: ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్.. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో టాప్-2 బెర్త్‌ను ఖరారుచేసుకొంది. జోష్ ఇంగ్లిస్ (42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 73), ప్రియాన్ష్ ఆర్య (35 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62) అర్ధ శతకాలతో అదరగొట్టడంతో..సోమవారం జరిగిన కీలక మ్యాచ్‌లో పంజాబ్ 7 వికెట్లతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 184/7 స్కోరు చేసింది. సూర్యకుమార్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 57) హాఫ్ సెంచరీ చేయగా.. రికెల్టన్ (27), హార్దిక్ (26), రోహిత్(24) పర్వాలేదనిపించారు. అర్ష్‌దీప్, జాన్సెన్, వైశాక్ తలో 2 వికెట్లు తీశారు. ఛేదనలో పంజాబ్ 18.3 ఓవర్లలో 187/3 స్కోరు చేసి గెలిచింది. శ్రేయాస్ (26 నాటౌట్) రాణించాడు. శాంట్నర్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఇంగ్లిస్ నిలిచాడు.

సునాయాసంగా..: ఛేదనలో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (13) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. ఆర్య, ఇంగ్లిస్ రెండో వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపు బాటలో నిలిపారు. ముంబై పేసర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పవర్‌ప్లేలో పంజాబ్ 47/1తో నిలిచింది. వీరిద్దరూ 12వ ఓవర్‌లో అర్ధ శతకాలు పూర్తి చేసుకొన్నారు. అయితే, 15వ ఓవర్‌లో ఆర్యను అవుట్ చేసిన శాంట్నర్.. వీరి భాగస్వామ్యాన్ని విడదీశాడు. చివరి 5 ఓవర్లలో పంజాబ్ విజయానికి 39 పరుగులు కావల్సి ఉండగా.. ఇంగ్లిస్, శ్రేయాస్ అయ్యర్ 28 పరుగుల భాగస్వామ్యంతో వేగంగా ముగించే ప్రయత్నం చేశారు. 15 బంతుల్లో 14 పరుగులు అవసరపడగా.. ఇంగ్లిస్‌ను శాంట్నర్ ఎల్బీ చేశాడు. కానీ, రెండు సిక్స్‌లు బాదిన అయ్యర్.. మరో 9 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించాడు.

ఆదుకొన్న సూర్య: సూర్యకుమార్ అర్ధ శతకంతో ఆదుకోవడంతో.. ముంబై పోరాడగలిగే స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి ఓపెనర్లు రికెల్టన్, రోహిత్ శర్మ తొలి వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యంతో నిలకడైన ఆరంభాన్నిచ్చారు. ఆరో ఓవర్‌లో రికెల్టన్‌ను జాన్సెన్ క్యాచవుట్ చేశాడు. 9వ ఓవర్‌లో జేమిసన్ బౌలింగ్‌లో సూర్య 6,4,4 బాదినా.. ఆ తర్వాతి ఓవర్‌లో బ్రార్ బౌలింగ్‌లో వదేరా అద్భుత క్యాచ్‌తో రోహిత్ వెనుదిరిగాడు. దీంతో రెండో వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తిలక్ వర్మ (1), విల్ జాక్స్ (17) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఈ దశలో హార్దిక్ పాండ్యా కొంత ఊపుతెచ్చాడు. డకౌటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకొన్న పాండ్యా.. ఆ తర్వాత స్కోరువేగం పెంచే ప్రయత్నం చేశాడు. కానీ, 17వ ఓవర్‌లో జాన్సెన్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన హార్దిక్.. ఆ తర్వాతి బంతికే వెనుదిరిగాడు. చివరి మూడు ఓవర్లలో సూర్య, నమన్(20) ఆరో వికెట్‌కు వేగంగా 31 పరుగులు జోడించడంతో.. ముంబై స్కోరు 180 దాటింది. 19వ ఓవర్‌లో వైశాక్ బౌలింగ్‌లో నమన్ రెండు సిక్స్‌లు, సూర్య రెండు బౌండ్రీలు సాధించడంతో మొత్తం 23 రన్స్ లభించాయి. ఆఖరి ఓవర్‌లో నమన్, సూర్యను అర్ష్‌దీప్ అవుట్ చేశాడు.

స్కోరుబోర్డు

ముంబై: రికెల్టన్ (సి) అయ్యర్ (బి) జాన్సెన్ 27, రోహిత్ (సి) వదేరా (బి) బ్రార్ 24, సూర్య (ఎల్బీ) అర్ష్‌దీప్ 57, తిలక్ (సి) అర్ష్‌దీప్ (బి) వైశాక్ 1, జాక్స్ (సి) జాన్సెన్ (బి) వైశాక్ 17, హార్దిక్ (సి) ఇంగ్లిస్ (బి) జాన్సెన్ 26, నమన్ (సి) ఆర్య (బి) అర్ష్‌దీప్ 20, శాంట్నర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 184/7; వికెట్ల పతనం: 1-45, 2-81, 3-87, 4-106, 5-150, 6-181, 7-184; బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-28-2, జేమిసన్ 4-0-42-0, జాన్సెన్ 4-0-34-2, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-36-1, వైశాక్ 4-0-44-2.

పంజాబ్: ప్రియాన్ష్ (సి) సూర్య (బి) శాంట్నర్ 62, ప్రభ్‌సిమ్రన్ (సి) అశ్వని కుమార్ (బి) బుమ్రా 13, ఇంగ్లిస్ (ఎల్బీ) శాంట్నర్ 73, శ్రేయాస్ (నాటౌట్) 26, నేహల్ (నాటౌట్) 2, ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 18.3 ఓవర్లలో 187/3; వికెట్ల పతనం: 1-34, 2-143, 3-171; బౌలింగ్: బౌల్ట్ 3.3-0-36-0, దీపక్ చాహర్ 3-1-28-0, బుమ్రా 4-0-23-1, శాంట్నర్ 4-0-41-2, హార్దిక్ 2-0-29-0, అశ్వని కుమార్ 1-0-16-0, విల్ జాక్స్ 1-0-11-0.

'టాప్-2' లక్ష్యంగా..

నేడు లఖ్‌నవూతో ఆర్‌సీబీ పోరు

లఖ్‌నవూ: ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో చోటే కాకుండా టాప్-2లో నిలవాలని ప్రతీ జట్టు భావిస్తుంటుంది. ఎందుకంటే వీటి మధ్య జరిగే క్వాలిఫయర్1లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు వెళ్లడంతో పాటు ఓడిన టీమ్‌కు మరో చాన్స్ ఉంటుంది. ఇక.. ముంబైపై గెలుపుతో 19 పాయింట్లతో పంజాబ్ అగ్రస్థానంలో నిలిచింది. క్వాలిఫయర్1లో ఆ జట్టుతో పోటీ పడేందుకు ఆర్‌సీబీ ఉవ్విళ్లూరుతోంది. అయితే అంతకంటే ముందు మంగళవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగే మ్యాచ్‌లో పటీదార్ సేన కచ్చితంగా గెలవాల్సిందే. లేకపోతే 18 పాయింట్లతో ఉన్న గుజరాత్ టైటాన్స్ రెండో స్థానం దక్కించుకుంటుంది. లఖ్‌నవూ తమ చివరి మ్యాచ్‌లో టైటాన్స్‌ను చిత్తుగా ఓడించి ఊపు మీదుంది. బెంగళూరు మాత్రం సన్‌రైజర్స్‌పై రెండు విభాగాల్లోనూ నిరాశపరిచింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
పంజాబ్	14	9	4	1	19	0.372
గుజరాత్	14	9	5	0	18	0.254
బెంగళూరు	13	8	4	1	17	0.255
ముంబై	14	8	6	0	16	1.142
ఢిల్లీ	14	7	6	1	15	0.011
హైదరాబాద్	14	6	7	1	13	-0.241
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	14	5	7	2	12	-0.305
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	14	4	10	0	8	-0.647

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్వియటెక్ సులువుగా..

రెండో రౌండ్‌లో ప్రవేశం

- అల్కారజ్ కూడా..
- టేలర్ ఫ్రిట్జ్‌కు షాక్
- ఫ్రెంచ్ ఓపెన్



పారిస్: డిఫెండింగ్ చాంపియన్స్ ఇగా స్వియటెక్, కార్లోస్ అల్కారజ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో శుభారంభం చేశారు. సోమవారం జరిగిన మహిళల తొలి రౌండ్‌లో ఐదో సీడ్ స్వియటెక్ 6-3, 6-3తో రెబెక్కా స్కమ్‌కోవాను ఓడించింది. గంటా 24 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో స్వియటెక్ 25 విన్నర్లు సంధించగా, నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసింది. ఇక గతేడాది యూఎస్ ఓపెన్ సెమీస్‌కు చేరిన తొమ్మిదో సీడ్ ఎమ్మా నవర్రో 0-6, 1-6తో అన్‌సీడెడ్ బౌజాస్ చేతిలో, నవోమి ఒసాక 7-6, 1-6, 4-6తో పాలా బడోసా చేతిలో ఓడారు. అలాగే ఎమ్మా రడుకాను, ఎలెనా రిబకినా తమ ప్రత్యర్థులపై నెగ్గి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. పురుషుల విభాగంలో రెండో సీడ్, స్పెయిన్ స్టార్ అల్కారజ్ 6-3, 6-4, 6-2తో జెప్పిరిపై గెలిచాడు. ఏడో సీడ్ కాస్పర్ రూడ్ 6-3, 6-4, 6-2తో అల్బర్ట్ రామోస్‌పై నెగ్గాడు. అయితే ప్రపంచ నాలుగో ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్ తొలి రౌండ్‌లోనే కంగుతిన్నాడు. జర్మనీ ఆటగాడు డానియెల్ అల్ట్‌మెర్ 7-5, 3-6, 6-3, 6-1తో అతడిపై గెలిచాడు. మాజీ చాంపియన్ స్టాన్ వావ్రింకా 6-7, 3-6, 2-6తో జేకబ్ ఫెన్లీ చేతిలో ఓడాడు. 20వ సీడ్ సిట్సిపాస్ 7-5, 6-3, 6-4తో టోమస్‌పై నెగ్గి రెండో రౌండ్ చేరారు.

గంగూలీ సోదరుడికి తప్పిన ప్రాణాపాయం

పూరీ: బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడు స్నేహాశీష్ గంగూలీ, అతడి భార్య అర్పితలకు సముద్రంలో పెను ప్రమాదం తప్పింది. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి అన్న అయిన స్నేహాశీష్.. భార్యతో కలిసి గత శనివారం ఒడిశాలోని పూరీకి విహారయాత్రకు వెళ్లాడు. అక్కడి సముద్ర తీరంలో బోటింగ్ చేస్తుండగా భారీ అలల కారణంగా వీరి స్పీడ్ బోట్ బోల్తా పడింది. దీంతో ఈ దంపతులను గమనించిన అక్కడి ఫిషర్‌మెన్, లైఫ్‌గార్డ్స్ వెంటనే వారిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఇది తమకు రెండో జీవితం లాంటిదని, ఆ జగన్నాథుడే కాపాడినట్టు స్నేహాశీష్ భావోద్వేగానికి గురయ్యాడు. కాగా మొదటి భార్యకు విడాకులిచ్చిన స్నేహాశీష్ (60) గతేడాది జులైలో అర్పితను రెండో పెళ్లి చేసుకున్నాడు.

ప్రియాంక్ గుడ్‌బై



అహ్మదాబాద్: గుజరాత్ మాజీ కెప్టెన్ ప్రియాంక్ పాంచల్ (35) కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించిన ప్రియాంక్.. భారత్-ఎ జట్టుకు సారథ్యం వహించాడు. టీమిండియాకు రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపికైనా ఆడే అవకాశం మాత్రం దక్కలేదు. 17 ఏళ్ల కెరీర్‌లో 127 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 45.18 సగటుతో 8,856 పరుగులు సాధించాడు. 97 లిస్ట్-ఎ మ్యాచ్‌లు, 59 టీ20లు ఆడాడు. 2016-17 సీజన్‌లో గుజరాత్‌ను రంజీ విజేతగా నిలబెట్టడంలో ప్రియాంక్ కీలకపాత్ర పోషించాడు. విజయ్ హజారే ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ టైటిళ్లు గెలిచిన గుజరాత్ జట్టులో సభ్యుడు.

వరల్డ్ యూత్ ఆర్చరీ పోటీలకు ముగ్గురు తెలుగోళ్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచ యూత్ ఆర్చరీ పోటీలకు ముగ్గురు తెలుగోళ్లు అర్హత సాధించారు. పుణెలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ ట్రయల్స్‌లో భీమవరం ఆర్చర్లు గణేష్, సూర్యహంసిని, పెద్దపల్లికి చెందిన చికితరావు సత్తా చాటారు. ఈ ప్రదర్శనతో వీరు ఆగస్టులో కెనడా వేదికగా జరిగే ప్రపంచ యూత్ ఆర్చరీ పోటీలకు అర్హత సాధించారు. గణేష్, చికిత.. జూన్‌లో సింగపూర్‌లో జరిగే ఆసియా కప్ స్టేజ్-2 పోటీలకు కూడా బెర్త్‌లు దక్కించుకున్నారు.


పచితి పాల్


సబితి క్రాంతి


తాతిపూడి నితీష్


ఎలుమర్తి సాయి


కులపాక రోహిత్


ఎలిపే మహేష్


వడ్డే మహేష్


వడ్డే రాజేష్

గోదావరి 'లంక'లో ఘోరం

- స్నానానికి దిగిన 8 మంది యువకుల గల్లంతు
- అంతా కాకినాడ, కోనసీమ వాసులే.. 21 ఏళ్లలోపువారే

కాకినాడ, మే 26(ఆంధ్రజ్యోతి): గోదావరిలో ఘోరం జరిగింది. సరదాగా స్నానానికి వెళ్లిన 8 మంది యువకులు నదిలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కమినిలంక వద్ద ఈ ఘోర దుర్ఘటన జరిగింది. గల్లంతైనవారంతా 21 ఏళ్లలోపు యువకులే. వీరి ఆచూకీ కోసం కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. సోమవారం అర్ధరాత్రి వరకు ఎస్డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్లతో గాలింపు ముమ్మరం చేశారు. కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం శేరులంకలో సోమవారం కొండేపూడి నాగరాజు ఇంట ఓణీ వేడుక జరిగింది. దీనికి కాకినాడ, ఐ.పోలవరం, శేరులంకకు చెందిన యువకులు వచ్చారు. మధ్యాహ్నం 3గంటలకు అరకిలోమీటరు దూరంలో ఉన్న ముమ్మిడివరం మండలం కమినిలంక వద్ద ఉన్న గౌతమీగోదావరి నది వద్దకు స్నానానికి వెళ్లారు. 11మంది యువకులు సరదాగా స్నానం చేస్తూ మొదట్లో లోతు తక్కువగా ఉండడంతో మరికొంత లోపలికి వెళ్లారు. లోతు అధికంగా ఉండడంతో ప్రవాహ ఉధృతికి ఇద్దరు కొట్టుకుపోయారు. వారిని కాపాడేందుకు మరో ముగ్గురు ప్రయత్నించి వారూ కొట్టుకుపోగా వారిని కాపాడేందుకు మరో ముగ్గురు ప్రయత్నించి.. వారు సైతం ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయారు. ఇలా 8 మంది గల్లంతయ్యారు. వారితోపాటే నదిలో దిగిన మరో ముగ్గురు ప్రాణాలు దక్కించుకున్నారు. గల్లంతైన వారిలో కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన సబిత క్రాంతి ఇమ్మానియేలు(19), సబిత పాల్(18), తాతిపూడి నితీష్(18), ఎలుమర్తి సాయి (18), మండపేటకు చెందిన కులపాక రోహిత్ (18), కె.గంగవరం మండలం శేరిలంక ప్రాంతానికి చెందిన ఎలిపే మహేష్ (14), ఐ.పోలవరం మండలం ఎర్రగరువుకు చెందిన అన్నదమ్ములు వడ్డే మహేష్(16), వడ్డే రాజేష్(14) ఉన్నారు. వీరి కోసం గౌతమీ గోదావరి నదిలో గాలిస్తున్నారు. గల్లంతైన క్రాంతి, పాల్ కాకినాడలోని జగన్నాథపురం చర్చి పాస్టర్ తనయులుగా గుర్తించారు. ప్రాణాలు కాపాడుకున్న యువకులు పోలీసులకు ఇచ్చిన సమాచారంతో కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గజఈతగాళ్లతో యానాం వరకు గోదావరిలో గాలించారు. జిల్లా మంత్రి సుభాష్ ఆదేశాలతో కలెక్టర్.. ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పిలిపించారు. జనరేటర్ల సాయంతో అర్ధరాత్రి వరకు గాలింపు చర్యలు కొనసాగించారు.

సీఎం, డిప్యూటీ సీఎం దిగ్భ్రాంతి..

8 మంది యువకులు గల్లంతైన ఘటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను ఫోన్‌లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు.

ఘనంగా 'బ్యూటీ విత్ ఏ పర్పస్' గాలా

- 'మేఘా' సుధారెడ్డి నివాసంలో నిర్వహణ
- హాజరైన మిస్ వరల్డ్ పోటీదారులు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): మేఘా కృష్ణారెడ్డి సతీమణి, సుధారెడ్డి ఫౌండేషన్ అధినేత్రి సుధారెడ్డి సోమవారం రాత్రి మిస్ వరల్డ్ పోటీదారుల కోసం ప్రత్యేకంగా 'బ్యూటీ విత్ ఏ పర్పస్' గాలాను నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన ఈ గాలాలో మిస్ వరల్డ్ పోటీదారులతో పాటు మిస్ వరల్డ్ సంస్థ చైర్‌పర్సన్ జులియా మోర్లీ, దేశంలోని రాజ కుటుంబాల ప్రతినిధులు రాధిక రాజే గైక్వాడ్ (బరోడా), కున్వరాణి రీతూ అజాతశత్రు సింగ్ (జమ్మూ కశ్మీర్), కృష్ణకుమారి (జోద్‌పూర్), పూజా పద్మరాజే పట్వర్ధన్ (సాంగ్లీ), పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌తో పాటు ప్రముఖ సామాజిక ఉద్యమకారులు పాల్గొన్నారు. తెలంగాణతో పాటు భారతీయ వంటకాలు, సంగీతం, సంస్కృతిని తెలియజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని సుధారెడ్డి తెలిపారు. ఒకవైపు తెలంగాణ వంటకాల ఘుమఘుమలు, మరోవైపు తబలా కచేరీ అలరించాయి.


తమ నివాసంలో నిర్వహించిన 'బ్యూటీ విత్ ఏ పర్పస్ గాలా'లో సుధారెడ్డి, సుందరీమణులు

రుతుపవనాలొచ్చాయ్!

రోళ్లు పగిలే రోహిణి కార్తెలోనే నైరుతి.. 15 రోజుల ముందే రాష్ట్రానికి రాక

- ఒకట్రెండు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరణ
- బంగాళాఖాతంలో నేడు అల్పపీడనం
- నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతాంగానికి చల్లని కబురు ముందుగానే అందింది. సాధారణంగా రోహిణి కార్తెలో రోళ్లు పగిలేలా ఎండలు కొడతాయంటారు. కానీ ఈసారి భిన్న వాతావరణం నెలకొని నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకాయి. సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను నైరుతి రుతుపవనాలు తాకినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఏటా ఐఎండీ అంచనాల మేరకు జూన్ 10నాటికి రాష్ట్రానికి నైరుతి రుతుపవనాలు వచ్చేవి. కానీ ఈసారి పక్షం రోజులు ముందుగానే రాష్ట్రాన్ని నైరుతి పలకరించింది. ఒకటి రెండు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరించే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. అలాగే ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలకు కూడా రుతుపవనాలు విస్తరించినట్లు పేర్కొంది. ఇక దక్షిణ మధ్య బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు ఉపరితల ద్రోణి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. ద్రోణికి తోడు నైరుతి రుతుపవనాల రాకతో అనుకూల వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయి. మంగళ, బుధవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ రెండు రోజులకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తూ ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. పెద్దపల్లి, వరంగల్, కరీంనగర్, హనుమకొండ, జనగాం, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. మరోవైపు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో గరిష్ఠంగా 38.2, కనిష్ఠంగా నారాయణపేట జిల్లా గుండ్మల్‌లో 33 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గతేడాది ఇదే రోజు జగిత్యాల జిల్లా ఎండపల్లిలో అత్యధికంగా 45.6 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో సోమవారం అరగంట కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. ఆఫీసులు ముగించుకొని ఉద్యోగులు ఇళ్లకు వెళ్లేసమయంలో భారీ వర్షం కురవడంతో బంజారాహిల్స్, మాదాపూర్, కొండాపూర్, ఎర్రగడ్డ, అమీర్‌పేట, పంజాగుట్ట, సోమాజిగూడ ప్రాంతాల్లో ట్రాఫిక్‌జాంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. పటాన్‌చెరువు, బహదూర్‌పుర, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్ ప్రాంతాల్లో 1 సెం.మీ వర్షం కురిసింది. నగరంలో మరో రెండురోజులు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందన్వెల్లిలో 81.3 మి.మీ వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. కులకచర్ల మండలంలోని తిరుమలాపూర్, ముజాహిద్‌పూర్ కేంద్రాల్లో తూకం వేయని, వేసిన ధాన్యం బస్తాలు తడిశాయి. కొన్ని బస్తాలు మెలకెత్తాయి. కొడంగల్ మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిల్వ ఉంచిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఇబ్బందులు పడ్డారు.


వర్షం కురుస్తుండటంతో ఎర్రగడ్డ మెట్రోస్టేషన్ కింద నిలిచిన వాహనాలు

ఏపీలోకి 'నైరుతి'...

నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. ఈ నెల 13న అండమాన్‌కు వచ్చిన రుతుపవనాలు 24న కేరళను తాకాయి. అనూహ్యంగా సోమవారమే రాయలసీమ ప్రాంతంలోకి ప్రవేశించాయి. సాధారణంగా జూన్ ఐదో తేదీనాటికి రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో రుతుపవనాలు ప్రవేశించాల్సి ఉంది. అయితే ఈ ఏడాది అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో అనుకూల వాతావరణం నెలకొనడంతో పది రోజుల ముందుగానే వచ్చాయి. గత ఏడాది జూన్ రెండో తేదీన రాయలసీమ, దక్షిణ కోస్తాల్లోకి రుతుపవనాలు ప్రవేశించాయి.

ఈసెట్ ఫలితాల్లో సత్తాచాటిన సిద్దిపేట విద్యార్థినులు


ఈసెట్ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన రేవతి, నవ్య

మిరుదొడ్డి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆదివారం విడుదలైన తెలంగాణ ఈసెట్ ఫలితాల్లో సిద్దిపేట జిల్లా విద్యార్థినులు సత్తాచాటారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రేవతి ఈసీఈలో 200 మార్కులకు గాను 164 మార్కులు సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన నవ్య 161మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. అంతేకాకుండా ఏపీ ఈసెట్ ఫలితాల్లోనూ వీరే ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించడం విశేషం.

నమాజ్ ఘటనలో ఫొటోగ్రాఫర్‌పై కేసు

తిరుమల, మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా ఇతర మతానికి చెందిన వ్యక్తి నమాజ్ చేసిన ఘటనలో తిరుమలకు చెందిన ఓ ప్రైవేట్ ఫొటోగ్రాఫర్‌పై కేసు నమోదైంది. ఈనెల 22వ తేదీన చెన్నైకు చెందిన అబ్బాస్ అనే వ్యక్తి తిరుమలలోని కల్యాణవేదికలో నమాజ్ చేయగా, దాని వీడియో విపరీతంగా వైరల్ అయిన విషయం తెలిసిందే. దీంతో టీటీడీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజిలెన్స్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేసిన క్రమంలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కల్యాణ వేదికలో ఫొటో స్టూడియో లైసెన్స్‌తో ఫొటోగ్రాఫర్‌గా ఉన్న గోవర్ధన్ అనే వ్యక్తి వద్దకు అబ్బాస్ వెళ్లి.. ఇక్కడ నమాజ్ చేయవచ్చా అని అడిగిన క్రమంలో, చేసుకోవచ్చని అతడు చెప్పినట్టు పోలీసు విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో గోవర్ధన్‌పై తిరుమల టూటౌన్‌లో కేసు నమోదైంది. అలాగే అతడి లైసెన్సును సీజ్ చేశారు.

ప్రతి నూలు పోగుకూ ఓ కథ..!

- చేనేత వస్త్రాలు.. దారాలతో అల్లిన అద్భుత కథనాలు
- ప్రపంచంలో ఎక్కడా లేని ఆవిష్కరణలు ఇక్కడ చూశా
- నా డిజైన్లలో తెలంగాణ వస్త్రాల పాత్ర ఎంతో కీలకం
- 'ఆంధ్రజ్యోతి'తో 'మిస్ వరల్డ్-25' డిజైనర్ అర్చనా కొచ్చర్

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): 'ఒక అందమైన వస్త్రం.. దాన్ని ధరించిన వారి అందాన్ని మరింత పెంచుతుంది. తెలంగాణ చేనేత వస్త్రాలు మాత్రం అందంతోపాటు ఆత్మవిశ్వాసాన్నీ పెంచుతాయి' అని ప్రముఖ అంతర్జాతీయ దుస్తుల డిజైనర్ అర్చనా కొచ్చర్ అన్నారు. గత ఏడాది ముంబైలో జరిగిన మిస్ వరల్డ్ పోటీలకు డిజైనర్‌గా పని చేసిన ఈమె.. ప్రస్తుతం తెలంగాణ వేదికగా జరుగుతున్న పోటీలకూ అధికారిక డిజైనర్‌గా ఉన్నారు. 108 దేశాల నుంచి వచ్చిన విదేశీ ప్రతినిధులందరికీ ఇక్కడి చేనేత వస్త్రాలతో అధునాతన డిజైన్లను రూపొందిస్తూ.. తెలంగాణ కళను విశ్వవ్యాప్తం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ పోటీల్లో తెలంగాణ డిజైన్ల రూపకల్పన కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఆమె.. చేనేత కళాకారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇక్కడి కళను నిశితంగా పరిశీలించానని, కళాకారుల సృజనాత్మకతకు ముగ్ధురాలినయ్యానని సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు.

పోచంపల్లి, గద్వాల్ చీరలతో మీకు ఎలాంటి అనుబంధం ఉంది?

తెలంగాణ చేనేత సంప్రదాయాలతో నాకు ఎప్పటినుంచో పరిచయం ఉంది. ఇవి కేవలం వస్త్రాలు మాత్రమే కాదు.. దారాలతో అల్లిన అద్భుత కథనాలు. ప్రతి నూలు పోగు వెనకా ఓ కథ ఉంటుంది. పోచంపల్లి ఇక్కత్, దాని సంక్లిష్టమైన డబుల్ ఇక్కత్ కిటుకు కాలానికతీతంగా ప్రపంచాన్ని మంత్రముగ్ధులను చేస్తున్న నమూనా. కాటన్ బాడీలు, సిల్క్ బోర్డర్ల ప్రత్యేకమైన కలయికకు ప్రసిద్ధి చెందిన గద్వాల్ పట్టు.. సౌకర్యం, అద్భుతమైన కళకు ప్రతీక. మెరిసే పట్టు, గీసిన నమూనాలతో నారాయణపేట చీరలు గొప్ప సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. ఈ నేతల మెళకువలను అర్థం చేసుకోవడం నా ప్రయాణంలో ఎంతగానో ఉపయోగపడింది.

ఇక్కడి నేత వస్త్రాలను ఎప్పుడైనా మీ కలెక్షన్లలో ఉపయోగించారా?

దక్షిణ భారత హాఫ్ చీరల సొగసును ఉత్తర భారత లెహంగాల గొప్పతనంతో కలిపే ఫ్యూజన్ ఎంసెంబుల్స్‌ని రూపొందించడానికి నేను పోచంపల్లి ఇక్కత్, నారాయణపేట చీరలను ఇప్పటికే పలు మార్లు ఉపయోగించాను. మిస్ వరల్డ్-2025 కోసం నా డిజైన్లలో తెలంగాణ సంప్రదాయ నేత వస్త్రాలను చేర్చే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నా.

తెలంగాణ ఫ్యాషన్ సంస్కృతిలో మీకు నచ్చిన అంశాలు?

అగ్గిపెట్టెలో ఇమిడిపోయే చీరల తయారీ నేను ఎక్కడా వినలేదు. ఇది ఇక్కడి కళాకారుల అద్భుత సృజనాత్మకతకు ప్రతీక. అలాగే చీరల తయారీలో బంగారం ఉపయోగించడం కూడా తెలంగాణ కళాకారులకు మాత్రమే సాధ్యం. ఈ విషయాన్ని నేను ప్రస్తావిస్తే అనేకమంది నమ్మలేదు. ప్రపంచంలో ఎక్కడా లేని ఆవిష్కరణలు ఇక్కడ గమనించా. తెలంగాణ ఫ్యాషన్ సంస్కృతి, సంప్రదాయం, ఆవిష్కరణలు అద్భుతం. ఇక్కడి కళాకారుల సృజన నన్నెంతగానో ఆకట్టుకుంది.

మీలాంటి డిజైనర్లు సంప్రదాయ తెలంగాణ దుస్తుల పునరుద్ధరణ లేదా ప్రపంచీకరణకు ఎలా సహాయపడగలరు?

సంప్రదాయం, ఆధునికత మధ్య అంతరాన్ని తగ్గించడంలో డిజైనర్లు కీలక పాత్ర పోషిస్తారు. సంప్రదాయ తెలంగాణ దుస్తులకు విస్తృత ప్రాచుర్యం కల్పించవచ్చు. ఉదాహరణకు పోచంపల్లి ఇక్కత్‌ను ఆధునిక పెళ్లి వేడుకల్లో పరిచయం చేయవచ్చు. నారాయణపేట చీరలను సాయంత్రం వేళ ధరించే దుస్తుల్లో చేర్చడం ద్వారా వాటిని ప్రపంచవ్యాప్తం చేయొచ్చు.


రాష్ట్ర కళాకారులు, నేత కార్మికులు అంతర్జాతీయ ఫ్యాషన్ పరిశ్రమలో ఎలాంటి పాత్ర పోషించగలరు?

తెలంగాణ కళాకారులు, నేత కార్మికులు గొప్ప వారసత్వానికి వెన్నెముకలాంటివారు. హస్తకళ, నవీన ఆవిష్కరణలపై శ్రద్ధ వారిని అంతర్జాతీయ ఫ్యాషన్ పరిశ్రమలో ముందు వరుసలో నిలుపుతుంది. ప్రపంచం కోరుకునే డిజైన్లు రూపొందించడంతోపాటు సాంకేతిక నైపుణ్యాలను పెంచుకుంటే తెలంగాణ కళాకారులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతారు.

తెలంగాణ సంప్రదాయ దుస్తులను భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించే అవకాశం ఉందా?

కచ్చితంగా ఉంది. ఇది ఇప్పటికే ప్రారంభమైంది. మిస్ వరల్డ్-2025 కోసం నేను పోచంపల్లి ఇక్కత్, నారాయణపేట చీరలు వంటి తెలంగాణ సంప్రదాయ దుస్తులను నా డిజైన్లలో గర్వంగా ప్రదర్శించా. ఈ వస్త్రాలు భారతదేశ వారసత్వాన్ని ప్రదర్శించడమేగాక ప్రపంచ వేదికపై వాటి ప్రత్యేకతను కూడా చాటాయి. మిస్‌వరల్డ్ పోటీలతో తెలంగాణ వస్త్రాలు ఇక అంతర్జాతీయ వేదికలపై తరచూ కనిపిస్తాయి. అయితే, తెలంగాణ వస్త్ర వారసత్వాన్ని ప్రోత్సహించడానికి బహుముఖ విధానం అవసరం. తొలుత ఇక్కడి ఘనమైన చరిత్రను తెలియజేయాలి. కళాకారులు, ప్రభుత్వ సంస్థల మధ్య సహకారం కీలకం.

తెలంగాణ వస్త్రాల్లో మిమ్మల్ని ప్రేరేపించే అంశాలేమిటి?

పోచంపల్లి ఇక్కత్.. శక్తిమంతమైన ఎరుపు, నలుపు, తెలుపు రంగులు నా అనేక డిజైన్లకు స్ఫూర్తిగా నిలిచాయి. గద్వాల్ పట్టులోని బంగారు జరీ పని వైభవాన్ని తెలియజేస్తుంది. ఈ అంశాలు నా డిజైన్లలో రంగులు, ఎంబ్రాయిడరీ పద్ధతులను ప్రభావితం చేస్తాయి.

ఇంత వైవిధ్యమైన పోటీల కోసం డిజైన్ చేస్తున్నప్పుడు సవాళ్లేంటి?

విభిన్న పోటీదారుల కోసం డిజైన్ చేయడం, వ్యక్తిగత ప్రాధాన్యాలను సాంస్కృతిక సున్నితత్వాలతో సమతుల్యం చేయడంలో కొన్ని సవాళ్లు ఎదురయ్యాయి. ప్రతి డిజైన్ విభిన్నంగా ఉండేలా చూడడం పెద్ద సవాలే. దీనికోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నా. యూరప్‌కు చెందిన ఒక పోటీదారు పోచంపల్లి ఇక్కత్ గౌను ధరించి.. 'ఇది చరిత్రలో ఒక భాగంలా అనిపిస్తుంది' అని వ్యాఖ్యానించడం మరపురాని క్షణం. మిస్ వరల్డ్ పోటీదారులకు డిజైనింగ్ సమయంలో భారతీయ వస్త్రాల గొప్పదనాన్ని తెలియజేస్తూ సాంస్కృతిక వైవిధ్యాన్ని చాటే డిజైన్లను రూపొందించడంపైనే ఎక్కువగా దృష్టి సారించా. చారిత్రక డిజైన్లకు సంప్రదాయ వస్త్రాలను చేర్చడంతో మిస్ వరల్డ్ ప్రతినిధులు ఎంతో సౌకర్యంగా ఉందని చెబుతున్నారు. ఇక్కడి వస్త్రాలతో పోటీదారుల్లో ఆత్మవిశ్వాసం బాగా పెరిగింది. తెలంగాణ వారసత్వ కళను ప్రపంచ వేదికపై ప్రదర్శించడం గొప్ప అవకాశంగా భావిస్తున్నా.

రాయబారం.. విఫలం!!

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లిపోయారు. అనంతరం, పార్టీ లీగల్ సెల్ బాధ్యతలు చూసే గండ్ర మోహన్‌రావు కవిత నివాసానికి చేరుకున్నారు. ఆయన కూడా కొంతసేపు మాట్లాడి.. వెళ్లిపోయారు. కేసీఆర్ పంపిన ఇద్దరు దూతలూ ఒకరి తర్వాత మరొకరు కవితతో మాట్లాడారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు మూడు గంటలపాటు ఈ సంప్రదింపుల ప్రక్రియ నడిచినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. దివికొండ దామోదర రావు, గండ్ర మోహన రావు ఇద్దరికీ కూడా కేసీఆర్ కుటుంబంతో బంధుత్వం ఉన్నట్లు పార్టీలోని సీనియర్ నేతలు చెబుతున్నారు. అందుకే వారిని సంప్రదింపుల కోసం పంపినట్లు సమాచారం.

నా సంగతేంటో తేల్చాల్సిందే..

తాజా రాజకీయ పరిణామాలు, అంతర్గత విభేదాల కారణంగా పార్టీకి జరిగే నష్టం వంటి విషయాలతోపాటు ఎవరికి వారుగా ఉంటే ఎదురయ్యే సమస్యలపై అధినేత కేసీఆర్ చేసిన సూచనలను వారు కవితకు వివరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. చర్చల్లో భాగంగా కేసీఆర్‌తోనూ ఫోన్‌లో మాట్లాడించినట్లు విశ్వసనీయ వర్గాలు వివరించాయి. పదవులు, హోదాల విషయంలో తొందరపడవద్దని ఆమెకు కేసీఆర్ సూచించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అయినా, కవిత మెత్తబడలేదని జాగృతి వర్గాల ద్వారా తెలుస్తోంది. ప్రధానంగా రెండు, మూడు అంశాలపై కవిత చాలా పట్టుదలగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కేటీఆరే ముఖ్యమంత్రి అవుతారని, అప్పుడు తన సంగతేంటని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కేటీఆర్ సీఎం అయితే పార్టీలో గానీ, ప్రభుత్వంలోని గానీ తనకు ఇచ్చే హోదా ఏమిటో ఇప్పుడే స్పష్టత ఇవ్వాలని కవిత పట్టుబట్టినట్లు జాగృతి వర్గాలు వెల్లడించాయి. ఆ స్పష్టత ముందే ఇవ్వాలని, లేకపోతే, తన దారి తాను చూసుకుంటానని ఆమె కాస్త ఘాటుగా చెప్పినట్లు సమాచారం. మొత్తంగా తాను లేవనెత్తిన పలు అంశాలపై కూడా స్పష్టత కోరినట్లు తెలిసింది. ముఖ్యంగా పార్టీలో తన ప్రాధాన్యం తగ్గించడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.



దాంతో దామోదర రావు ఆమె నివాసం నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. అనంతరం లీగల్‌సెల్ ఇన్‌చార్జి గండ్ర మోహన్ రావు కవిత నివాసానికి చేరుకున్నారు. ఆయన కూడా జరుగుతున్న పరిణామాలను కవితకు వివరించినట్లు తెలిసింది. ఈ వ్యవహారం కొలిక్కి రాకపోతే మరింత నష్టం జరిగే ప్రమాదం అటు పార్టీకి, ఇటు కుటుంబానికి ఉంటుందని నచ్చజెప్పే ప్రయత్నం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అలాగే, కేసులపరంగా కూడా కేటీఆర్‌కు ఏమీ కాదని, సాంకేతికంగా అవి కోర్టులలో నిలబడవని కవితతో అన్నట్లు తెలుస్తోంది. గండ్రతో సంప్రదింపులు జరిపిన తర్వాత కూడా కవిత ఏ మాత్రం మెత్తబడలేదని సమాచారం. చివరకు ఆయన కూడా చేసేదేమీ లేక అక్కడి నుంచి వెళ్లిపోయారు. మొత్తంగా పార్టీ అధిష్ఠానం వెంట వెంటనే ఇద్దరు దగ్గరి బంధువులను రంగంలోకి దించినా ప్రయోజనం లేకుండాపోయింది.

కొవిడ్‌పై నిరంతర నిఘా

- కొవిడ్ జీనోమ్ సీక్వెన్సీకి నమూనాలు
- ప్రతి జిల్లాకూ ర్యాపిడ్ బృందాలు
- సీసీఎంబీ, ఐసీఎంఆర్, ఎయిమ్స్ డైరెక్టర్లతో మంత్రి దామోదర భేటీ

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): కొవిడ్‌పై నిరంతరం నిఘా కొనసాగించాలని, ప్రజలకు ఈ అంశంపై నిపుణులు అవగాహన కల్పించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సీజనల్ వ్యాధుల కట్టడికి తగిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వ వైద్యసంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న కొవిడ్ కేసులు, సీజనల్ వ్యాధుల కట్టడికి ముందస్తు ప్రణాళికల్లో భాగంగా తొలిసారి కేంద్ర సంస్థల కీలక ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. సోమవారం సచివాలయంలో జరిగిన ఈ సమావేశానికి సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నందికూరి, బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ అభిషేక్ అరోరా, సెంటర్ ఫర్ డీఎన్‌ఏ, ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ డైరెక్టర్ ఉల్లాస్ కొల్తూర్ సీతారాం, ఐసీఎంఆర్ ఎన్ఐఎన్ శాస్త్రవేత్త సుదీప్ ఘోష్ హాజరయ్యారు. నిపుణులంతా భారత్ సహా ఇతర దేశాల్లో ఉన్న పరిస్థితులను మంత్రికి వివరించారు. ఇప్పటివరకు ఉన్న సమాచారం, పరిశోధనల ప్రకారం కొవిడ్‌తో ప్రస్తుతానికైతే ప్రమాదమేమీ లేదన్నారు. వివిధ దేశాల్లో అక్కడక్కడా కేసులు పెరుగుతున్నా.. ఆస్పత్రిలో చేరికలు లేవని తెలిపారు. మన రాష్ట్రంలో, దేశంలో ప్రజల్లో ఇప్పటికే హెర్డ్ ఇమ్యూనిటీ వచ్చినందున.. పెద్దగా కంగారు పడాల్సిన అవసరం లేదని నిపుణులు వివరించారు. పరిస్థితి సాధారణంగా ఉన్నందునే కేంద్ర ఆరోగ్యశాఖ కూడా ఇప్పటివరకూ ఎటువంటి అడ్వైజరీ, గైడ్‌లైన్స్ విడుదల చేయలేదని బీబీనగర్ ఎయిమ్స్ డైరెక్టర్ అభిషేక్ అరోరా చెప్పారు.


కేంద్ర ప్రభుత్వ వైద్యసంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర

జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం నమూనాలు..

కొవిడ్ జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం నమూనాలు పంపించాలని సీసీఎంబీ, సీడీఎఫ్‌డీ డైరెక్టర్లు విజ్ఞప్తి చేయగా.. మంత్రి దామోదర సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు సీసీఎంబీ, సీడీఎఫ్‌డీ, బీబీనగర్ ఎయిమ్స్, నిమ్స్ తదితర సంస్థలతో కలిసి చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి జిల్లాలోనూ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, మునిసిపల్, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ, ప్రతి గ్రామంలో, పట్టణంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డెంగీ, మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో పంచాయతీ రాజ్, మునిసిపల్ శాఖలను అప్రమత్తం చేయాలని, ఆరోగ్య శాఖ నుంచి బృందాలను పంపించి అవగాహన శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలు మొదలయ్యాయని, సీజనల్ వ్యాధులతో ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ పెరిగే అవకాశం ఉన్నందున.. అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని అన్నారు.

ఎప్పటికప్పుడు నీటి నమూనాల పరీక్షలు..

రాష్ట్రంలో వాటర్‌బోర్న్ (డయేరియా, టైఫాయిడ్), వెక్టార్ బోర్న్ (డెంగీ, మలేరియా) జబ్బుల నివారణ, నియంత్రణకు సూచనలు ఇవ్వాలని నిపుణులను మంత్రి దామోదర కోరారు. వెక్టార్‌బోర్న్ వ్యాధుల నియంత్రణ కోసం ఎప్పటికప్పుడు నీటి నమూనాలను పరీక్షించి నివేదికలు అందించాలన్నారు. ఇందుకు సీసీఎంబీ, సీడీఎఫ్‌డీ డైరెక్టర్లు సానుకూలంగా స్పందించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా నీటి నమూనాలను సేకరించి సీసీఎంబీ, సీడీఎఫ్‌డీ తదితర ల్యాబ్‌లకు పంపించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు ఆస్పత్రుల్లో పాము కాటు, తేలుకాటు ఔషధాలు, ఇంజక్షన్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సమీక్షలో ఆరోగ్యశాఖ కార్యదర్శి, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ప్రజారోగ్య సంచాలకులు రవీందర్ నాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 2 నుంచి స్లాట్ బుకింగ్ విధానం

» రిజిస్ట్రేషన్లకు 'ఆధార్-ఈ' సంతకం అమల్లోకి

» ప్రయోగాత్మకంగా కూసుమంచి, ఆర్మూర్‌లో: పొంగులేటి



హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానాన్ని జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తీసుకొస్తున్నట్లు రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా ఆధార్-ఇ సంతకం అమల్లోకి తీసుకొస్తున్నామని చెప్పారు. తొలుత ప్రయోగాత్మకంగా ఖమ్మం జిల్లా కూసుమంచి, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దీన్ని అమల్లోకి తెచ్చామని వివరించారు. సచివాలయంలో ఉన్నతాధికారులతో సోమవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అవినీతికి దూరంగా ఉంటూ.. ప్రజలకు పారదర్శకమైన సేవలను అందించాలనిఅన్నారు. ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచేలా సబ్ రిజిస్ట్రార్ల పని తీరు ఉండాలని సూచించారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై పొంగులేటి ఆగ్రహం

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నాలుగు రోజుల వ్యవధిలో 300 రిజిస్ట్రేషన్లు జరిగాయని, అందుకు బాధ్యులైన అధికారులంతా పూర్తి నివేదికతో మంగళవారం సాయంత్రం తన వద్ద హాజరు కావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారని తెలిసింది. తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 10 రిజిస్ట్రేషన్లు కూడా జరగవని, అలాంటి చోట నాలుగు రోజుల్లో 300 రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అనధికారిక డాక్యుమెంట్లను నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్ ఎలా చేశారని ప్రశ్నించినట్లు తెలిసింది. దీని వెనుకాల రాజకీయ కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో కూడా మంత్రి ఆరా తీసినట్లు సమాచారం. ఈనెల 12 నుంచి 18 మధ్యలో తాండూరుకు చెందిన అధికార పార్టీ నేత ప్రమేయంతోనే రిజిస్ట్రేషన్లు జరిగాయనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించడం రిజిస్ట్రేషన్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

పొంగులేటికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఆహ్వానం

"యాటను కోస్తాం.. జొన్న రొట్టెలు, సర్కారు అందించే సన్నబియ్యంతో భోజనం పెడతాం. మా గృహ ప్రవేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌ను తీసుకుని రండి సార్" అంటూ పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆహ్వానించారు. ఇందిరమ్మ ఇల్లు వస్తుందని కలలో కూడా అనుకోలేదని, త్వరలో నిర్మాణం పూర్తయి గృహ ప్రవేశం చేసుకుంటామని తెలిపారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయం నుంచి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

బీమాతో కార్మికుల కుటుంబాలకు భరోసా: భట్టి

» మృతి చెందిన విద్యుత్ కార్మికుడి కుటుంబానికి కోటి చెక్కు



హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమాను అమలు చేస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్) పరిధిలో విధులు నిర్వర్తిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన జోగు నరేష్ కుటుంబ సభ్యులకు రూ.కోటి చెక్కును సోమవారం ప్రజాభవన్‌లో భట్టి అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుడి కుటుంబానికి కారుణ్య నియామక ఉత్తర్వులు కూడా అందించారు. విద్యుత్ కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమా అందించడం దేశంలో ఇదే తొలిసారి అని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వంలోనే ఇది సాధ్యమైందన్నారు. తొలుత సింగరేణిలో రూ.కోటి ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టామని, ఆ తర్వాత విద్యుత్ సంస్థల్లోనూ అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. ప్రమాద బీమా పథకం కార్మికుల కుటుంబాల్లో కొత్త భరోసాను నింపుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డిని భట్టి అభినందించారు.

పీఏసీఎస్‌ల బలోపేతానికి చర్యలు: తుమ్మల



హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో కలిసి సోమవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. సహకార రంగంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని ఈ సందర్భంగా కోదండరెడ్డి కోరారు. మరోవైపు ఈనెల 29 నుంచి జూన్ 12 వరకు కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పాల్గొని విజయవంతం చేయాలని తుమ్మల ఆదేశించారు. మట్టి నమూనా పరీక్షలు త్వరితగతిన పూర్తిచేయడానికి సాయిల్ టెస్టింగ్ లాబ్స్‌ను ఎఫ్‌పీవోలు, రైతువేదికల్లో పెట్టడం ద్వారా అవసరమున్న రైతుకు మట్టినమూనా పరీక్ష చేసుకొనే వెసులుబాటు కలుగుతుందన్నారు. యూనివర్సిటీ నుంచి ప్రతీ రెవెన్యూ గ్రామంలో ఎంపిక చేసిన ముగ్గురు రైతులకు మూల విత్తనాన్ని ఇవ్వడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైతు సంక్షేమానికే కొత్త విత్తన చట్టం

» రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసమే కొత్త విత్తన చట్టం తీసుకొస్తున్నట్లు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తెలిపారు. విత్తన చట్ట ముసాయిదా రూపకల్పనకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు, విత్తనాల తయారీ సంస్థలు, ఆర్గనైజర్లు, డీలర్లతో సంప్రదించి, వారి అభిప్రాయాలను సేకరిస్తామని చెప్పారు. కొత్త విత్తన చట్టం రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ.. సోమవారం రాష్ట్ర రైతు కమిషన్ కార్యాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ.. అవసరమైతే ఇతర రాష్ట్రాల్లోనూ అమలవుతున్న చట్టాలను అధ్యయనం చేస్తామన్నారు. రైతులకు మేలు చేసేలా రాష్ట్ర విత్తన చట్టం పటిష్టంగా రూపొందించడానికి ఈ కమిటీ కృషి చేస్తుందని చెప్పారు.

సిస్టర్ స్ట్రోక్‌తో మతి భ్రమించిన కేటీఆర్

» ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): సిస్టర్ స్ట్రోక్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మతి భ్రమించిందని, అందుకే సొంత చెల్లెలు కవిత అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్ ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేయడానికి ముందు కేటీఆర్.. తన ఇంట్లో సమస్య పరిష్కరించుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తన బావ, మాజీ మంత్రి టి.హరీష్ రావు కాళ్లు పట్టుకున్నట్లే, ఇప్పుడు చెల్లి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాళ్లు పట్టుకోవాలని కేటీఆర్‌కు ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ హితవు చెప్పారు. కాగా, ఫోన్ ట్యాపింగ్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం తదితర కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే లేఖ డ్రామా ఆడుతున్నారని మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత రవీంద్ర నాయక్ ఆరోపించారు. బీఆర్ఎస్‌లో అంతర్గత సమస్యలపై ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వయంగా లేఖ రాశారో.. లేక ఆమెతో స్వయంగా ఆ పార్టీ అధ్యక్షుడు కేసీఆరే రాయించారోనన్న అనుమానం కలుగుతున్నదని చెప్పారు.

ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాల కల్పన..

దేశ చరిత్రలోనే ఓ మైలురాయి

» ట్రాఫిక్ అసిస్టెంట్లుగా రాణిస్తున్నారు

» సీపీతో కలిసి మంత్రి సీతక్క సమావేశం

హైదరాబాద్ సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్లకు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ఉద్యోగం కల్పించడం దేశ చరిత్రలోనే ఓ మైలురాయి అని గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. తెలంగాణను రోల్‌మోడల్‌గా తీసుకున్న ఇతర రాష్ట్రాలు కూడా ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నాయని ఆమె తెలిపారు. సిటీ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమితులైన ట్రాన్స్‌జెండర్ల పనితీరు, ప్రవర్తనపై ప్రభుత్వానికి ఒక నివేదిక ఇవ్వాలని కోరిన నేపథ్యంలో సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లు తమను తాము నిరూపించుకుని ఆదర్శంగా నిలుస్తున్నారని, పోలీస్ శాఖలోనే కాకుండా ఇతర శాఖల్లో కూడా వారిని నియమించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్ వర్గాన్ని చేర్చుకోవాలని నిర్ణయించిన రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ట్రాన్స్‌జెండర్ వర్గానికి అంగవైకల్యం కోటా కింద ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని మంత్రి సీతక్క ప్రకటించారు. జిల్లాలో ఇప్పటికే మైత్రీ క్లినిక్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం, ట్రాన్స్‌జెండర్ వర్గానికి సమాన అవకాశాలు కల్పించి, సమాజంలో భాగం చేయడమేనని పునరుద్ఘాటించారు.



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న ట్రాఫిక్ అసిస్టెంట్లు

గత బీఆర్ఎస్ సర్కారు తీరు వల్లే సమస్యలు

గత ప్రభుత్వ విధానాల వల్లే గ్రామ పంచాయతీ కార్యదర్శులు సవాలక్ష సమస్యలను ఎదుర్కొంటున్నారని మంత్రి సీతక్క ఆరోపించారు. తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. 2019లో పంచాయతీ కార్యదర్శుల నియామకంలో గందరగోళం సృష్టించారని పేర్కొన్నారు. ఇప్పుడు గ్రామ కార్యదర్శులు కోరినట్లు నియామకమైన తొలి రోజు నుంచి వారి సర్వీసును పరిగణనలోకి తీసుకోవడానికి అడ్డంకిగా ఉన్న న్యాయపరమైన చిక్కులను అధిగవించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

పీసీసీ పదవులు కొలిక్కి!

(మొదటిపేజీ తరువాయి)

కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సోమవారం సాయంత్రం రాహుల్ గాంధీ నివాసంలో కేసీ వేణుగోపాల్ చర్చలు జరిపారు. తెలంగాణ పీసీసీ కమిటీల జాబితాకు సంబంధించిన అంశాలపై రాహుల్ గాంధీ దృష్టికి కేసీ వేణుగోపాల్ తీసుకెళ్లినట్టు తెలిసింది. ఆ తర్వాత పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కుటుంబ సమేతంగా రాహుల్ గాంధీని కలిశారు. పీసీసీ కమిటీల ప్రకటన, మంత్రివర్గ విస్తరణ, తెలంగాణ రాజకీయ పరిస్థితులు, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం తదితర అంశాలపై రాహుల్ గాంధీకి మహేశ్ వివరించినట్టు తెలిసింది. కాగా, తొలి నుంచి జంబో పీసీసీ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పగా, కేసీ వేణుగోపాల్ కమిటీలో సంఖ్యను తగ్గించాలని సూచించినట్టు సమాచారం. చివరికి.. రాహుల్ గాంధీ ఆమోదంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ అభీష్టం మేరకే జంబో పీసీసీకి ఆమోదం లభించినట్టు కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలిసింది. రాహుల్ గాంధీని కలిసిన తర్వాత.. ఢిల్లీలోని సీఎం అధికారిక నివాసంలో రేవంత్ రెడ్డితో మహేశ్ కుమార్ భేటీ అయ్యారు. సుమారు 45 నిమిషాలపాటు రాహుల్ గాంధీతో భేటీపై ఇరువురు చర్చించారు. అనంతరం సోమవారం రాత్రి మహేశ్ కుమార్ మరోసారి కేసీ వేణుగోపాల్ నివాసానికి వెళ్లి సమావేశమయ్యారు. ఎట్టకేలకు.. పీసీసీ కమిటీలపై కసరత్తు కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. ఏ క్షణమైనా పీసీసీ కార్యవర్గంపై ఏఐసీసీ వర్గాల నుంచి ప్రకటన వెలువడే అవకాశముంది. కాగా, పీసీసీ కమిటీల్లోనూ సామాజిక సాధికారత పాటించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు.. ఇలా అన్నింటిలో సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని తుది జాబితాను సిద్ధం చేసినట్టు తెలిసింది.



రాహుల్ గాంధీని కలిసిన మహేశ్‌కుమార్ గౌడ్ కుటుంబసభ్యులు

మంత్రివర్గ విస్తరణపై జూన్‌లో స్పష్టత

పీసీసీ కమిటీలు కొలిక్కి రాగా, మంత్రివర్గ విస్తరణ మాత్రం కొద్దిరోజుల ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆదివారం రాత్రే సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ ప్రయాణం ఉండగా, కేసీ వేణుగోపాల్‌ను కలిసిన తర్వాత పీసీసీ కమిటీలు, మంత్రివర్గ విస్తరణ.. రెండు అంశాలను ఫైనల్ చేసుకోవాలని నిర్ణయించారు. సోమవారం రాహుల్ గాంధీని, మంగళవారం ఖర్గేను కలిసి పీసీసీ కమిటీలు, మంత్రివర్గ విస్తరణపై చర్చించాలని భావించారు. చివరి నిమిషంలో ఖర్గే ఢిల్లీ ప్రయాణం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఈ నెల 30న మరోసారి ఢిల్లీకి రావాలని ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడికి కాంగ్రెస్ అధిష్ఠానం సూచించింది. సోమవారం రాత్రి సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనను ముగించుకుని హైదరాబాద్ తిరిగి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో జూన్ మొదటి వారంలోనే మంత్రివర్గ విస్తరణపై స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది.

బీసీలకు ప్రాధాన్యమివ్వండి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కుటుంబ సమేతంగా కలిసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో రాజకీయ పరిస్థితులను రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లాను. వీలైనంత త్వరగా మంత్రివర్గ విస్తరణ చేపట్టాలని కోరాను. బీసీలకు తగు ప్రాధాన్యమివ్వాలని మొదటి నుంచి కోరుతూనే ఉన్నా. మంత్రివర్గం విస్తరణ వీలైనంత త్వరగా జరుగుతుందని ఆశిస్తున్నాను. ఇప్పటికే రెండుసార్లు మా అభిప్రాయాలను రాహుల్ గాంధీ, ఖర్గే, కేసీ వేణుగోపాల్‌కు వివరించాం. కేబినెట్‌లో బీసీలకు తగు ప్రాధాన్యం ఉండాలని కోరుతున్నాం. పీసీసీ కమిటీలపై ఒకటి, రెండురోజుల్లో ప్రకటన వచ్చే అవకాశముంది." అని మహేశ్ వివరించారు.

రోహిన్‌రెడ్డి, సంపత్‌కుమార్ పేర్లు ఖరారు

రెడ్డి, ఎస్సీ మాదిగ, ఎస్టీ లంబాడా, మైనారిటీ వర్గాల నుంచి ఒక్కొక్కరు చొప్పున నలుగురిని కార్యనిర్వాహక అధ్యక్షులుగా తీసుకోవాలని గతంలోనే నిర్ణయించిన సంగతి తెలిసిందే. రెడ్డి సామాజిక వర్గం నుంచి ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్లను ప్రధానంగా పరిశీలించారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు రోహిన్‌రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ఎస్సీ మాదిగ సామాజిక వర్గం నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌పై ఏకాభిప్రాయం వచ్చినట్లు చెబుతున్నారు. ఎస్టీ లంబాడా నుంచి ఎంపీ బలరాం నాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ మధ్య పోటీ నడుస్తున్నట్లు సమాచారం. ముస్లిం మైనారిటీల నుంచి మైనారిటీ గురుకుల సంస్థ వైస్ చైర్మన్ ఫహీంఖురేషి, పార్టీ నేత ఫిరోజ్‌ఖాన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. ముస్లిం మైనారిటీ కోటాకు సంబంధించి కూడా ఏకాభిప్రాయం రాలేదు.

రాహుల్ స్ఫూర్తితోనే

కుల గణన

తెలంగాణలో పారదర్శకంగా నిర్వహించాం

టీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

కాంగ్రెస్ ఓబీసీ రౌండ్ టేబుల్ సమావేశం

న్యూఢిల్లీ, మే 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్ఫూర్తి, భారత్ జోడో యాత్రలో ఆయన ఇచ్చిన హామీ మేరకే తెలంగాణలో కుల గణనను విజయవంతంగా నిర్వహించామని టీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్(ఐఐసీ)లో కాంగ్రెస్ ఓబీసీ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ తాజా, మాజీ పీసీసీ అధ్యక్షులు, బీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు. తెలంగాణ నుంచి మహేశ్ కుమార్‌తోపాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీసీ నేతలు వీహెచ్, మధుయాష్కి గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మొత్తం మూడు సెషన్లలో సమావేశాలు నిర్వహించారు. తొలుత.. రాహుల్ గాంధీకి అభినందనలు తెలిపారు. ఢిల్లీలో పెద్ద ఎత్తున అభినందన సభ నిర్వహించాలని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో వర్క్‌షాపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకే కేంద్రం కుల గణన ప్రకటన చేసిందన్నారు. కుల గణనతోనే ఓబీసీలకు సముచిత స్థానం లభిస్తుందని, విద్య, ఉద్యోగం, రాజకీయం.. ఇలా అన్నింటా న్యాయం జరుగుతుందని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం వీహెచ్, ఆది శ్రీనివాస్ మీడియాతో మట్లాడారు. కాంగ్రెస్ ఓబీసీ సమావేశం వివరాలను వెల్లడించారు.

38 మున్సిపాలిటీల్లో 215 పంచాయతీల విలీనం!

ఈ వారంలోనే ఉత్తర్వులు!...

ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఏ క్షణమైనా మున్సిపల్ ఎన్నికల ప్రకటన వచ్చే అవకాశం

హైదరాబాద్, మే 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 215 గ్రామ పంచాయతీలను 38 మున్సిపాలిటీల్లో విలీనం చేసే ప్రక్రియ కొలిక్కి వచ్చింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు ఈ వారంలోనే వెలువడతాయని అధికార వర్గాల సమాచారం. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఏ క్షణమైనా మున్సిపల్ ఎన్నికల ప్రకటన వచ్చే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు. 126 పంచాయతీలను 19 కొత్త మున్సిపాలిటీల్లో, 89 పంచాయతీలను మరో 19 మున్సిపాలిటీల్లో విలీనం చేయనున్నారు. ఈ మేరకు పురపాలక శాఖ సంచాలకుల కార్యాలయం సమర్పించిన ప్రతిపాదనలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఐలాపూర్, ఐలాపూర్ తండా, పటేల్‌గూడ, దయార, కిష్టారెడ్డిపేట, సుల్తాన్‌పూర్, వాడక్‌పల్లి, జనకమ్‌పేట్ పంచాయతీలు విలీనం కానున్నాయి. కొత్త మున్సిపాలిటీల వారీగా విలీనం కానున్న పంచాయతీల సంఖ్య ఇలా ఉంది.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎల్లంపేట 11, ముదుచింతలపల్లి 14, అలియాబాద్ 6, కామారెడ్డి జిల్లా బిచుకుంద 4, కల్లూరు (ఖమ్మం జిల్లా) 8, ములుగు 3, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ 9, చేవెళ్ల 12, సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ 3, గుమ్మడిదాల 5, గడ్డపోతారం 5, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర 5, ఖమ్మం జిల్లా ఏదులాపురం 12, నారాయణపేట్ జిల్లా మద్దూర్ 6, జనగాం జిల్లా స్టేషన్ ఘనపూర్ 3, భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట 3, మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం 5, సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో ఒక పంచాయతీ విలీనం కానున్నాయి. 19 పాత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనమయ్యే పంచాయతీల సంఖ్య ఇలా ఉంది.. కొత్తగూడెం 7, మంచిర్యాల 8, కరీంనగర్ 5, మహబూబ్‌నగర్ 2, జగిత్యాలలో ఒక పంచాయతీ విలీనం కానున్నాయి. పెద్దపల్లి జిల్లా రామగుండం 4, వరంగల్ జిల్లా నర్సంపేట 6, వికారాబాద్ జిల్లా పరిగి 6, రంగారెడ్డి జిల్లా నార్సింగ్ 2, శంషాబాద్ 6, తుక్కుగూడ 1, పెద్ద అంబర్‌పేట్ 5, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగారం 4, దమ్మాయిగూడ 6, పోచారం 5, ఘట్‌కేసర్ 6, సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీలో 8 పంచాయతీలను విలీనం చేయనున్నారు.

4 మున్సిపాలిటీల నుంచి 6 గ్రామ పంచాయతీల తొలగింపు!

రాష్ట్రంలోని 4 మున్సిపాలిటీల పరిధి నుంచి 6 గ్రామ పంచాయతీలను తొలగించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. అందులో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నుంచి బోయపల్లి, నర్సింగరావుపల్లి, తక్లనరిసింహాపురం, కామారెడ్డి జిల్లా బాన్సువాడ నుంచి కోయగుట్ట తండా, యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నుంచి సాయిగూడెం, నల్గొండ జిల్లా హాలియా నుంచి ఇబ్రహీంపట్నం పంచాయతీ సర్వే నంబరు 260, 322, 540 పరిధిలోని ప్రాంతాలను తొలగించనున్నారు.

4 హైవేలు.. 6 జిల్లాల మీదుగా!

» ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం నిర్మాణం

» 22 చోట్ల విద్యుత్తు హైటెన్షన్ లైన్లు.. 2 చోట్ల అటవీ భూములు

» రేవంత్‌కు సమగ్ర నివేదిక.. అధికారులకు సీఎం సూచనలు

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం నాలుగు జాతీయ రహదారులు, ఒక రాష్ట్ర రహదారి అనుసంధానంతో నిర్మితం కానుంది. ఈ రహదారి ఆరు జిల్లాల మీదుగా వెళ్లనుంది. మార్గం మధ్యలో ఉన్న గ్రామాలు, హైటెన్షన్ విద్యుత్తు లైన్లు, అటవీ భూములను గుర్తించారు. అందుకు సంబంధించి, సమగ్ర వివరాలతో కూడిన నివేదికను అధికారులు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందించారు. ఆ సమయంలో దక్షిణ భాగంపై సీఎం అధికారులకు పలు సూచనలు చేశారు. ఫ్యూచర్ సిటీ, ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు, బెంగళూరు హైవేలన్నీ అధిక భాగం ఈ మార్గంలోనే ఉండడంతో అలైన్‌మెంట్ ఖరారుపై జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించినట్లు తెలిసింది. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఉత్తర భాగం నిర్మాణానికి ఇప్పటికే టెండర్లను ఆహ్వానించినా కేంద్ర క్యాబినెట్ ఇంకా ఆమోదం తెలపలేదు. మరోవైపు ఉత్తరభాగంతో పాటే దక్షిణ భాగాన్ని నిర్మించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేస్తోంది. దక్షిణ భాగానికి సంబంధించి సమగ్ర నివేదిక రూపొందిస్తోంది. ఈ క్రమంలోనే దక్షిణ భాగం ప్రారంభమయ్యే చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు ఉన్న భౌగోళిక పరిస్థితులపై అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. దాని ప్రకారం.. దక్షిణ భాగం రోడ్డు చౌటుప్పల్ దగ్గర మొదలై ఆమనగల్, చేవెళ్ల, వికారాబాద్ మీదుగా సంగారెడ్డి వరకు మొత్తం 200 కిలోమీటర్లు ఉంటుంది. ఇది ఎన్‌హెచ్ 65, ఎన్‌హెచ్-44, ఎన్‌హెచ్-163, ఎన్‌హెచ్-765తో పాటు ఒక రాష్ట్ర రహదారి (ఎస్‌హెచ్)-19తో అనుసంధానం కానుంది. దక్షిణభాగం అలైన్‌మెంట్ మధ్యలో 22చోట్ల హైటెన్షన్ విద్యుతులైన్లు ఉన్నాయి. ఏయే కిలోమీటరు దగ్గర ఈ లైన్లు ఉన్నాయి? వాటిని మార్చేందుకు ఉన్న మార్గాలు, ప్రత్యామ్నాయ అవకాశాలన్నింటినీ నివేదికలో పేర్కొన్నారు. అదేవిధంగా 38 నుంచి 41వ కి.మీ. వరకు, 158 నుంచి 160 కి.మీ. వరకు.. రెండు చోట్ల అటవీ ప్రాంతం ఉందని తెలిపారు. వీటితో పాటు పలు చోట్ల కాలువలు, చెరువులు, నీటి కుంటలు, బావులు ఉన్నాయంటూ.. వాటి ఫొటోలను పొందుపర్చారు. బాలానగర్-రంగారెడ్డిగూడ, గుళ్లగూడ-చిటిగిడ్డ దగ్గర రైల్వే మార్గాలున్నాయంటూ.. సంబంధిత గూగుల్ మ్యాపింగ్ ఫొటోలను జతచేశారు.



16 గ్రామాలపై ప్రభావం..

దక్షిణ భాగం రహదారి కోసం నిర్వహించిన సర్వేలో దాదాపు 16 గ్రామాలపై ప్రభావం పడుతోందని గుర్తించారు. మలుపులను అభివృద్ధి చేయడం కోసం కొన్నిచోట్ల, మరికొన్ని చోట్ల ఇతరత్రా అవసరాల కోసం వాటిని మార్చాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు కోతులాపురం, నాగవారిగూడెం, కొర్వారు రెసిడెన్సీ, సూరారం గ్రామాల బయటివైపు ప్రభావం పడుతోంది. ఇక నల్లార్ల తండా, తొమ్మిడిరేకులలో పాక్షికంగా, కంసానపల్లి, బీమారం ఉరేంకి తండా, లాల్‌సింగ్ తండా, చించోడ్, చక్రాంపల్లి, మందాపూర్, గంగారం, సీతారాంకుంట తండా, దొబ్బకుంట తండా, అలియాబాద్ గ్రామాల్లో లోపలి వైపు ప్రభావం పడుతున్నట్లు గుర్తించారు.

మానవ బాంబులుగా స్లీపర్ సెల్స్!

(మొదటిపేజీ తరువాయి)

పన్నాగం పన్నినట్లు తెలిసింది. దీనిపై సిరాజ్ నోరు విప్పాడని, దీంతో అధికారులు నిర్ఘాంతపోయారని సమాచారం. అహిం గ్రూపు సభ్యుల కోసం దేశంలోని పలు నగరాల్లో పోలీసులు గాలిస్తున్నారు. నేరస్థులను కలిసి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. సిరాజ్, సమీర్‌లకు ఆర్థిక, ఇతర సహకారం అందించిన వరంగల్‌కు చెందిన ఫర్హాన్ మొహిద్దీన్, యూపీకి చెందిన బాదర్, ఇమ్రాన్ అక్రమ్ కోసం కూడా వెతుకుతున్నారు. వీరి అడ్రస్‌లు తప్పుగా చూపిస్తున్నట్లు గుర్తించారు. అయితే వారు తమకు సిగ్నల్ యాప్‌లో పరిచయమని, చిరునామాలు తెలియదని సిరాజ్, సమీర్ బుకాయించినట్లు తెలిసింది.

- పేలుళ్ల సామగ్రి ఎక్కడిది? ఇందుకు మీకు ఆర్థిక సాయం ఎవరు చేశారు? ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? అని దర్యాప్తు అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే సామగ్రి తయారీ ప్రదేశం ఎక్కడ? దాడులకు ఏఏ ప్రాంతాలను ఎంచుకున్నారు? విజయనగరంలోని కేఎల్ పురం, కన్యాకాపరమేశ్వరి ఆలయం వద్ద ఏ షాపుల్లో పేలుడు సామగ్రి తీసుకున్నారు? అనే అంశాలపై ఆరా తీసినట్లు తెలిసింది. అంతేకాకుండా పలానచోట ఈ సామగ్రి దొరుకుతుందని సిరాజ్‌కు ఎవరు చెప్పారని కూడా ప్రశ్నించినట్లు సమాచారం.
- సిరాజ్ పేలుళ్లకు విజయనగరాన్నే ఎంచుకున్నట్లు తెలుస్తోంది. మొదటి పేలుడు హైదరాబాద్‌లో చేపట్టాలని సౌదీ హ్యాండ్లర్స్ చెప్పినట్లు సమాచారం ఇవ్వగా... విజయనగరంలోనే పేల్చితే అహిం సంస్థకు పేరు వస్తుందని సిరాజ్ చెప్పినట్లు సమాచారం.
- సిరాజ్ పాస్‌పోర్టు పొందే సమయంలో వెరిఫికేషన్‌కు సంబంధించి తండ్రి ఆజీజ్ రెహ్మాన్ ఏఎస్ఐ కావడంతో పెద్దగా విచారణ జరగలేదని తేలినట్లు సమాచారం. సిరాజ్, అతని కుటుంబసభ్యుల ఆస్తులు, బ్యాంక్ వివరాలు, ఆర్థిక లావాదేవీల గురించి కూపీ లాగుతున్నారని తెలిసింది. సిగ్నల్ యాప్‌లో తరచూ వినియోగించిన మ్యాజిక్ లాంతర్ అనే పదం కోడ్‌నా? లేదా ఓ ప్రాంతమా? లేదా ఓ వెబ్‌సైటా? అనేదానిపై సిరాజ్‌ను అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది.

సిరాజ్‌తో సీన్ రీ కన్‌స్ట్రక్షన్?

సిరాజ్‌ను తీసుకెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేయనున్నట్లు సమాచారం. విజయనగరంలో సిరాజ్ ఏఏ ప్రాంతాల్లో తిరిగాడు? ఏఏ కార్యకలాపాలు రూపొందించాడు? అన్న అంశాలపై మరిన్ని వివరాలను తెలుసుకోనున్నట్లు తెలిసింది. అలాగే విజయనగరంలో పేలుడుకు విజ్జీ స్టేడియంనే ఎందుకు ఎంచుకున్నారు? అనే కోణంలో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేయించనున్నట్లు సమాచారం.

జూన్ 8, 9వ తేదీల్లో

చేప మందు పంపిణీ

అఫ్జల్‌గంజ్, మే 26 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేపమందు పంపిణీకి తేదీలు ఖరారయ్యాయి. ఎగ్జిబిషన్ సొసైటీ, రాష్ట్ర ప్రభుత్వం, బత్తిని హరినాథ్ కుటుంబ సభ్యుల నేతృత్వంలో జూన్ 8, 9 తేదీల్లో చేప మందును పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. చేపమందు పంపిణీ ఏర్పాట్లపై సోమవారం అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసారి 32 కౌంటర్లలో చేపమందు పంపిణీ ఉంటుందని, జూన్ 8న ఉదయం 8.30లకు ప్రారంభమయ్యే చేపమందు పంపిణీ మరుసటి రోజు రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

విశాఖలో హౌస్ సర్జన్‌కు కరోనా?

గోపాలపట్నం (విశాఖపట్నం), మే 26(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నగర పరిధిలోని గోపాలపట్నం 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఓ హౌస్ సర్జన్‌కు కరోనా వచ్చినట్టు తెలిసింది. హోమ్ క్వారంటైన్‌లో ఆమె ఉన్నట్టు సమాచారం. ఆసుపత్రి సిబ్బంది అందరూ సోమవారం మాస్కులు పెట్టుకుని కనిపించారు. రోగులు కూడా తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు. అయితే హౌస్ సర్జన్‌కు కరోనా వచ్చిన విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ధ్రువీకరించలేదు. తమ దృష్టికి రాలేదన్నారు.

రేవంత్‌వి ప్రతీకార రాజకీయాలు: హరీశ్

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అభద్రతా భావంతో ప్రతీకార రాజకీయలకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. కేటీఆర్‌కు ఫార్ములా ఈ కేసులో ఏసీబీ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డిపై ఆయన ధ్వజమెత్తారు. కట్టుకథలు కల్పించి పెట్టిన కేసులు కోర్టుల్లో, ప్రజా క్షేత్రంలో నిలబడవన్నారు. సత్యమే గెలుస్తుందని, తామంతా కేటీఆర్‌కు అండగా ఉన్నామని హరీశ్‌రావు ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ పాలనలో అన్నదాతలు అడుగడుగునా అవస్థ పడుతున్నారని, అకాల వర్షాలవల్ల ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోనే రైతన్నల కన్నీటి గోస చూడాల్సి వస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. ధాన్యం కొనుగోలు చేయాలని అడిగిన రైతులపై పోలీసుల దాష్టీకం అన్యాయమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతులపై పగబట్టిన ప్రభుత్వం పంటల సాగుకు పెట్టుబడి లేకుండా చేసిందని, కష్టాలకోర్చి పండించిన పంటను కొనకుండా ఆలస్యం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో అన్నదాతలకు బేడీలు, పోలీసుల పిడిగుద్దులు తప్ప సాధించిందేమీ లేదన్నారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడలేదని, దీన్ని గుర్తుంచుకోవాలంటూ హరీశ్‌రావు రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే నోటీసులు

ఇబ్బందులెన్ని పెట్టినా కేసీఆర్ సైనికులు నిలబడగలరు: కవిత

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చిందని ఎమ్మెల్సీ కవిత ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ క్రీడలో భాగంగానే ఈ నోటీసులు జారీ చేసినట్లు స్పష్టమవుతోందన్నారు. తమ పార్టీ నాయకులకు వరుసగా నోటీసులు జారీ చేయడాన్ని రాజకీయ దురుద్దేశంగా ఆమె 'ఎక్స్'లో అభివర్ణించారు. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నించినా, కేసీఆర్ సైనికులు తట్టుకొని నిలబడగలరని కవిత స్పష్టం చేశారు.

అన్నలపైకి చెల్లెళ్ళి ఉసిగొల్పేది కాంగ్రెస్సే: లక్ష్మణ్

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): అన్నలపైకి చెల్లెళ్ళి ఉసిగొల్పడంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన పాత్ర పోషిస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆరోపించారు. ఏపీలో వైఎస్ షర్మిలను ఏపీసీసీ అధ్యక్షురాలిగా చేసిన కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణలో కల్వకుంట్ల కవితను పావుగా వాడుకుంటోందని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వైఎస్సార్, కేసీఆర్ కుటుంబాలు వీధుల్లోకి వచ్చి రచ్చకెక్కుతున్నాయని వ్యాఖ్యానించారు.

రేపు బాసర ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ విడుదల

బాసర, మే 26 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ), బాసర - 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశ నోటిఫికేషన్‌ను ఈ నెల 28వ తేదీన విడుదల చేయనుంది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన ప్రవేశ షెడ్యూల్‌తో పాటు ఇతర వివరాలను అందులో వెల్లడించనున్నట్లు యూనివర్సిటీ అధికారులు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్ www.rgukt.ac.inను సందర్శించాలని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

తెలుగు వర్సిటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్

హైదరాబాద్ సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ వివిధ కోర్సుల్లో ప్రవేశానికి సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. చిత్రలేఖనం, డిజైన్, సంగీతం, రంగస్థలం, శాస్త్రీయ నృత్యం, జానపదం, తెలుగు, చరిత్ర- పర్యాటకం, భాషాశాస్త్రం, జర్నలిజం, జ్యోతిషం, యోగా సబ్జెక్టులతో ఎం.ఏ, డిగ్రీ, పీజీ డిప్లొమా, డిప్లొమా సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం కోసం తెలుగు వర్సిటీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సాధారణ రుసుంతో జూన్ 24లోపు, ఆలస్య రుసుంతో జూన్ 30 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామని రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పూర్తి వివరాల కోసం www.teluguuniversity.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

సాగర్ నుంచి మరో 4 టీఎంసీలు కేటాయించాలి

» కృష్ణా బోర్డుకు ఏపీ లేఖ

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): తాగునీటి అవసరాల కోసం మరో 4 టీఎంసీలను నాగార్జున సాగర్ నుంచి కేటాయించాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు ఆంధ్రప్రదేశ్ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు ఆ రాష్ట్ర ఈఎన్‌సీ (ఇరిగేషన్) కె.నర్సింహామూర్తి ఈ నెల 22న బోర్డుకు లేఖ రాశారు. ఇప్పటికే ఏపీకి 4 టీఎంసీలు, తెలంగాణకు 10.26 టీఎంసీలు కేటాయిస్తూ ఈ నెల 20న కృష్ణాబోర్డు నీటి విడుదలకు ఆదేశం ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ తెలంగాణ.. బోర్డుకు లేఖ రాసింది. ఏపీ కేటాయింపులకు మించి నీటిని తరలించిందని, రెండు జలాశయాల్లో ఆ రాష్ట్రానికి నీటిని కేటాయించవద్దని బోర్డును కోరింది. ఏపీ ఇప్పటిదాకా నీటిని వాడుకోగా.. తెలంగాణకు 9.662 టీఎంసీల నీరు మిగిలి ఉంది. తాము 4 టీఎంసీలు వాడుకున్న తర్వాత మరో 5.662 టీఎంసీలు ఉంటాయని, ఈ నేపథ్యంలో అదనంగా నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి 4 టీఎంసీలు కేటాయించాలని ఏపీ కోరింది. ఈనెల 19 నుంచి 21వతేదీ దాకా శ్రీశైలం జలాశయానికి 2.32 టీఎంసీల వరద వచ్చి చేరినట్టు తెలిపింది. ఎగువ ప్రాంతాల్లో వానలు కురుస్తున్నందున శ్రీశైలంలో నీటి లభ్యత పెరుగుతుందని, తక్షణమే తమకు 4 టీఎంసీలు కేటాయించాలని ఏపీ కోరింది. దీనిపై బోర్డు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



ఏసీబీకి పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ అరుణ, డాక్యుమెంట్ రైటర్ వెంకటేశ్

ఏసీబీ వలలో ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్

గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌కు 50 వేలు డిమాండ్.. 30వేలకు ఒప్పందం

డాక్యుమెంట్ రైటర్ ద్వారా తీసుకుంటుండగా పట్టివేత

ఖమ్మం, మే 26 (ఆంధ్రజ్యోతి): గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి లంచం తీసుకుంటూ ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం సబ్ రిజిస్ట్రార్ జెక్కి అరుణ ఏసీబీకి చిక్కారు. ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామ రెవెన్యూ పరిధిలోని ఓ సర్వేనంబరులో శ్రీనివాస్ అనే వ్యక్తి తన పేరిట ఉన్న 2,700 గజాల స్థలాన్ని తన కుమారుడి పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించేందుకు చలానా తీశారు. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ చేసే క్రమంలో సబ్ రిజిస్ట్రార్ అరుణ వారిని రూ.50 వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో శ్రీనివాస్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పథకం ప్రకారం దరఖాస్తుదారుడు సబ్‌రిజిస్ట్రార్‌తో బేరమాడి రూ.30వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే ఆ నగదును డాక్యుమెంట్ రైటర్ పుచ్చకాయల వెంకటేశ్ ద్వారా తనకు అందజేయాలని ఆమె చెప్పారు. ఈ క్రమంలో సోమవారం రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత డాక్యుమెంట్ రైటర్ ద్వారా నగదు తీసుకుంటుండగా ఇద్దరినీ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. దీనిపై విచారణ జరుగుతోందని ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపారు.

ముగిసిన సరస్వతి పుష్కరాలు

ఏర్పాట్లలో పొరపాట్లు జరిగితే క్షమించాలి

వేడుకల ముగింపులో మంత్రి శ్రీధర్‌బాబు

భూపాలపల్లి/కాళేశ్వరం/వేములవాడ కల్చరల్/బాసర, మే 26 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 12 రోజుల పాటు సాగిన సరస్వతి పుష్కరాలు సోమవారం ముగిశాయి. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా వచ్చిన ఈ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన 15.9 లక్షల మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించారు. చివరి మూడు రోజుల్లోనే సుమారు 8 లక్షల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. చివరి రోజైన సోమవారం 2.25 లక్షల మంది భక్తులు వచ్చారు. ఈ వేడుకలకు 6 లక్షల నుంచి 8 లక్షల మంది వస్తారని దేవాదాయ శాఖ అంచనా వేయగా ఎవరూ ఊహించని రీతిలో 16 లక్షల మంది వచ్చారు. సరస్వతీ పుష్కరాల ఏర్పాట్లలో చిన్న చిన్న తప్పులు జరిగి ఉంటే భక్తులు పెద్ద మనస్సుతో క్షమించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. సోమవారం సరస్వతి పుష్కరాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాబోయే గోదావరి పుష్కరాలను రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా నిర్వహిస్తామని ప్రకటించారు.

వేములవాడలో రద్దీ

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీరాజరాజేశ్వర ఆలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. సుమారు 80 వేల నుంచి 90 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నట్లు సమాచారం. ధర్మదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌లో నాలుగు గంటల పాటు భక్తులు నిరీక్షించారు.



కాళేశ్వరం వద్ద గోదావరిలో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బాసర వద్ద గోదావరిలో ఇద్దరి మృతి

నిర్మల్ జిల్లా బాసరలోని గోదావరి నదిలో సోమవారం ఇద్దరు మృతి చెందారు. మహారాష్ట్రలోని పర్భణీ జిల్లా టాక్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబం బాసర వచ్చింది. ఈ క్రమంలో వారంతా స్నానం చేద్దామని గోదావరిలోకి దిగగా.. బాలుడు కుల్‌దీప్ బాలాసాహెబ్ దేశ్‌ముఖ్(12) నీట మునిగి మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన బొల్ల మల్లరాజు(40) బాసర గోదావరిలో స్నానానికి వెళ్లి కాలు జారి నీట మునిగి మృతి చెందాడు.

కేటీఆర్‌కు మళ్లీ శ్రీముఖం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధం లేదని కూడా తెలిపారు. ఈ నేపథ్యంలోనే, కేసు నమోదు చేసిన ఏసీబీ.. దర్యాప్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇప్పటికే ఒకసారి కేటీఆర్‌ను ఏసీబీ ప్రత్యేక బృందం సుదీర్ఘంగా విచారించింది. అవసరమైతే మరోసారి విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని గత విచారణ ముగింపు సమయంలోనే చెప్పి పంపింది. ఈ కేసుకు సంబంధించి విదేశాల్లో ఉన్న సంస్థ ప్రతినిధుల్ని సైతం ఆన్‌లైన్‌లో ఏసీబీ అధికారులు విచారించారు. దర్యాప్తునకు అవసరమైన పత్రాలు పంపాలని కోరుతూ పలు దఫాలుగా మెయిల్స్ పంపారు. ఇదే కేసుకు సంబంధించి అప్పటి మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి తదితరులనూ ఏసీబీ విచారించింది. ఈ కేసులో పలువురిని విచారించిన దర్యాప్తు అధికారులు.. వారి నుంచి వచ్చిన సమాచారం, దర్యాప్తులో సేకరించిన పత్రాల ఆధారంగా మరోసారి కేటీఆర్‌ను విచారించేందుకు సిద్ధమయ్యారు. కాగా, ఈ కేసులో భాగంగా విదేశాలకు నిధులు దారిమళ్లడంతో ఈడీ కూడా దర్యాప్తు జరుపుతోంది.

విదేశీ పర్యటన తర్వాత వస్తా..

ఏసీబీ నోటీసులపై కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ఫార్ములా ఈ కారు రేసు కేసులో 28న విచారణకు రావాలని ఏసీబీ నోటీస్‌లు జారీ చేసింది. ఈ కేసు పూర్తిగా రాజకీయ వేధింపుల కోసమే పెట్టినా.. చట్టాన్ని గౌరవించే పౌరుడిగా కచ్చితంగా దర్యాప్తు సంస్థకు సహకరిస్తాను. అయితే, ముందుగా నిర్ణయించిన షెడ్యూలు మేరకు యూకే, అమెరికాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్నాను. తిరిగి వచ్చిన వెంటనే దర్యాప్తు సంస్థ ఎదుట విచారణకు హాజరవుతాను. ఇదే విషయాన్ని ఏసీబీ అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేశాను" అని పోస్ట్ చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌లో 48 గంటల క్రితమే రేవంత్ రెడ్డి పేరు వచ్చిందని, 24 గంటల తర్వాత రేవంత్ రెడ్డి బీజేపీ అగ్రనాయకులతో, ప్రధాని మోదీతో సన్నిహితంగా కనిపించారని, డబ్బు అక్రమ రవాణా కేసులో ఆయన ప్రమేయంపై ఒక్క బీజేపీ నాయకుడు కూడా మాట్లాడలేదని ఆయన ఆరోపించారు.

సిరిసిల్లలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్



సిరిసిల్లలోని కేటీఆర్ క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులను చెదరగొడుతున్న పోలీసులు

సిరిసిల్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో ప్రొటోకాల్ వివాదం సోమవారం ఉద్రిక్తతకు దారితీసింది. సిరిసిల్లలోని కేటీఆర్ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఫొటో పెట్టాలంటూ కాంగ్రెస్ నాయకులు.. రేవంత్‌రెడ్డి ఫొటోతో అక్కడికి రావడం, వారిని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు లాఠీచార్జి చేసి ఇరు వర్గాలను అదుపులోకి తీసుకున్నారు. కొద్దిరోజులుగా.. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీల్లో స్థానిక ఎమ్మెల్యే అయిన కేటీఆర్ ఫొటోను పెట్టడం లేదంటూ బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలుపుతున్నారు. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఎస్పీకి ఫిర్యాదు కూడా చేశారు. దీంతో కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టే కార్యక్రమానికి పిలుపునిచ్చారు. సీఎం, తెలంగాణ తల్లి విగ్రహాల ఫొటోలతో క్యాంపు కార్యాలయం వద్దకు తరలివచ్చారు. అక్కడ ముందస్తుగానే పికెట్ ఏర్పాటు చేసిన పోలీసులు.. వారిని అడ్డుకునే ప్రయత్నం చేస్తుండగానే బీఆర్ఎస్ నాయకులు తరలివచ్చారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి చేయడంతో పలువురు బీఆర్ఎస్ నాయకులకు గాయాలయ్యాయి. దీంతో కాంగ్రెస్ నాయకుల తీరు, పోలీసుల లాఠీచార్జిని నిరసిస్తూ వారు రోడ్డుపై బైఠాయించారు. ఇరు వర్గాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని వేర్వేరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కాగా, బీఆర్ఎస్ నాయకులపై లాఠీచార్జి చేయడం హేయమైన చర్య అని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

నిందలు.. దందాలు.. చందాలు..

» ఇదే రేవంత్ విధానం: కేటీఆర్

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నీళ్లు.. నిధులు, నియామకాలు నినాదమైతే... ప్రతిపక్షంపై నిందలు.. బిల్డర్లు, కాంట్రాక్టర్లతో దందాలు, రాహుల్ గాంధీకి చందాలు పంపడమే సీఎం రేవంత్ రెడ్డి విధానామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అధికారం కోసం అబద్ధపు హామీలతో నాలుగు కోట్ల మంది ప్రజలను దారుణంగా మోసగించారని, కాంగ్రెస్ అభయ హస్తం మ్యానిఫెస్టో ఈ శతాబ్దపు అతి పెద్ద మోసమని విమర్శించారు. గద్వాలకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సోమవారం తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని విర్రవీగిన రేవంత్‌రెడ్డి ప్రపంచ సుందరి పోటీలకు వచ్చినవారికి ఆయన కట్టిన కట్టడాలనే చూపిస్తూ తిరుగుతున్నారని విమర్శించారు. రాష్ట్రం దివాలా తీసిందని స్వయంగా ముఖ్యమంత్రి చెప్తే ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన సన్నాసులకు వచ్చే ఉప ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయమన్నారు. గద్వాల ఎమ్మెల్యే మోసం చేసి వెళ్లినా అక్కడి ప్రజలు మాత్రం బీఆర్ఎస్‌తోనే ఉన్నారని పేర్కొన్నారు. జూన్‌లో పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు.

పైకప్పు నిర్మించలేనోళ్లు.. విమర్శిస్తున్నారు

భవనం పైకప్పునే సరిగ్గా నిర్మించలేకపోయిన వాళ్లు.. కాళేశ్వరం గురించి విమర్శలు చేయడం ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని బహిర్గతం చేయడానికి సాధారణ వర్షం చాలంటూ సోమవారం ఎక్స్ వేదికగా రెండు వీడియోలను ఆయన పోస్ట్ చేశారు. హైదరాబాద్‌లో 430 కోట్లతో నిర్మించిన చర్లపల్లి రైల్వేస్టేషన్ అయినా.. ఢిల్లీ విమానాశ్రయం పైకప్పులైనా.. బీజేపీ మార్కు అభివృద్ధిని చెప్పడానికి మే నెలలో కురిసిన సాధారణ వర్షం సరిపోతుందని విమర్శించారు.

ఎన్‌డీఎస్‌ఏ నివేదికను తిరస్కరిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

పాయింట్-5 ప్రకారం.. మేడిగడ్డ వైఫల్యానికి కారణాలు తెలుసుకోవాలంటే తగిన పరీక్షలు జరగాలని ఉందని ఎల్ అండ్‌టీ గుర్తు చేసింది. ఆ పరీక్షలు చేయకుండా రాఫ్ట్, సీకెంట్ పైల్స్ కటాఫ్‌ల పరిస్థితి తెలుసుకునే అవకాశం లేకుండా పోయిందని నివేదికే చెప్పిందని తెలిపింది. కానీ, గ్రౌటింగ్ కారణంగా పరీక్షలు చేయలేకపోయామని నివేదికలో పలుచోట్ల ప్రస్తావించారని పేర్కొంది. క్వాలిటీ కంట్రోల్, నిర్మాణ వైఫల్యాలు, నిర్మాణ క్రమంలో వినియోగించే సామగ్రి పరీక్షలు చేయని విషయాన్ని తెలిపిందని గుర్తు చేసింది. పరీక్షలు చేయకుండానే వైఫల్యానికి కారణాలపై ఏ విధంగా అభిప్రాయానికి వస్తారని ప్రశ్నించింది. నివేదికలోని పేజీ-283లో క్వాలిటీ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్(క్యూఎంపీ) పత్రాలను నిర్మాణ సంస్థ సమర్పించిందని చెబుతూనే.. క్వాలిటీ కంట్రోల్ ప్రమాణాలు పాటించలేదని మరోచోట పేర్కొన్నారని ఎల్అండ్‌టీ తప్పుబట్టింది. 2024 మార్చి 21న ఎన్‌డీఎస్‌ఏ తమకు ప్రశ్నావళిని ఇవ్వగా.. అందులోని అన్ని అంశాలకూ జవాబిచ్చామని తెలిపింది. ఇక 2016 జూలై 14న క్వాలిటీ కంట్రోల్ మాన్యువల్‌ను నీటిపారుదల శాఖకు సమర్పించామని, సీకెంట్ పైల్స్‌ను ఏ విధంగా వినియోగించాలనే విషయాన్ని వివరించామని వెల్లడించింది. నిరంతర క్వాలిటీ కంట్రోల్ పరీక్షలకు సంబంధించిన నివేదికలు ఇచ్చామని, ప్రతి మూడునెలలకు ఒకసారి నీటిపారుదల శాఖ జారీ చేసిన వినియోగదారుల సంతృప్తి నివేదికతోపాటు థర్డ్ పార్టీ టెస్ట్ మెటీరియల్, అంతర్గత ఆడిట్ నివేదికలు, ప్రతి వారం రోజులకు ఒకసారి, 28 రోజులకు ఒకసారి క్యూబ్ టెస్ట్ పరీక్షల నివేదికలు అందించామని వివరించింది. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం బ్యారేజీ మరమ్మతులు/పునరుద్ధరణపై ప్రణాళిక అందించాలని ఎల్అండ్‌టీని నీటిపారుదల శాఖ ఇదివరకే కోరగా.. ఇప్పటికే ఒకసారి లేఖ రాసింది. తాజాగా ఎన్‌డీఎస్‌ఏ నివేదికను ప్రశ్నిస్తూ.. మరో లేఖ రాసింది.

రోగులకు అరకొర భోజనం

(మొదటి పేజీ తరువాయి)

లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సర్కారీ దవాఖానాల్లో రోగులకు అందించే ఆహారంపై ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులందాయి. దీంతో వైద్య విద్య సంచాలకులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని బోధనాస్పత్రులు, ఏరియా ఆస్పత్రుల్లో వైద్య ఆరోగ్య శాఖకు చెందిన విజిలెన్స్ బృందాలు తనిఖీలు చేశాయి. తాజాగా సర్కారుకు విజిలెన్స్ ఇచ్చిన నివేదికలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. చాలా చోట్ల డైట్ కాంట్రాక్టర్లు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చినట్లు తేలింది. అలాగే రెండేళ్ల కాల పరిమితికి కాంట్రాక్టు ఇస్తే.. చాలా చోట్ల అంతకు మించి కొనసాగుతున్నట్లు వెల్లడైంది. ఈ నివేదికపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రెండు రోజుల క్రితం ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. తక్షణమే డైట్ కాంట్రాక్టులను రద్దు చేయాలని ఆదేశించారు. కొత్తగా టెండర్లు పిలవాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.



సిఫారసులు ఇవే..

నిబంధనలు పాటించని డైట్ కాంట్రాక్టర్లను తక్షణమే తొలగించాలి. కాల పరిమితి ముగిసిన వారికి ఎక్స్‌టెన్షన్ ఇవ్వొద్దు. డైట్ కాంట్రాక్టుల్లో ఈ-టెండర్ విధానాన్ని పాటించాలి. డైట్ చార్జీలను పెంచాలి. రోజూ రోగులకిచ్చే ఆహార పదార్థాల నమూనాలను సేకరించాలి. భోజనం చేసిన తర్వాత రోగుల అభిప్రాయాన్ని తీసుకోవాలి. డైట్ కాంట్రాక్టర్లకు ఫుడ్, లేబర్ లైసెన్స్‌లను తప్పనిసరి చేయాలి. రోగులకు ఇచ్చే ఆహార పదార్థాల జాబితాను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలి. ట్రాలీలో భోజనం తీసుకువచ్చి అందించే బదులు ప్యాక్ చేసి ఇవ్వాలి. నిబంధనల మేరకు ఆహార సరఫరా చేయని కాంట్రాక్టర్ల నుంచి రికవరీ చేయాలి. అలాగే, ప్రతి బోధనాస్పత్రిలో విధిగా డైటీషియన్ పోస్టులను మంజూరు చేయాలి. ఆహార పదార్థాల విషయంలో ఏమైనా ఫిర్యాదులుంటే తెలియజేసేందుకు రోగుల కోసం ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేయాలి.

తనిఖీల్లో తేటతెల్లం..

- జగిత్యాల బోధనాస్పత్రిలో వంటశాల బాగా ఇరుకుగా, అపరిశుభ్రంగా ఉంది. భోజనంపై రోగులు సంతృప్తిగా లేరు. రోగులందరికీ ఒకే రకమైన ఆహారాన్ని ఇస్తున్నారు. సిరిసిల్ల బోధనాస్పత్రిలో రోగులకు ఇచ్చే భోజనాన్ని తనిఖీ చేయకుండానే ఇస్తున్నారు. ఆ డైట్‌పై రోగులెవ్వరూ సంతృప్తిగా లేరు. వంటగది సరిపోయేంత లేదు. రామగుండం టీచింగ్ ఆస్పత్రిదీ అదే పరిస్థితి.
- మహబూబ్‌నగర్ బోధనాస్పత్రిలో సరైన భోజనం అందించడం లేదు. రోగుల దగ్గరికి వెళ్లి భోజనం ఇవ్వడం లేదు. ఆహార నాణ్యత, పరిమాణం తగినంతగా ఇవ్వడం లేదు. మానసిక, దివ్యాంగులకు అసలు భోజనమే పెట్టడం లేదని తేలింది. అటువంటి రోగులకు సహాయకులు లేకపోవడంతో కాంట్రాక్టర్లు వారిని పట్టించుకోవడం లేదు. విజిలెన్స్ అధికారులు తక్షణమే డైట్ కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని సిఫారసు చేశారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట్ బోధనాస్పత్రుల్లోనూ ఇదే తంతు. నాణ్యమైన ఆహారాన్ని అందించడం లేదు. మెనూలో సూచించిన విధంగా అన్ని రకాల ఆహార పదార్థాలను ఇవ్వడం లేదు.
- పెద్దపల్లి, మంథని, కోరుట్ల, ధర్మపురి ఆస్పత్రుల్లో విజిలెన్స్ సర్వేలో రోగులు అసంతృప్తి తెలిపారు.
- సత్తుపల్లి ఆస్పత్రిలో రోగులకు తాజా ఆహారాన్ని ఇవ్వడం లేదు. అలాగే సరిపోయేంత కూడా అందించడం లేదని రోగులు ఫిర్యాదు చేశారు. బయట వండిన ఆహారాన్ని వడ్డిస్తున్నారు.
- హైదరాబాద్ సుల్తాన్‌బజార్ మెటర్నిటీ ఆస్పత్రిలో కొద్ది రోజులుగా ఒకే తరహా భోజనం పెడుతున్నారు. పెరుగు, చపాతీ, ఇవ్వడం లేదు. నాణ్యత లేని పాలు అందిస్తున్నారు. రోగులందరికీ ఒకేవిధమైన ఆహారం పెడుతున్నారు. రోగులకు పెట్టే భోజనాల సంఖ్యకు, రికార్డుల్లో రాసే వాటికి బోలెడంత వ్యత్యాసం. ఆహారంలో నాణ్యత లేదు. డైట్ రికార్డులను తనిఖీ చేయాల్సిన ఆర్ఎంవోలు వాటిని అసలు చూడటమే లేదు.
- కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో మెనూ పాటించడం లేదు. వంటగదిలో డ్రైనేజీ పొంగుతోంది.
- పేట్లబుర్జు ఆస్పత్రిలో ఆహార నాణ్యత బాగున్నా, ఇండెంట్ పుస్తకాలు సరిగా నిర్వహించడం లేదు.
- సరోజిని కంటి దవాఖానా, నాంపల్లి, గోల్కొండ, మలక్‌పేట్ ఏరియా ఆస్పత్రుల్లో డైట్ మెనూ పాటించడం లేదు. వంట గదుల్లో ఎలుకలు పరుగెడుతున్నాయి. పారిశుధ్యం లోపించింది. వాష్ ఏరియాలో డ్రైనేజీ లీక్ అవుతోంది. నిలోఫర్ ఆస్పత్రిలో అసలు మెనూనే పాటించడం లేదు. డైట్ నమూనాలు నమోదు చేయడం లేదు.
- ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ ఆస్పత్రిలో రోగులందరికీ రోజూ ఒకే తరహా ఆహారం ఇస్తున్నారు. భోజనంలో కూర, గుడ్డు, పెరుగు లేదు. కేవలం పప్పన్నం పెడుతున్నారు. అదే జిల్లా ఉట్నూరు ఏరియా ఆస్పత్రిలో కూడా మెనూ పాటించడం లేదు. వంటగది అపరిశుభ్రంగా ఉంది.

కాళేశ్వరంపై బాధ్యత అంతా కేసీఆర్‌దే!

» కమిషన్ ఎదుట చెప్పనున్న ఈటల



హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఏర్పాటైన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట మాజీ ఆర్థిక మంత్రి, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ జూన్ 6న హాజరు కానున్నారు. విచారణ కమిషన్ జారీ చేసిన నోటీసులకు సమాధానం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా అప్పటి పాలనా పరిస్థితులను కమిషన్‌కు ఈటల తెలిజేయనున్నారని ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పనిచేసిన నేపథ్యంలో ఆయనకు కమిషన్ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధుల సేకరణ కోసం నాటి కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. ఆర్థికశాఖతో సంబంధం లేకుండానే ఆ కార్పొరేషన్ ద్వారా రుణాలు సేకరించింది. పేరుకు ఈటల ఆర్థిక మంత్రిగా ఉన్నా.. మొత్తం వ్యవహారాన్నంతా అప్పటి సీఎం కేసీఆరే నడిపించారని, ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు కూడా ఆయనే చేశారని, ప్రాజెక్టు ఎక్కడ కట్టాలో ఆయనే నిర్ణయించారనే ప్రచారం ఉంది. ప్రాజెక్టు ఎక్కడ కట్టవద్దో ఇంజినీర్లు సూచించినా కేసీఆర్ బేఖాతరు చేశారని, అలాంటిది.. ఆర్థిక మంత్రిని ఆయన పట్టించుకుంటారా? అనే అభిప్రాయాలున్నాయి. పైగా, కాళేశ్వరం ప్రాజెక్టు తన మానసపుత్రిక అని, తన మేధస్సునంతా రంగరించి కడుతున్నామని, అది ప్రపంచంలో ఒక అద్భుతమని కేసీఆర్ ప్రచారం చేసుకున్నారు. సాధారణంగా బడ్జెట్ రూపకల్పన సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి జరిగిన ఖర్చులపై ఆర్థిక మంత్రి సమీక్ష నిర్వహించి.. కొత్త బడ్జెట్‌లో కేటాయింపులు ప్రతిపాదిస్తారు. కానీ, బీఆర్ఎస్ హయాంలో బడ్జెట్ రూపకల్పన ఆర్థిక మంత్రితో సంబంధం లేకుండానే జరిగిపోయిందనే ఆరోపణలున్నాయి. "సంప్రదాయం ప్రకారం బడ్జెట్‌పై ఆర్థిక మంత్రి సమాధానం చెప్పాల్సి ఉన్నా.. అది కూడా జరగలేదు. బడ్జెట్ కూర్పు కూడా ఆర్థిక మంత్రితో సంబంధం లేకుండానే జరిగిపోయిన సందర్భాలున్నాయి. అందువల్ల ప్రాజెక్టు అవినీతితో మా నేతకు సంబంధం లేదు" అని ఈటల సన్నిహిత వర్గాలు స్పష్టం చేశాయి. ఇదే అంశాన్ని విచారణ కమిషన్ ఎదుట ఈటల తన వాదనగా వివరించే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

పాలకుల నిర్లక్ష్యం వల్లే చేనేత నిర్వీర్యం: కూనంనేని

హైదరాబాద్, మే 26 (ఆంధ్రజ్యోతి): పాలకుల నిర్లక్ష్యం వల్లే వ్యవసాయం తర్వాత అత్యంత ప్రాధాన్యం గల చేనేత రంగం నిర్వీర్యమవుతోందని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత పరిరక్షణకు ప్రత్యేక నిధుల కేటాయింపుతోపాటు వృత్తి ఆధునీకరణకు సహకరించాలని సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ సబ్ ప్లాన్ తరహాలో కుల వృత్తుల సంరక్షణ కోసం చేనేత రంగానికి ప్రత్యేక నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కూనంనేని కోరారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో దాటవేత ధోరణి మంచిది కాదన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పాలకులకు ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప వృత్తిదారుల సమస్యలు పట్టవన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.